శ్రీ అరవిందుల

'సావిత్రి'

సంగ్రహ వివరణము

ఆంగ్లము : శ్రీ యమ్. పి. పండిట్

అనువాదము : మానాప్రగడ శ్రీరాములు

ప్రకాశకులు : Dr. వి. మన్మోహన రెడ్డి

శ్రీ అరవిందుల

'సావిత్రి'

సంగ్రహ వివరణము

ఆంగ్లము : శ్రీ యమ్. పి. పండిట్

అనువాదము : మానాప్రగడ శ్రీరాములు

ప్రకాశకులు : Dr. వి. మన్మోహన రెడ్డి

విషయ సూచిక

మూడవ పుస్తకము - దివ్యజనని

(The Book of the Divine Mother)

రెండవ భాగము

నాల్గవ పుస్తకము - జన్మ - ఆన్వేషణ

(The Book of Birth and Quest)

ఐదవ పుస్తకము - ప్రణయము

(The Book of Love)

ఆరవ పుస్తకము - భవితవ్యము

(The Book of Fate)

ఏడవ పుస్తకము - యోగము

(The Book of Yoga)

ఎనిమిదవ పుస్తకము - మృత్యువు

(The Book of Death)

మూడవ భాగము

తొమ్మిదవ పుస్తకము - శాశ్వత నిశీథము

(The Book of Eternal Night)

పదవ పుస్తకము - రెండింతలైన సందెవెలుగు

(The Book of the Double Twilight)

పదకొండవ పుస్తకము - అనంత అహము.

(The Book of Everlasting Day)

పండ్రెండవ పుస్తకము - తుదిపలుకు

(Epilogue)

శ్రీ అరవిందుల 'సావిత్రి'

శ్రీ మాత ప్రసంగము

నీవు 'సావిత్రి' గ్రంథమును చదువుతావా ?

ఆ ! చదువుతాను తల్లీ ! చదువుతాను !

మొత్తం కావ్యమంతా చదివి నావా ?

ఆ ! చదివాను తల్లీ ! రెండు సార్లు చదివాను !

చదివినదంతా నీకు అర్థమైందా ?

లేదు ! కొంచెమే అర్థమైంది, నాకు కవిత్వమంటే ఇష్టం, అందుకని, అది చదువుతాను.

అర్థం కాకపోతే, పరవాలేదు. - 'సావిత్రి' గ్రంథం సదా చదువుతూ ఉండు: చదివినప్పుడల్లా నీకు ఒక క్రొత్త విషయం గోచర మౌతుంది. ప్రతిమారు నూతన మైన ఒకమెరుపు, ఒకనవ్య అనుభూతి కలుగుతాయి. నీకు అర్థం కానివి, అక్కడ లేనివి, హఠాత్తుగ స్పష్ట మై ప్రత్యక్షమవుతాయి. అందలి మాటలు, పదాల నుండి సర్వదా, ఒక అనుకోని దృశ్యం ఆవిర్భవించి దర్శనమిస్తుంది. నీవు ఎన్ని మారులు చదివి అర్థం చేసికొనుటకు ప్రయత్నిస్తావో, అన్నిమార్లు అందులో దాగియున్న ఒక క్రొత్త విషయం విప్పారి గోచరమై నీజ్ఞాన భండారానికి చేరుతూ ఉంటుంది. నీవు ఇదివరలో చదివిన పద్యభాగాలే వెనుకటికంటె విభిన్నమైన ఒక నూతన కాంతిలో, నీవు తిరిగి చదివినప్పుడల్లా దర్శనమిస్తూ ఉంటాయి. ఇది అనివార్యంగా సంభవిస్తుంది. సర్వదా నీ అనుభూతి సుసంపన్న మౌతూ ఉంటుంది. అడుగడుగునా ఒక నూతన దృశ్యం అభివ్యక్తమై దర్శనమిస్తూ ఉంటుంది.

కాని, నీవు ఈ గ్రంథాన్ని ఇతర పుస్తకాలవలె, వార్తాపత్రికలవలె చదవ కూడదు. నీ మస్తిష్కం ఇతర ఆలోచన లేవియు లేక నిర్మలమై ఖాళీగ ఏ విధమైన

వ్రాతలు లేని పట్టీ వ్రాతబల్ల వలె ఉండాలి. నీవు ఏకాగ్రతతో యతచిత్తుడవై, ప్రశాంతతతో ఉన్ముఖుడవై, నిశ్చలముగా ఉండాలి. అప్పుడు అందలి పదాలు, లయలు, కంపనలు నేరుగ నీమస్తిష్కం లోనికి పోయి, నీ మెదడుపై తమ ముద్రవేస్తాయి; నీ ప్రయత్నంతో నిమిత్తం లేకుండా తమభావాన్ని నీకు విపులీకరిస్తాయి.

మహోన్నతమైన ఆధ్యాత్మిక శిఖరాలను ఆరోహించటానికి ఒక్క 'సావిత్రి' గ్రంథం చాలును. 'సావిత్రి' గ్రంథం ఎవరైనా ధ్యానపరమైనఅధ్యయనం చేయ గలిగితే వారికి అవసరమైన సహాయాన్నంతా పొందగలుగుతారు. ఈ మార్గాన్ని (శ్రీ అరవిందులపూర్ణ యోగమార్గాన్ని) అనుసరించదలచే వారికి ఇది ఒక సుస్థిరమైన సహాయన్ని అందిస్తుంది. అట్టివానిని, ఆ ప్రభువే (శ్రీ అరవిందులే) చేయిపట్టుకొని, చేయవలసిన పరమ పదానికి నడిపించుకొనిపోవును. అప్పుడు ఎంతగొప్పవ్యక్తిగత సమస్యలైనా దీనిలో సమాధానం దొరుకుతుంది. ప్రతి క్లిష్ట పరిస్థితికి పరిష్కారం లభిస్తుంది. నిజానికి యోగాభ్యాసానికి అవసరమైన సర్వవిషయాలు దీనిలో ఉన్నాయి.

ఈ ఏకైక గ్రంథంలో శ్రీ అరవిందులు విశ్వాన్నంతా ఇమిడ్చి నిబంధించారు. ఇది ఒక అద్భుతమైన గ్రంథము; దేదీప్యమానమై అపురూప, అసమానమైన పరిపూర్ణతతో విరాజిల్లుతున్న గ్రంథమిది.

నీకు తెలుసునా! 'సావిత్రి' గ్రంథరచన ప్రారంభించటానికి ముందు శ్రీ అరవిందులు నాతో ఇలా అన్నారు.

"నేనొక నూతన సాహసానికై ప్రేరేపింపబడుచున్నాను; మొదట సంశయించాను. కాని, ఇప్పుడు నేను నిశ్చయించుకొన్నాను. అయినా, నేనెంత వరకు విజయం సాధించగలనో తెలియదు. నేను భగవదనుగ్రహం కొరకు ప్రార్థిస్తున్నాను".

దీని అర్థమేమిటో, నీకు తెలుసునా?

నీకు ముందే హెచ్చరిస్తున్నాను, ఇది ఆయన మాటతీరు, దివ్యనమ్రతతో నిండిన బిడియము. ఆయన ఎన్నడూ అహంకారంతో నొక్కి వక్కాణించరు.

ఆయన ఈ గ్రంథరచనకు వాస్తవంగా ప్రారంభించిన రోజున నాతో ఇలా అన్నారు:

"అంతులేని అనంతత్వంలోనికి, చుక్కాని లేని పడవపై ప్రయాణం చేయటానికి ప్రారంభించాను".

ఆరంభించిన తరువాత, ఆపకుండ పేజీలతరబడి వ్రాశారు. అదంతా, ఉన్నత భూమికలలో ఇదివరకే పూర్తిగ రూపు దాల్చి ఉన్న దానిని తాను కాగితంపై కలంతో వ్రాయటం మాత్రమే అన్నట్లు రచన సాగిపోయింది.

నిజానికి, 'సావిత్రి' కావ్యం మొత్తం ఉన్నత సీమలనుండి, ఒక్కమారు మూకుమ్మడిగ అవతరించగ, శ్రీ అరవిందులు తన ప్రజ్ఞాప్రాభవాలతో ఆ కవితాపంక్తులను ఒక క్రమంలో కూర్చి, ఒక మహోన్నత అద్భుతశైలిలో రూపొందించారు. కొన్ని సమయాలలో వందలాది పంక్తులు, అంతఃస్ఫురణతో దొర్లిరాగా, శ్రీ అరవిందులు వాటిని అట్లే ఉంచారు. కవిత్వం (కవితావేశము) ఉన్నత సీమలనుండి ప్రేరేపింపబడుటకు ఆయన నిర్విరామమైన కృషి చేసి గొప్పగ శ్రమపడ్డారు. ఏమి వైభవోపేతమైన గ్రంథరాజాన్ని సృష్టించారు! ఔను అది ఒక వాస్తవమైన సృష్టియే. దానితో సమానమై పోల్చదగిన మరియొక గ్రంథం లేదు. సర్వం దానియందున్నది; అయినా, దాని స్వరూపం అతి విస్పష్టత, చక్కని నిర్మలత్వాలతో వెలుగొందుతున్నది. అందలి పద్యాలు, పరిపూర్ణమైన సామరస్యం కలిగి, పదలాలిత్యంతో తేటతెల్లమై దొర్లుచు, శాశ్వత సత్యాన్ని వహించి ఉన్నాయి.

బిడ్డా! నేను అనేక గ్రంథాలను చదివాను: కాని, 'సావిత్రి' గ్రంథంతో సమానమైనది నాకు తటస్థపడలేదు. నేను గ్రీక్, లాటిన్, ఇంగ్లీషు భాషలలో శ్రేష్ఠమైన గ్రంథరాజాలను అధ్యయనం చేశాను; అట్లే, ఫ్రెంచి, జర్మన్ వాఙ్మయాల లోని పేరెన్నికగన్న, పుస్తకాలను పఠించాను, అంతేకాదు, ప్రాక్పశ్చిమదేశాలలోని గొప్ప పౌరాణిక గ్రంథాలను చదివాను; కాని నేను తిరిగి ఉగ్గడిస్తున్నాను 'సావిత్రి' గ్రంథంతో సమానమైన ఉద్గ్రంథం నాకు కనపడలేదు. సాహిత్యగ్రంథా లన్నియు, వట్టి పేలవంగా తత్వసారం లేని రసహీనమైన చప్పని రచనలుగా నాకు కనిపించాయి. అసాధారణమైన, అరుదైన కొద్ది పుస్తకాలుతప్ప, అవి కూడ 'సావిత్రి'లోని అల్పమైన అంశంగానే తోచును. ఏమి వైభవము! ఏమి వైశాల్యము (విస్తరణ)! ఏమి వాస్తవికత! ఆయన సృష్టించింది ఒక శాశ్వతమైన అమృత గుళిక. తిరిగి

ఉద్ఘాటిస్తున్నాను, ఈ ప్రపంచం మొత్తంలో దానితో సమానమైనది లేదు. అందలి సాక్షాత్కారసంబంధమైన యథార్థ తత్త్వదర్శనములను ప్రక్కన పెట్టినా, అందలి సారభూతమైన, భావావేశప్రేరణను, కవిత్వపంక్తులను మాత్రమే గమనించినను, దాని విశిష్టత శ్రేష్ఠమైన ప్రాచీన సాంప్రదాయికమైన కోవకుచెంది ఉంది. ఆయన సృష్టి మానవుని ఊహ కందదు; అతని కర్థం కాదు. ఏలన, అందు ప్రతిపర్వంలో నిశ్శేషమైన సర్వం ఇమిడి ఉంది.

'సావిత్రి' గ్రంథం ఒక భగవదావిష్కరణం, ఒక దివ్యధ్యానం, అనంతం, శాశ్వతమైన పరాత్పర తత్త్వాన్వేషణమని భావించవచ్చును. అమృతత్వానికై చేసే ఆకాంక్షదృష్టితో, దానిని పఠించినట్లైతే, ఆ పఠనమే అమృతత్వాన్ని అందించే మార్గదర్శి కాగలదు. 'సావిత్రి' గ్రంథపఠనమే యోగాభ్యాసం; ఆధ్యాత్మిక ఏకాగ్రత; భగవత్సాక్షాత్కారానికి అవసరమైనవన్నీ అందు లభ్యం కాగలవు. యోగంలోగల మెట్లన్నీ (దశలన్నీ) అందు సూచింపబడ్డాయి; ఇతర యోగాలలోని రహస్యాలు కూడ అందు వివరింపబడ్డాయి. ఆ గ్రంథంలోని ప్రతి పంక్తిలోను వివరింపబడిన విషయాన్ని, అతిశ్రద్ధతో అనుసరిస్తే, తప్పక అతడు చివరకు అతిమానస యోగంలోని రూపాంతరీకరణసిద్ధిని పొందగలుగుతాడు. అది, నిజానికి ఒక అమోఘమైన మార్గదర్శి; అది నిన్ను మధ్యలో వదలివేయదు. అందలి మార్గాన్ని అనుసరించిన వాళ్లకు అది సర్వదా సహకరిస్తుంది.

'సావిత్రి' ప్రతి పద్యం ఆవిష్కరింపబడిన మంత్రమే. అది మానవుడు సాధించిన సర్వజ్ఞానాన్ని అతిక్రమించి ఉన్నది. నేను తిరిగి చెపుతున్నాను. దానిలోని ప[illegible]హార్పు, ప్రస్ఫుటనలు, లయబద్ధమైన స్వరధ్వనితో నిండి శబ్దము యొక్క మూలస్థానమైన ఓంకారం వద్దకు నిన్ను తీసికొనిపోవును.

నా బిడ్డా! ఔను, సర్వం అందున్నది. రహస్యవిద్యాతత్త్వం, గూఢవిద్య, తత్త్వశాస్త్రం, పరిణామసిద్ధాంతచరిత్ర, మానవజాతిచరిత్ర, దేవతలచరిత్ర, సృష్టిక్రమం, ప్రకృతిస్వరూపం, ఒక్కటేమిటి, అన్నీ అందులో ఉన్నాయి. ఈ విశ్వం ఎట్లు సృష్టింపబడింది? ఎందుకు సృష్టింపబడింది? ఏ ఉద్దేశంతో సృష్టింపబడింది, దీని పరమార్థం ఏమిటి? విధి విధానం ఎలాంటిది? ఈ విషయాలన్నీ దానిలో

ఉన్నాయి. నీకు స్ఫురించే ప్రశ్నలన్నిటికి అందులో సమాధానం దొరుకుతుంది. సర్వం విశదీకరింపబడింది; మానవుని భవిష్యత్తు, పరిణామ భవిష్యత్తులు కూడా, అంతే కాదు, ఇంతవరకు ఎవరికీ తెలియని విషయములు దానిలో వివరింపబడినాయి. ఈ ప్రపంచ రహస్యాన్ని తెలిసికొనగోరే ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు అతి తేలికగా అవగాహన చేసికొనగల, అందమైన భాషలో సుస్పష్టంగా వర్ణింపబడింది. కాని, ఆ రహస్యము పదములు పంక్తుల వెనుక (నేర్పుగ) నిక్షిప్తం చేయబడింది. దానిని కనుగొనదలచిన వ్యక్తి వాస్తవమైన స్థాయిని అందుకొన్న చైతన్యం (జ్ఞానం) కలిగిఉండాలి. ఆ గ్రంథంలో భవిష్యత్తులోని విషయాలను రాబోవుకాలం లోని పోకడలు అద్భుతమైన విస్పష్టతతో ప్రకటించబడినది. సత్యాన్వేషణకు చైతన్యాన్ని కనుగొనటానికి, ఈ ప్రపంచంలోని సమస్యలను పరిష్కరించటానికి అవసరమయ్యేసాధ్యాన్ని శ్రీ అరవిందులు అందులో వివరించారు. జడపదార్థం (నిశ్చేతన) ద్వారాన్ని తెరచి దానిగుండా కాంతిరేఖలను ప్రసరింపజేసి, దానిని రూపాంతరీకరించేవిధానాన్ని ఆ గ్రంథంలో సూచించారు. అజ్ఞానంనుంచి విముక్తి పొంది, ఉన్నత భూమికలలోకి పోయే మార్గాన్ని నిరూపించారు. ప్రతి చైతన్య భూమికను ఎలా ఆరోహించాలో, ఎలా మృత్యువుయొక్క అవరోధాన్ని అధిగమించాలో వివరించారు. ప్రతి స్థితిని ఎలా చేరాలో, అమృతత్వాన్ని ఎలా సాధించాలో ఆవిధానాలను అన్నిటిని, విపులంగా తెలియజేశారు. ఆ (యోగ) ప్రయాణాన్ని అంతా విస్పష్టంగా వర్ణించారు. నీవు ముందుకు సాగే కొద్దీ మానవుడికి ఏమీ తెలియని అనేక విషయాలు నీవు తెలుసుకొనగలుగుతావు. 'సావిత్రి' గ్రంథమంటె ఇదే; ఇంతేకాదు, ఇంకా ఎంతో ఉంది. అది - 'సావిత్రి' గ్రంథపఠనమే ఒక వాస్తవమైన అనుభూతి. మానవుడు సంపాదించిన రహస్యాలను అన్నిటిని అయన ఆవిష్కరించారు. అంతేగాక. మానవుడికోసం భవిష్యత్తులో ఎదురుచూస్తున్న వాటిని కూడ ఆయన ఆవిష్కరించారు.ఇవన్నీ 'సావిత్రి' గ్రంథంయొక్క లోతులలో (మూలంలో) కలవు. కాని, వాటిని - అనగా, చైతన్యభూమికా అనుభూతిని, అతి-మానసానుభూతిని మృత్యుతరణ (మృత్యుంజయ) అనుభూతిని, తెలుసుకొనటానికి నీకు తగినంత జ్ఞానం ఉండాలి. పూర్ణయోగంలో సమగ్రమైన ప్రగతిని సాధించటానికి అవసరమైన అన్నిదశలను. ప్రతిమెట్టును ఆయన నిరూపించి వర్ణించారు.

ఇదంతా ఆయన స్వయంగా అనుభవించినదే. అంతకంటె ఎక్కువ ఆశ్చర్య కరమైన విషయమేమంటే ఇదంతా నేను స్వయంగా అనుభవించింది కూడ. ఆయన నా సాధననే అందు ప్రకటించినారు. ఆయన ప్రదర్శించిన ప్రతి వస్తువు ప్రతి సంఘటన ప్రతి సాక్షాత్కారం ఆయన చేసిన వర్ణనలు, దానిలో పేర్కొనబడిన రంగులతో సహా నేను చూచినవి. ఆయన ప్రయోగించిన పదాలు వాక్యాలు అన్నీ సరిగ్గా నేను విన్నవే. ఇదంతా నేను ఆ పుస్తకం చూడక ముందే సంభవించిన విషయం. తరువాత నేను 'సావిత్రి' గ్రంథాన్ని అనేక పర్యాయాలు చదివాను. కాని ఇతఃపూర్వం ఆ గ్రంథరచన చేస్తున్నప్పుడు ఆయన నాకు చదివి వినిపిస్తూ ఉండేవారు. ప్రతి ఉదయం ఆయన 'సావిత్రి' గ్రంథం చదువుట, నేను వినుట జరుగుతూ ఉండేది. ఆయన రాత్రి సమయంలో వ్రాసి ఉదయమే నాకు వినిపిస్తూ ఉండేవారు. నాకు వింతగా కనిపించిదేమంటే ఆయన ఉదయం చదివి వినిపించిన విషయములే నాకు గతరాత్రి సంభవించిన విషయాలవటం మాటలు కూడ అవే; ఔను, వర్ణనలు రంగులు చిత్రాలు నేనుచూచినవే, మాటలు నేను విన్నవే, అన్నీ నేను విన్నవే. శ్రీ అరవిందులు అద్భుతమైన రసవంతమైన కవితలో రచించారు. నేను గత రాత్రి ఏమి అనుభవించానో, అవే ఆయన మరుసటి ఉదయం నాకు చదివి వినిపించేవారు. అది ఒక రోజు మాత్రమే కాదు, యాదాలాపంగా జరిగింది కాదు. రోజులతరబడి అట్లు జరిగింది. ఆయన చెప్పిన విషయాలనీ నాకు గత రాత్రి కలిగిన అనుభూతులతో పోల్చి చూచుకొనే దానిని. అవి సరిగా సరిపోతూ ఉండేవి. నా అనుభూతులు ఆయనకు చెప్పితే ఆయన తరువాత కవిత్వంలో నిబంధించటం కాదు. నేను దర్శించిన దంతా ఆయనకు ఇదివరకే తెలిసి ఉన్నదే. నా అనుభూతు లను విస్తృతంగా ఆయన ప్రకటించారు. అవి ఆయన అనుభవాలు కూడ. అది, మేమిద్దరం అవ్యక్తం, తెలియరాని తత్త్వం, అతిమానసంలోకి చేసిన సాహస ప్రయాస గాథ.

ఈ విషయాలు శ్రీ అరవిందులు తన జీవితంలో అనుభవించిన వాస్తవాలు, విఖ్యాతీత సత్యాలు. సాధారణ మానవుడు కష్టసుఖాలను అనుభవించినట్లుగా, భౌతికంగా అనుభవించారు. నిశ్చేతన తమోమయ అంధకారాలలో, మృత్యువు పొలిమేరలలో గూడ, శ్రీ అరవిందులు సంచరించారు. ప్రాపంచిక దుఃఖాలనే

బురదలోనుండిఆవిర్భవించారు:విశాల ఆధ్యాత్మిక సామ్రాజ్యసరిహద్దులలో వాయువును పీలుస్తూ, పరమానంద సీమలో ప్రవేశించారు. ఆయన భూమికలన్నింటి గుండా ప్రయాణం చేస్తూ వాటి పరిస్థితులను, పర్యవసానములను అనుభవిస్తూ, ఊహకు మించిన భౌతిక బాధలను సహనంతో అనుభవించారు. ఆయనవలె అనేకకష్టాలను అనుభవించిన వ్యక్తి ఇంతవరకు ఎవరును చేరని చెప్పవచ్చును. పరాత్పరుడితో ఐక్యంచెందటం వలన కలిగే ఆనందముగ దుఃఖాన్ని రూపాంతరీకరించటానికి ఆయన వాటిని (దుఃఖాలను) అనుభవించి రుచిచూచారు. ఇది ప్రపంచచరిత్రలోనే విశిష్టమైన, అసమానమైన ఒక సంఘటన. ఇదివరలో ఇట్టి సంఘటన - అనగా అతిమానస భూమికలోనికి మనం నిశ్చయజ్ఞానంతో ధైర్యముగ ఆరోహించగలగటానికి, అపరిచిత సీమలలో మార్గాలను మొట్టమొదటగా శ్రీ అరవిందులు ఏర్పాటు చేశారు. మన సాధన సునాయాసంగా ఉండేటట్లు చేశారు. 'సావిత్రి' గ్రంథం ఆయన రూపాంతరీకరణయోగాన్ని సంపూర్ణంగా వివరించే మహాకావ్యం. ఈ పూర్ణ యోగం ప్రప్రథమంగా భౌతికచైతన్యంలో ప్రతిష్ఠించి ప్రదర్శించటం, ఇదే మొదటిసారి.

కాని, మానవుడు దీనిని అర్థంచేసికొని గ్రహించటానికి ఇంకా సిద్ధం కాలేదు. అది అతి ఉన్నతం, అతివిశాలమై అతనికి అందుబాటులో లేదు. 'సావిత్రి' గ్రంథం మానసిక బుద్ధితో అర్థంచేసుకొనటం అసాధ్యం. కనుక, మానవుడు, దానిని తెలుసుకొనటం గాని గ్రహించటంగాని సులభసాధ్యం కాదు. ఆ గ్రంథాన్ని అర్థంచేసుకొని, జీర్ణించుకొనటానికి, ఆధ్యాత్మిక అనుభూతులు అవసరం. యోగసాధనలో ముందుకు సాగి గొప్ప ప్రగతి సాధించినవాడే దానిని చక్కగ జీర్ణించుకొనగలుగుతాడు. కాదు! ఆ గ్రంథంలోని కవిత్వం, ఆయన రచించిన 'భవిష్యత్ కవిత' (Future poetry) లో ఉటంకించిన కవితాశైలిలో రచింపబడింది. అందుచేత, అది భవిష్యత్కాలానికి చెందిన గ్రంథం. ఆ కవిత్వ శైలి అతి సూక్ష్మం, అతిసున్నితం. అది మనస్సుతోగాని, మనస్సు ద్వారా గాని, రచింపబడలేదు: అది ఒకానొక ధ్యానసమాధిలో ఆవిష్కరింపబడింది.

కొందరు పెద్దమనుష్యులు, దానిని 'హోమర్', 'వర్జిల్' కవుల గ్రంథాలతో పోల్చి, వాటికంటె క్రింది శ్రేణిలోనిదని చెప్పటానికి సాహసిస్తున్నారు. వారికి అది

అర్థం కాలేదు; అర్థం కాదు. వారికి ఏమి తెలుసు? ఏమీ తెలియదు. వారికి దానిని బోధించుట వృథా ప్రయాస. సుదూర భవిష్యత్తులోనే మానవుడు దానిని అర్థం చేసుకొనగలడు. నేను చెప్పుతున్నాను, విను; ముల్లోకాలలో 'సావిత్రి' గ్రంథంతో సమానమైన గ్రంథం వేరొకటి లేదు. అది గూఢాతిగూఢమైన గ్రంథము. అది 'పరమోత్కృష్టమైన పురాణము'; అది పరమ శ్రేష్ఠమైన సాహిత్యము, అత్యుత్తమమైన కవిత్వము, మహోన్నతమైన దర్శనము, గ్రంథవిస్తారాన్ని అనగా అందలి పంక్తుల సంఖ్యను బట్టి కూడ అది ఒక గొప్ప గ్రంథం. ఈ మానవుడు మాట్లాడే మాటలు దానిని (సావిత్రి గ్రంథాన్ని) వర్ణించలేవు. దానిని వర్ణించటానికి, ఉత్తమోత్తమం (Superlative and Hyper-bole) వంటి పదాలు కావలెను. అది ఒక పరమోత్కృష్టమైన బృహత్పురాణము. మానవుని మాటలు దానిని లేశమాత్రమైనా వర్ణించలేవు. దాని విలువ అపారము. ఆధ్యాత్మిక విలువలు తదితర విలువలు అన్నీ దానిలో ఉన్నాయి. అందలి విషయం శాశ్వతమైనది. అది చేసే ప్రబోధం అనంతము. దాని క్రియాశీలశక్తి, క్రియావిధానాలు అద్భుతాలు. నీవు ఆ గ్రంథానికి ఎంత సన్నిహితం కాగలిగిన, ఎంత చక్కగా అధ్యయనం చేయగలిగిన అది నిన్ను అంత ఉన్నతంగా ఉద్ధరించగలుగుతుంది. అది అనిర్వచనీయమైన ఒక అద్భుతం; పరమ పవిత్రము; శ్రీ అరవిందులు మానవజాతికి అంకితంచేసిన అతిసుందరమైన గ్రంథరాజం; పరమ శ్రేష్ఠమైనది. అదేమిటో (అందేమున్నదో)? మానవు డెప్పుడు తెలుసుకోగలడు? మానవుడు సత్యజీవితాన్ని ఎప్పుడు ఆచరించగలడు? తన జీవితంలో ఈ గ్రంథాన్ని ఎప్పుడు జీర్ణించుకోగలడు? ఇదంతా ముందు కాలంలో గమనించవలసి ఉంది.

బిడ్డా! 'సావిత్రి' గ్రంథం ప్రతిరోజు పఠించాలి. సక్రమపద్ధతిలో చదవాలి; తిన్ననైన మానసిక ప్రవృత్తితో చదవాలి. అది తెరచి, చదవడానికి ముందు మనస్సును అతినిర్మలంగా చేసి ఉంచుకోవాలి. ఏ రకమైన ఆలోచనలు లేకుండా చేసి, ధ్యానంతో ఏకాగ్రం చేయాలి. దానిని చేరటానికి రాజబాట హృదయమే. నేను చెప్పుతున్నాను విను. నీవు వాస్తవమైన ఆకాంక్షతో ఏకాగ్రతలో ఉండగలిగితే, నీలోని జ్యోతిని, నీ అంతరాత్మజ్యోతిని,పరిశుద్ధ, ప్రవిత్రజ్యోతిని,అతిస్వల్పకాలంలో వెలిగించుకోగలవు. బహుశః కొద్ది రోజులలోనే చేయగలవు. సాధారణంగా నీవు

చేయలేని పనులన్నీ 'సావిత్రి' సహాయంతో చేయగలవు. ప్రయత్నించు: దాని విశిష్టత, నవ్యత నీకే తెలియగలదు. ఈ దృష్టితో ఈ విధమైన పూర్వరంగం గల చైతన్యంతో శ్రీ అరవిందులకు నీవు చేసే అర్పణగా పఠనం చేయాలి. 'సావిత్రి' గ్రంథం ఒక చైతన్యగర్భితమూర్తిగా మార్గదర్శిగా నీవు గ్రహించగలవు. నేను తిరిగి చెప్పుతున్నాను. యోగాభ్యాసం చేయటం అవసరమని తలచి, నిజాయితీతో కోరుకొనేవాళ్ల 'సావిత్రి' సాహాయ్యంతో ఉన్నతమైన యోగశిఖరాలను ఆరోహించగలరు. వాళ్ల 'సావిత్రి' మహాకావ్యంలోని రహస్యాన్ని గ్రహించగలరు. గురువు అవసరం లేకుండానే తెలియగలరు.సాధకుడు దానిని ఎక్కడైనా అభ్యసించ గలడు. అతనికి అవసరమైన విషయాలన్నీ 'సావిత్రి' గ్రంథంలో కనుగొనగలడు అదే అతనికి మార్గదర్శి. అతనికి కష్టాలు వావరించినప్పుడుగాని, ప్రగతి సాధించటంలో ఎటుమళ్లవలెనో తెలియనప్పుడుగాని, అవరోధాలను అధిగమించ వలసివచ్చినప్పుడుగాని, ఇవి సాధారణంగా ప్రతిక్షణం ప్రతి మానవుడికి ఎదురయ్యే క్లిష్టపరిస్థితులు - అతడు ప్రశాంతచిత్తంతో నిశ్చలంగా ఉన్నచో అవసరమైన సూచనలు, అవసరమైన సుస్థిరసహాయాలు అందగలవు. అతడు ప్రశాంతంగా ఉండి భగవంతుడికి ఉన్ముఖుడై చిత్తశుద్ధి గల ఆకాంక్ష కలిగిఉంటే, చేయిపట్టుకొని నడిపింపబడుతున్నట్లు సర్వదా అనుభూతి పొందుతాడు. అతడు విశ్వాసంతో చిత్తశుద్ధితో ఆత్మార్పణ చేసుకొనగలిగితే జీవితపరమార్థాన్ని (యోగంయొక్క పరమ లక్ష్యాన్ని) చేరగలడు.

నిజంగా, 'సావిత్రి' గొప్ప పటిష్ఠ, సజీవ గ్రంథము: అది చైతన్య (చిచ్ఛక్తి) గుంభితమై ఉంది. అది మానవపరమైన మతాలకు, తత్త్వశాస్త్రాలకు అతీతమైన పరమోన్నత జ్ఞానంతో నిండిఉంది. అదే ఆధ్యాత్మిక పథం, యోగం, తపస్సు, సాధన, సర్వం అదే.అది ఏకరూపంగా విరాజిల్లుతున్నది.'సావిత్రి'లో అమోఘమైన శక్తి ఉంది. అందుకొనే సామర్థ్యం గలవాళ్లకి అది స్పందనలను విరజిమ్ముతుంది. అవి ప్రతి చైతన్యభూమికనుండి బయలుదేరే వాస్తవమైన కంపనలు. అది ('సావిత్రి' గ్రంథం) నిరుపమానమైనది, సర్వైశ్వర్య సంపన్నమైన సత్యం. శ్రీ అరవిందులు దానిని ఈ భూలోకంలోకి తీసుకొనివచ్చారు. శిష్యా! 'సావిత్రి'

రహస్యాన్ని కనుగొనటానికి ప్రయత్నించు; భవిష్యత్తును ఉద్దేశించి, శ్రీ అరవిందులు ఇచ్చిన సందేశం మనకోసం దానిలో ఆవిష్కరించబడింది. నీవు ఆచరించవలసిన నీ ముందున్న పని ఇదే. ఇది కష్టసాధ్యమైనప్పటికీ, ఆచరణయోగ్యమైనది.

5-11-1967 ఆశీస్సులు

* * *

నీవు నిస్పృహ చెంది, దిగాలుపడి ఉన్నప్పుడు దుఃఖసాగరంలో మునిగి ఉన్నప్పుడు, నీవు చేసే పనులు నిష్ఫలాలైనప్పుడు, నీవు ఎంత ప్రయత్నంచేసినా, ఆశించిన ఫలితాలకు వ్యతిరేకమైనవి సంప్రాప్తం కావచ్చు; అప్పుడు నీ పరిస్థితికి, సంయమనాన్ని కోల్పోయి, ఉద్రేకానికి లోనవుతావు; అపుడు, జీవితం అసహ్యమై విషాదభరితం కావచ్చు; అప్పుడు వెంటనే 'సావిత్రి' గ్రంథాన్ని తీసుకొని, ఒక్క క్షణం చిత్తాన్ని ఏకాగ్రంచేసి పుస్తకంలో ఏదో పుట తెరచి, చదువు. అప్పుడు నీ విచారమంతా మబ్బు వీడిపోయినట్లు తొలగిపోతుంది. దుర్భరమైన దుఃఖాన్ని అధిగమించగలిగే బలం చేకూరుతుంది. నిన్ను బాధిస్తున్న విషాదం నిన్ను విడిచి వెళ్లిపోతుంది. సమస్తాన్ని జయించగల, ఎదురుతిరిగిన చైతన్యం శక్తిసామర్థ్యాలతో, అసాధ్యమనేది లేదనే నిశ్చయ భావాన్ని కల్పించు, ఒకానొక సుఖానుభూతి నీలో కలుగుతుంది. నీలోని సమస్తాన్ని పరిశుద్ధం చేసుకొని, అంతులేని పరమానందాన్ని అనుభవిస్తావు. నీవు ఏ కొద్ది పంక్తులు చదివినా, చాలును, అది నీ అంతరాత్మతో సంస్పర్శ కలిగిస్తుంది. ఇది 'సావిత్రి' గ్రంథం యొక్క మహోజ్వలమైన శక్తి. లేక, కొన్ని పంక్తులు చదివిన పిమ్మట, ప్రగాఢమైన ఏకాగ్రతపొందితే, నిన్ను బాధిస్తున్న సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. నీవు 'సావిత్రి' పుస్తకాన్ని ఆలోచించకుండా యాదాలాపంగా తెరిస్తే, నీకు అక్కడ నీ సమస్యకు సమాధానం దొరకుతుంది. ఈ పని సంపూర్ణమైన విశ్వాసంతో, నిష్కల్మషమైన హృదయంతో తిన్ననైన బుద్ధితో చేస్తే, ఫలితం తప్పకుండా లభించగలదు.

ఆశీస్సులు.

శ్రీ అరవిందుల

'సావిత్రి'

(సంగ్రహ వివరణము)

ఉపోద్ఘాతం

'సావిత్రి' * ఉపాఖ్యానం అందరకు తెలిసిందే. మద్ర దేశపు రాజగు అశ్వపతి, బిడ్డలు లేనివాడై యుండెను. ఆయన సావిత్రీదేవిని, తీవ్రమైన తపస్సుతో ఉపాసించి, ఒకకూమార్తె కలుగునట్లు, ఆమెవల్ల వరం పొంది, ఆ బిడ్డకు సావిత్రి అను పేరు పెట్టెను. ఆమె అమితమైన సౌందర్యం అసమానమగు ప్రతిభ కలిగి పెరుగుచుండెను. ఆమె వ్యక్తిత్వం అతి గంభీరం, అధికార గుణ సంపన్నమగుటచే ఎవరును ఆ రాకుమార్తెను వివాహమాడుటకు ముందుకు రాకుండిరి. తన భర్తను తానే అన్వేషించుకొన ఆదేశింపబడి బయలుదేరి వెళ్ళెను. రెండుసంవత్సరాల అనంతరం తిరిగివచ్చి, తాను ద్యుమత్సేనుని (బహిష్కరింప బడిన సాల్వదేశపు గ్రుడ్డిరాజు) యొక్క కుమారుడగు సత్యవంతుని తనకు భర్తగ ఎంచుకొనినట్లు, తండ్రిగారితో కొలువున చెప్పెను. అప్పుడక్కడ ఉన్న నారద మహాముని ఆ ఎంపికయందలి ప్రమాదాన్ని సూచించెను. అనగా, సత్యవంతుని ఆయుర్దాయం ఒక సంవత్సరంకంటె లేదని హెచ్చరించెను. కాని, సావిత్రి చలించక వివాహమాడెను. సావిత్రి సత్యవంతునితో జీవించుచు, అత్తమామలను సేవించుచు, అరణ్యంలో సామాన్య జీవితం గడపెను. సంవత్సరకాలం, క్షణాలలో గడచి పోయింది. సావిత్రి దగ్గరుండగ, సత్యవంతుడు అరణ్యంలో కట్టెపుల్లలు కొట్టు

---

* ఇది మహాభారతంలోని అరణ్యపర్వంలో 291 - 297 అధ్యాయంలలోని కథ.

ఉండగ, మృత్యుదేవత ప్రత్యక్షమాయెను. సావిత్రి నిర్భయంగ యముని అనుస రించి, తనశుద్ధభావంతో, శక్తిసామర్థ్యాలతో, యమపాశంనుండి సత్యవంతుని విముక్తుని గావించుకొని, తిరిగి వచ్చెను.

సంక్షిప్తంగ భారతంలోని కథ ఇది. దీనిని శ్రీ అరవిందులు, అమృ తత్వం సాధించుటకు, మానవుడు ఆచరించు అన్వేషణకు సంకేతంగా మలిచెను. ఇందు ప్రాణశక్తినియామకుడగు అశ్వపతి, అజ్ఞానంనుండి ఆత్మ స్వేచ్ఛగ, దివ్యతత్త్వాలైన అమృతత్వం, ఆనందం, శక్తి, జ్ఞానాలుగ జీవితం పరిపూర్ణత నొందవలెనను ఆకాంక్ష మూర్తీభవించిన వికసిత మానవుడు. ఆయన ఆత్మజ్ఞానం, విశ్వవిజ్ఞానం, బ్రహ్మజ్ఞానాలను సంపాదించుటకు, బహుముఖయోగం అవలంబించెను. ఆధ్యాత్మిక సిద్ధి శిఖరములనంది, పరాశక్తిని, ఈ ప్రాపంచిక క్లేశ విమోచనంకొరకు అవతరించవలసినదిగ ప్రార్థించెను. ఆ దివ్యమాత, జగజ్జనని అతని ప్రార్థన విని, తన ప్రత్యేకానుగ్రహంగ, మానవరూపంలో సావిత్రిగ జన్మింతునని వరమిచ్చి అవతరించెను.

సావిత్రి మానవలోకములో, తన అద్భుత మహాత్మ్యాన్ని వెదజల్లుచు, భూలోక వాతావరణం అంతను శోభాయమానంగ ప్రజ్వరిల్లజేయుచు, పెరుగు చుండెను. యుక్తవయస్సు వచ్చినంతనే, తన జీవితభాగస్వామిని, అన్వేషించి వరించు టకు బయలుదేరి, మూర్తీభవించిన సత్య స్వరూపం, సత్యవంతుడను నామధేయం గల వానిని ఎన్నుకొనెను. నారద మహాముని, సత్యవంతుని జీవిత మొక సంవత్స రంలో ముగియునను ఘోరమైన భవిష్యత్తును వెలిబుచ్చినను, సావిత్రి సత్యవంతునే వివాహమాడెను. మర్త్య లోకంలో సత్యాన్ని స్థాపించుటకు వ్యర్థ ప్రయత్నం చేయుచున్న మానవ ప్రతినిధియగు సత్యవంతుని, విధినిర్దిష్టమైన రోజున మరణం ఆవరించెను. కాని అసత్య సూత్రధారియగు యమునితో, మూర్తీభవించిన దివ్యాను గ్రహమగు సావిత్రి, పోరి, తనతేజస్తత్త్వంలో, మృత్యుదేవతాస్వరూపాన్ని లయంచేసి, మానవుని కొరకును, మానవ ప్రపంచానికిని అమృతత్వాన్ని సంపాదించెను.

ఈ కథను శ్రీ అరవిందులు, ఆధ్యాత్మికఅనుభూతుల సంపదతోను రహస్య విద్యాప్రతిమ స్వరూపాలతోను నింపెను. అందలి పాత్రలను, విశిష్టమైన పరిణామ సిద్ధాంతంతో పోషించి, ఆ గ్రంథాన్ని భగవత్తత్త్వానుగ్రహ శక్తితో మానవుడు మృత్యుంజయత్వ సాధనా ప్రతిపాదక మహాకావ్యంగ తీర్చిదిద్దెను.

ఆధునిక కాలానికి (సంప్రదాయ యుగానికి) వేదం ఎట్లు విజ్ఞాన గ్రంథమో, ఉదయించుచున్న, పరమాత్మ నవయుగానికి 'సావిత్రి' కావ్యం ఒక క్రొత్త ఆవిష్కరణం, సత్యదర్శనం చేయించు ఉద్గ్రంథం. వేదంవలెనే, వేర్వేరు మనస్సులకు, వేర్వేరు అర్థాలను ప్రసాదించుచున్నది. ఈ సంపుటంలో వివరింపబడిన అధ్యయనాంశాలు (Read ings) పరాత్పరతత్త్వాన్ని ఆకాంక్షించి అన్వేషించేవానికి సంఘటిల్లిన ప్రతిస్పందన స్వరూపాలు.

1 వ పుస్తకము (ఆరంభముల సంపుటి)

1 వ కాండము (ఉషఃకాల చిహ్నము)

పరాత్పరుని అభివ్యక్త సమయం ఆసన్నం కాలేదు. ఈ ఆవిష్కరణానికి అధ్యక్షత వహించి పాల్గొను దేవతలు విశ్రాంతినుంచి ఇంకా మేల్కొనలేదు.

ఈ నిశ్చల నిశ్శబ్దతత్త్వపు హృదయ పీఠికపై దివ్యఆవిర్భావ పథం తప్ప ఇంకేమీ లేదు. నిశీథమనస్సు అక్షరమూర్తియై పడిఉన్నది. కాలరహితమైన ఈ నిశీథ మనస్సు ఒక్కటియై శకునపక్షివలె బ్రహ్మాండమైన రూపంలో విస్తరించు కొని ఉన్నది.

ఆ నిశీథిలో గ్రుడ్డి ఊహలలో రూపరహితమైన అనంతం యొక్క లోతులను గమనించవచ్చును; అది కారుచీకటి మయం. సర్వంను అగాధమైన శూన్యం (సున్న-Zero)తో నిండియున్నది.

ఆత్మశక్తియైన ఈ మనస్సు, ఒకప్పుడు అపరిమితమైయుండి, విస్మృతి ఆ స్థితినుండి పతనమైనది. రెండు శూన్యంల—ఉపరితలమున ఉన్న శూన్యం అధఃప్రదేశంల గల శూన్యంల—మధ్య మేల్కాంచినది. తాను మేల్కాంచిన అజ్ఞాన గర్భంను స్మరించగలిగియే యున్నది. తనకు జన్మయను సాహసకృత్యం నుండి వచ్చిన పిలుపును, తత్సంబంధమైన డొంకతిరుగుడు ప్రయాణంను ప్రక్కకు పెట్టి తిరిగి ఆ శూన్యంలో లీనమగుటకు వాంఛించుచున్నది.

అజ్ఞాతం యొక్క ఆకారంలేని మూగవోయిన మూర్తియగు జడత్వంన ఒక స్పందన కలిగెను. ఆ చైతన్యరహిత చర్యను తిరిగి తిరిగి చేయుచు యాంత్రికంగ సంకల్పశక్తిని పొడిగించుచు అజ్ఞాన శక్తియొక్క విశ్వాత్మకంఅగు, మగతనిద్రకు ఊయలవలె పని చేయుచుండెను. ఆ నిద్ర జోగులోని లయలు కొనసాగి, విశ్వం లోని సూర్యులను వెలిగించుచు, ఈ అచేతనమైన ఊపులో జీవరాసుల జీవిత భారములను వహించినది.

ఈ నిశ్చల ఆకాశంయొక్క ప్రచండతలో, మనస్సుగాని, ప్రాణంగాని, ఆత్మగాని లేవు. ఇట్టి ఈ శూన్యంలో భూమి దిక్కులేనిదై దీనముగ తన చుట్టు తాను భ్రమించుచున్నది. యాంత్రికమైన కలలో స్మృతి లేక, తన ఆత్మను, లక్ష్యమును కూడ విస్మరించినది.

ఈ అర్థరహిత అంధకారంలో ఒక కదలిక బయలుదేరినది. అది ఒక సంచలనం, ఏదో కావలెననెడి ప్రేరణ, ఏ విధముగ కావలెనునది తెలియని తిక షుక. అది జడ పదార్థంలో అజ్ఞానంను మేల్కొల్పినది.

అప్పుడు ఒక వేదన, ఒక చలనం, ఒక తీరని కోరిక సంభవించినవి. అంతవరకు అచేతనంలో స్తబ్ధమై పడియుండి పూర్వస్మృతుల సాహాయ్యంతో వెలుగునకై వెదకులాడుచుండినది. ఆ శూన్యపు లోతులలో ఏదియో కాలగర్భంలో మరుగుపడిన ఒకానొక అస్తిత్వము, పైకిలేచి, తానంతట తాను ఇదివరలో చేసిన ప్రయత్నం, పోరాటం, మరియొక పర్యాయం కొనసాగించుటకై కదలినదా యని అనిపించినది.

రూపుదిద్దుకొనిన ఒకానొక చైతన్యం కాంతిని ఆకాంక్షించినది. సుదూరంలో ఉన్న మార్పునకై ఒక అస్పష్ట అవగాహన అన్వేషించుట మొదలైనది. ఒక వాంఛ బయలుదేరినది. అంతవరకు వినిపించుకొనని, స్మరణకు తల్లియైన నిశీథం ఒక అవసరంను జ్ఞాపకం చేసికొనినది.

ఆ కటిక చీకటి, అదృశ్యంగ ఒక బీట వేసెను: అంతట ఒక కాంతి కిరణం ఒక జీవరేఖ దృశ్యమానం కాజొచ్చెను. అది ఆవలి ఒడ్డునుండి, తన గత ఆనందం విస్మరించి విలవిలలాడెడు ఏకైక పరమాత్మను వెదకుటకు వచ్చిన వార్తా హరునివలె నుండెను. ఈ ప్రాణమయ ప్రకాశం, నిశ్శబ్దవిశ్వంలో ప్రవేశించినంతనే ఒక పిలుపు, చైతన్య ఆనందంల సాహస చర్యకై కదలాడెను. అది ఇష్టంలేని నిశీథ ప్రకృతిని, ప్రాణోద్ధరణకై, చూచుట, భావించుట క్రియలకై బలవంత పెట్టెను.

ఇదియే అంకురార్పణ: కాగా ఒక యోచన పైకొనినది, ఒక భావం బయలుదేరింది. స్మృతి కదలాడింది. ఎప్పుడో చనిపోయిన అంతరాత్మకు ఇది ప్రాణం పోసినట్లయింది. గత కాలంయొక్క చిహ్నాలన్నియు కాలభ్రమణంలో తుడిచిపెట్టుకొని పోయినవి. పోయినదంతయు పునఃసృష్టం కావలెను. వెనుకటి అనుభూతులు నెమరువేసికొనబడవలెను. నిజమే, భగవదనుగ్రహంతో సర్వంను సిద్ధించగలవు.

నిర్లక్ష్యంతో పరిత్యక్తమైన ఆ ప్రపంచంలో ఒక ఆశారేఖ ఉద్భవించింది. స్వర్లోకపు మూలనుండి అద్భుత భావ సూచన బయల్పడి వచ్చింది. ఇక పదేపదే వెలుగుల ప్రసారం క్రిందికి దిగి రాసాగింది. సంతత కాంతిఖేలన, ఇచటి పరిస్థితిని మార్చసాగింది. అది చీకటిపై ప్రభావం చూపి వెలుతురుకు లోబడి పడి ఉన్న ఈ ప్రపంచాన్ని, సౌందర్యంతో స్పృశించి, ప్రాణంతో ప్రభావితం చేయబూనింది.

చీకటిలోని పగులు(బీట)పెద్దదైంది: తద్వారా ప్రవేశించి పొంగిపొరలిన కాంతి వరదలై పారింది. చీకట్లు వెనక్కు పోవుచున్నాయి. ఇక అనేక వర్ణాలలో వెలుగు

బయటపడింది. తన మనోహర రూపంతో ఉషస్సు ప్రత్యక్షమై సృష్టి అంచులపై తన సందేశ ముద్రవేసి,అమృతమయ దివ్య తేజస్సమాగమనాన్ని ప్రకటించింది.

ప్రాణ సీమయొక్క సన్నని పొలిమేరపై క్షణకాలం ఆ ఉషస్సు ప్రకాశించింది. అది ఆవిష్కరణకుద్యమించిన దివ్యతత్త్వం, ఘనతానంద సౌందర్యాలను భౌతిక రూపాలలో రూపొందించ పూనింది. చిక్కని విశాలతలాలలో దివ్య వైభవ బీజాలను నాటింది.

ఆ వెంటనే, శాశ్వత రోచిస్సులతో స్వర్గలోకాలను తెరుస్తున్న దివ్య మాతృమూర్తి కనిపించింది. విశాలాకాశాలు తన పాదస్పర్శకొఱకు ఉవ్విళ్ళూరుతున్నవని తెలిసికొని,సర్వజ్ఞతతో తనను ఆవిష్కరింపజేసికొనుచు ఆ తల్లి ముందుకు అడుగులు వేసింది.

తల్లి రాకను భూదేవి తెలిసికొన్నది. ఆమె చెవులు శ్రీమాత పదాల సవ్వడిని విన్నవి; నేత్రాలు శ్రీమాత మూర్తిపై ప్రసరించాయి. దివ్యమాత వికసిత మందహాసం స్తబ్దంగ పడిఉన్న ప్రాణాగ్నిని ప్రజ్వలింపజేసింది. ప్రకృతి పులకించి, దివ్యతత్త్వాన్ని ఆరాధించింది. వృక్షాలు, పర్వతాలు, గాలి, ఆకాశం అన్నియు ఆ పూజలో పాల్గొన్నవి. పృథ్వి ప్రాణ ప్రకాశంతో మేల్కొంచింది.

దివ్య తేజస్సు మర్త్య లోకంలో ఎక్కువ కాలం నిలువ లేకపోయింది. భూలోకం పరిస్థితులు అందుకనువుగ లేకుండినవి. తన సజీవస్మృతిని భూలోకంలో వదలుతూ నెమ్మదిగ వెనుకకు తిరిగి అది వెళ్ళిపోయింది. ఒకానొక ఆధ్యాత్మిక సౌందర్యం భవిష్యత్తులో తప్పక జన్మించగలదనే ఒక ఆకాంక్షే భూలోకంలో అది వదలివేసిన స్మృతి.

ఇక మిగిలింది సాధారణ దైనందిన నిత్య జీవనం. యథా ప్రకారం అందరూ తమ నిత్యకృత్యాలు ఆరంభించారు.

దివ్యచేతనతో మేల్కొంచిన వారిలో సావిత్రి ఒకరు. సుఖ సంతోషాలకు ఆరాటపడుతూ అలవాటు ప్రకారం ఇతరులందరు సాధారణ నిత్యజీవితం

సాగిస్తుంటే, సావిత్రి వారితో కలిసిమెలిసియే ఉండి, వారి అల్పసంతోషాలలో పాల్గొనకుండా ఉండేది. ఆమె తన పుట్టుక వేరనీ తాను సాధించవలసిన కర్తవ్యం వేరొకటి కలదనీ ఆమెకు తెలుసు. సామాన్య మానవ భావాలూ కదలికలూ ఆమె భావ స్పందనలకు విజాతీయాలు—అందుచే ఆమె వాటికి ప్రతిస్పందించలేదు. ఆమె శరీరంలో బంధింపబడిన దివ్యశక్తులు స్వేచ్ఛకై తహతహలాడుచుండేవి. ఆమె తనతో కొనివచ్చిన ఆనందం, శక్తి, విశాలతలను, భౌతికజీవనం నిలబెట్టుకోలేక కొంచెం ఇంచుమించు నిరసిస్తూఉండేది. భూలోకం అల్పసంతోషాన్ని అశ్రుపులను కోరి వరప్రసాదంగ ఆమె కొనితెచ్చిన పరమానంద పరవశతను తిరస్కరించింది. వినాశానికి కొనిపోయే ప్రేమను ఆమె కందించింది.

తనతో తెచ్చిన ఆధ్యాత్మిక సంపదను వెదజల్లుతూ, తద్రీత్యాభూలోకంలో ఒక ఉన్నత చైతన్యం వికసించగలదని సావిత్రి భావించింది. కాని ఈ ప్రపంచం సహజమైన అజ్ఞాన ప్రభావంచే, రక్షణ శక్తిగల వెలుగును, భగవద్విభూతిని కొని వచ్చిన దైవదూతలను, (భగవంతుని బిడ్డలను) తన స్వభావసిద్ధ ద్వేష క్రోధాలతో తిరస్కరించింది.

ఈ విధంగ సావిత్రి తన సహజ ఉన్నతశక్తి సంతోషాలకు ఎడమై (దూరమై) ప్రపంచంలో జీవించింది. అట్లే తాను ఉద్ధరింపబూనిన మానవజాతి దుఃఖాలకు కూడ దూరమై ఆమె జీవించింది.

ఆమె ఇతరులకు తెలియకుండ ఇతరుల సహాయంపై నాధారపడకుండా మానవ జీవితంలోని బాధలను తనలో భరించుతూ, సమయం ఆసన్నమైనప్పుడు మృత్యువును ఎదుర్కొనుటకు తయారగుతుండేది.

ఏకాంతంలో, ఇదంతా అనుభవించుతూ, ఆమె హృదయపూర్వకంగా అందరకూ అందుబాటులో ఉండి ఆదరిస్తుండేది. అంతరంగంలో ఆమె ప్రకృతి యంతటితో ఐక్యమై ఉన్నది, ఆమె మాతృప్రేమ విశ్వవ్యాప్తం కాగా, విశ్వ మాతృమూర్తిగా ఉన్నది. జీవిత మూలస్థానంలో పీడించు కీడునూ ఆమెకు రానున్న కఠినపరీక్ష నిరీక్షించుచుండెను. విధిని ఎదుర్కొనే ప్రయత్నంలో ఆమె నిజంగా భౌతిక ప్రకృతి శాసనాన్ని (నియతిని) ఎదుర్కొంటున్నది.

బాల్యంలో, భూలోక గుణాలైన, మరుపు, మత్తుల ప్రభావాలకు లోనై, ఆమె ప్రశాంతంగ ఉన్నది. వ్యాకులతగాని, కష్టాలనుగాని ఆమె ఎన్నడూ ఎరుగదు. వయస్సు పైబడి, పెరిగినకొలదీ, ఒక పల్చని స్మృతి ఆమెలో చోటుచేసి కొంది; తన హృదయంలో బలవంతంగా ఈడ్వబడుతున్న ఒక బాధను అనుభవింప సిద్ధపడ్డది. దాని మూలాన్ని కనుగొనటానికి ప్రయత్నించినా, మనస్సు తగినంతగా ఎదగని కారణంచేత తెలిసికొనలేకపోయింది. ప్రాణ, ఇంద్రియశక్తులు తగిన ఉత్సాహంతో పోషించు పరిస్థితు లుదయించకుండుటచే, ఆసక్తి పనిచేయటానికి ఇచ్ఛగించలేదు. అయితే సకాలంలోనే ఆమె పూర్తిగామేల్కొంది. యథార్థమైన ఆత్మస్ఫూర్తి ఆమెలో పునరావిర్భవించింది. స్మృతి వెల్లువలై పారజొచ్చింది. పరస్పరం పోటీ పడుతున్న, భూమి, ప్రేమ, నాశనాలను వ్యక్తిత్రయ వైశ్వాత్మక సమరంలో తాను కేంద్రస్థానంలో ఉన్నట్లు ఆమె గుర్తించింది.

అంతరంగంలోకి దృష్టిని సారించి తన స్వభావంలో ఉన్నత పీఠం అలంకరించిన బాధా తత్త్వాన్ని ముఖాముఖిగ చూచింది. అది నిరంతరం దుఃఖాన్ని శోకాన్ని బలి గోరుతున్నట్లు కనిపించింది.

ఈ లోకపు పరిపూర్ణమైన సమస్య ఆమె ఎదుట సజీవమై నిలిచింది. ఆమె దాని సవాలును గమనించింది (పసికట్టింది); విధిని ఎదుర్కొని పోరాడటానికి, ఆమె అంతరాత్మ ఉద్బుద్ధమయింది.

ఆ రోజే సత్యవంతుడు మరణించవలసిన రోజు.

1 వ పుస్తకము 2 వ కాండము

సమస్య

ఒక క్షణం సావిత్రి ఆలోచనలో మునిగిపోయింది. వెనుకటి జీవితమంతా బాల్యం, యౌవనం, సత్యవంతునితో సమాగమం, గత పండ్రెండు మాసాల మృత్యుచ్ఛాయలో నడచిన ప్రేమమయ జీవితం ఒక మెఱుపువలె ఆమె మనస్సులో మెఱసినాయి.

ఈ కష్టకాలంలో ఆమె బాహ్యవ్యక్తి స్థానే, అంతరాత్మ ముందుకు వచ్చి, పరిస్థితిని అదుపుచేసికొన్నది. ప్రకృతిశాసనాన్ని మరొకవిధంగా తుడిచివేయటానికి అవకాశం లేదు. శరీరపు విధిని అంతరాత్మసంకల్ప మొక్కటే మార్చగలదు. అక్కడి విషయం ఆమె వ్యక్తిగత సమస్య కాదు. అక్కడున్న వివాదం మృత్యువూ జీవితాల మధ్య, ప్రళయం ప్రేమల మధ్య సాగింది. ఆసందర్భంలో సావిత్రి సమరానికి సంసిద్ధమవుతున్నది. ఆమె బయటనుండి ఇతరుల సహాయాన్ని కోరలేదు. వైశ్వాత్మిక సమరంలో ఆమె వహించనున్న పాత్ర ఎవరికీ తెలియదు. ప్రకృతి ఒడిలో ఏకాంతవాసంలో గడిపిన పండ్రెండు నెలలునూ ఆమె ఆంతరంగిక జీవితానికి బలాన్ని చేకుర్చాయి.

ఈ పచ్చని ప్రకృతి లోతులలోని ప్రేమ, చిట్టచివరకు సావిత్రి హృదయంలో స్థిరనివాసం నేర్పరచుకొంది, ఇంతవరకు ప్రపంచంలో ప్రేమకు అట్టి స్థానం దొరక లేదు. ఆమె చైతన్యంలోని విశాలత, ఔన్నత్యాలు, సత్తలోని పరిశుద్ధత ఔదార్యాలు అభేద్యమైన ఆమె బలం, శక్తితో సమతూకం చెందినవి కాగా మూర్తీభవించిన దివ్యప్రేమకు, గౌరవానికి ఆమె పాత్రురాలయింది.

ఇట్లు ప్రేమతో (మృత్యువు నీడగ గల ప్రేమతో) సమావేశమయ్యే వరకు సావిత్రికి ప్రాపంచిక దుఃఖ మంటే ఏమిటో తెలియదు. ఆమె దిగివచ్చిన ఉన్నత లోకంలో ఆనందస్మృతులను కూడా తెచ్చుకొంది. కాని భూలోక అజ్ఞానంలో ఆ యానందాలు చాలకాలం నిలువలేకపోయాయి. జీవిత సమస్య అతి తీవ్ర స్థితిలో ఆమె ఎదుట నిలిచింది. దాని నామె ఎదుర్కొనవలసి ఉండెను. సావిత్రి సాధారణ

మర్త్య జీవి కాదు. విధికి తలఒగ్గి సంతృప్తి పడేదికాదు. తటస్థపడిన సవాలునూ సమస్యనూ ఎదుర్కొనుటకు ఆమె వెనుతీయదు. మూర్తీభవించిన చైతన్యంపై నిశ్చేతన బంధాలను, అజ్ఞాన పరిధులను, ఆమె అంగీకరించలేదు. అప్పటి వరకును అమలులో ఉన్న క్రమాన్ని (వ్యవస్థను) మార్పుచేసి, చీకటిపై వెలుగునకూ మృత్యువుపై జీవప్రేమకూ గల ఆధిక్యంను స్థాపించటానికి ఆమె నిర్ణయించుకొంది. తన అంతరంగ శక్తులన్నిటిని ఆహ్వానించి, రాశిచేసి వాటిని అతీంద్రియ సంకల్ప శక్తితో సంయోగంచేసి సమరానికి సన్నాహం చేసింది. ఆమెలో దివ్యశక్తి పొంగి ప్రవహించుతున్నది. వినాశమయమైన కాలచక్రగతిని స్తంభింపజేసి దాని సంకుచితత్వాన్ని ఛేదించి, ఆమె అనంతంలో చొరబడింది

3 వ కాండము

రాజయోగం

అంతరాత్మ విముక్తియోగం

మానవజాతికి నాయకుడు, ప్రాణశక్తికి ప్రభువు అయిన అశ్వపతి ద్వారా పృథ్వి మొఱపెట్టుకొనగా, తత్ఫలితంగా సావిత్రి జన్మించింది. మానవజాతి ఆకాంక్ష అశ్వపతిలో మూర్తీభవించి, భగవంతుని రక్షణ అను దివ్యానుగ్రహాన్ని తన కుమార్తెగ అవతరింపజేసుకొనుటలో, అతడు విజయం సాధించాడు.

అశ్వపతి సాధారణ మానవుడు కాడు. పరిణామశీలమైన ప్రకృతి సంకల్పానికిగాని, అమె ఆచి, తూచి వేసే నడకకు గాని, అతడు వశుడు కాలేదు. అతడొక విశిష్టమైన వ్యక్తి. భగవంతు నుద్దేశించి పరిణామ ప్రగతిలో పోరాడుతున్న మానవజాతి ఒక ముందంజ వేయుటలో ఒకానొక ప్రత్యేక కార్యక్రమాన్ని సాగించటానికి నియమింపబడిన వ్యక్తి. బాహ్యముగా సామాన్య మానవుని గుణావగుణాలన్నీ కలవాడు; కాని అంతరంగికంగా తన ఉన్నతస్థితి నెరిగి తాను నిర్వహించవలసిన పాత్రను తెలిసి, తనలోని శక్తులు అభివ్యక్తమవటానికి కావలసిన ప్రయత్నంలో అవగాహన చేసుకొనినవాడు.

అతడు తన సత్తను, పరిణామ సారథియగు ప్రభుపు ఆశించు విధానంలోనికి మలచాడు. ఉన్నతమైన వైశ్వాత్మిక క్రియాకలాపాల కనుగుణంగ తన సంచలనాలను త్రిప్పెను. తనలోనికి అవతరించిన అతీంద్రియ శక్తులకు వాహనంగ తన చైతన్యాన్ని అభివృద్ధిపరచాడు. విశ్వమునంతనూ, తన పరిష్వంగంలో నిముడ్చుకొనుటకై తన సత్తను విస్తరింపజేసాడు. మానసికాకాశాన్ని ఛేదించుకొని ఊర్ధ్వమున కెగసి, పైనున్న పరాత్పర తత్త్వానికి (దివ్యతత్త్వానికి) భౌతిక ప్రపంచానికినీ మధ్య ఒక వంతెన నిర్మించాడు. ఆయనలో భూలోక స్వర్గలోకాలు సంగమించాయి.

ఆతడు తనలో గొప్ప మార్పులు సంభవించుట గమనించాడు. సాధారణ మానవుని సహజ పరిమిత శక్తుల స్థానే, జ్ఞానసామర్థ్యాలు, భావాలు, శక్తులు, ఆనందాలు గొప్పగ వృద్ధిపొంది, ఆతనిలో చోటు చేసుకొంటున్నాయి. జీవితమంతా తెరచిన పుస్తకంవలే, ఆతనికి సుగ్రాహ్యమయింది. తన చుట్టూఉన్న వ్యక్తుల జీవితం ఊర్ధ్వలోకాలూ అతనికి అర్థమయిపోయినై. ఉన్నత విజ్ఞానంలోని విశ్వబీజాలు అతనికి గోచరించాయి. విత్తనం నుండి వృక్షం ఉద్భవించునట్లు, దివ్య సంకల్పంనుండి సుదీర్ఘమైన సృష్టివిధానాలు తమ నిర్ణీత ధోరణిలో ఆవిర్భవించటం అతనికి కరతలామలకమయింది. ఆతడు తనలో సృష్ట్యాత్మకమైన వెలుగు, శక్తి, ఆనందాల ఉద్రేకాలనే కాక, భౌతిక విభాగంలోని, అజ్ఞానం, తమస్సు అంధకారాలను, తనను వెనక్కులాగే ప్రతిబంధాలను కూడా గమనించాడు. వీటినన్నింటిని — ఎంత మొండిగా నిరాకరిస్తున్నా వదలక — లాగుకొంటూ ముందుకు పోతున్నాడు శాశ్వతమైన పరమాత్మలో స్థిరమైన అచంచలమైన స్థానాన్ని చేరాడు. ప్రకృతి చలనాలకు, తరంగాలకు పైనున్న నిశ్చల సీమనుండి, శ్రమించుతున్న ప్రపంచానికి తన సాహాయ్యం అందజేసాడు. ముక్తస్థితిలోనుండి, ఉన్నత ప్రకృతి శక్తులను ఊర్జితాలను సంపాదించిన కారణంగా, అతడందజేస్తున్న సాహాయం అతి ప్రతిభావంతంగా ఆవశ్యకంగా ఉంది. పరాత్పరతత్త్వం యొక్క అవిర్భవించుతున్న సత్యతను దివ్య భావనలో చూడగలుగుటచేత ఆతని సంకల్పశక్తి మానవజాతి పరిణామ సంచలనాలను, తన దర్శన విధానంలో రూపుదిద్ది పురోగమింప చేసింది. అవి మానవుల జీవితంలో, హృదయాలలో చెరగని ముద్రవేసి నిలిచాయి.

4 వ కాం డ ము
రహస్య జ్ఞానం

అశ్వపతి సత్త ఉన్నత శిఖరంపై నిలబడిన తరువాత, అంతకుమించిన ఉన్నత శిఖరాలు కూడా, ఆయనకు గోచరములైనాయి. అనంతత్వంలోని శ్రేణులు అనంతాలు; మానవుడు అరోహించి చేరే పదవి, ఇంకనూ ఆరోహించి సాధించవల సిన పదాలను విశదీకరిస్తుంది. అవి భవిష్యత్తులోని విజయాలకొక వాగ్దానం వంటివి. ప్రస్తుత భూలోకంలోని మర్త్య జీవితానికి మృత్యువు ఒక పరిమిత పరిస్థితే గాని అది శాశ్వతమైనది కాదని అశ్వపతి తెలిసికొన్నాడు. మానవుడు అన్వేషించి సాక్షాత్కరించుకొనుటకై స్వేచ్ఛ, అమృతత్వాలతో నిండిన స్థితులు, సీమలు నిరీక్షించుచున్నవి. అతడు పరిణామ ప్రక్రియ ఒత్తిడులకు వశుడై ఆ సీమలగుండానే పయనించుచున్నాడు. (నడిపింప బడుతుండెను) కొన్ని సమయాలలో మానవుడు తన అభివృద్ధిని అవలోకించ గలడు. ఉన్నత స్తరాలనుండి అవతరించుచున్న కాంతి, శక్తి, ప్రశాంతతల అనుభూతిని పొందుతూ, తన సంకుచిత అహంకారమయ జీవితం కరిగిపోవుచున్నట్లు గమనిస్తాడు.

మానవుడు తన ఆంతరంగంలో విశాలమైన పరమాత్మ తత్త్వాన్ని జీవిత వ్యాపారాలలో ఎట్టి ప్రమేయం లేక, ప్రకృతిచే అజ్ఞానంలో కప్పబడి సాక్షీభూతమై ఉన్న పరమాత్మ తత్త్వాన్ని క్రమంగ తెలుసుకొనగలిగాడు. ఆ తత్త్వంలోనే జీవన సమస్యలను తెరచి పరిష్కరించే భాగం కలదు; ఈ సృష్టి కాధారభూతమైన ఆనందాంబుధియు అక్కడే కలదు.

ఈ భావన లేనిచో, ప్రాపంచిక జీవితానికొక పరమార్థం గాని, లక్ష్యదృష్టి గాని ఉండనేరదు; జీవితానికి స్థిరమైన స్వభావజ్ఞానమే ఉండజాలదు. సంచలనం అంతరంగంనుండి ఒకానొక సంతత ప్రేరణచే త్రోయబడు కదలిక మాత్రమే గోచరించును. అయినా, ఈ భూలోకం, తన క్రామిక చర్యలో వేరుపడిఉన్న ఏకాకి తనాన్ని ఎన్నడు భావించదు. విశ్వంలోని ప్రబలమైన శక్తుల సాహాయ్యంతోను, వాటి ఉనికిమాత్రంచేతను, తానుపైకి ఉద్ధరింపబడుతున్నట్లు ఈ భూలోకం భావన కలిగి

ఉన్నది. భౌతిక మనస్సు, పై లోకాలందు దైవీమూర్తులతో స్థాపితమై ఉన్న జ్ఞానం, శక్తి, ఆనందాల స్వరూపాలకై అవి పదార్థతత్త్వంలో శ్రమించుతున్న శక్తులకు ఎంత అందరాని ఉన్నతస్థితిలో ఉన్నప్పటికీ, వాటికై ఆకాంక్షించి, అన్వేషిస్తుంటాయి.

యథార్థానికి ఈ శక్తులు, ప్రాణశక్తి వెనుకనుండి పనిచేస్తూ బాహ్యపరిస్థితుల స్వరూప ప్రసారాలను నిర్ణయిస్తాయి. సాధారణంగ మానవుడు తనయందూ విశ్వమందూ నడుస్తున్న యీ ఆంతరంగిక వ్యవహారాలను గమనించలేడు. కాని భౌతిక జీవితం యొక్క పరమావధి సిద్ధించటానికి అనగా, భౌతికజీవితం దివ్యజీవితంగా వికసించునంతవరకు, పైన ఉదహరించిన ఆంతరప్రేరణను, ఉన్నతస్తరాలనుండి వచ్చే మార్గదర్శకత్వాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది.

ప్రస్తుత పరిస్థితులలో భూలోకంలో పనిచేస్తున్న పరిణామ చైతన్యం మధ్యస్థాయి కలది మాత్రమే. ఇది క్రిందిస్థాయిలోని నిశ్చైతన్యం నుండి బయలుదేరి, యీ స్థితికి చేరుకొంది. కాని ఇంతకు మించిన ఊర్ధ్వసత్తయందలి, పరమ చైతన్యస్థాయికి పెరగవలసి ఉన్నది. అందువలన ఈ చైతన్యం ఈ మధ్య చైతన్యం యొక్క క్రియాకలాపాలన్నీ అసంపూర్ణాలైనవి. కాని ఈ చైతన్యాంతరంలో, ఒకానొక ఒత్తిడి రెండు కొనలనుండి (పదార్థమయ ప్రకృతి, ఆధ్యాత్మికసత్తల అగ్రాలనుండి) నిరంతరం వృద్ధిపొంది, పెరగవలెననే వాంఛ ఇమిడి ఉన్నది.

జీవిత సుఖదుఃఖ సంఘర్షణలమధ్య, జీవన విపర్యాయాలమధ్య నడిపించు ఒక జ్యోతి (వెలుగు) లాగు బలము, నిలబెట్టు ఒక ఆనందం కలవు. సృష్టికర్త అయిన భగవంతుని సంకల్పం, కాలంలోని ప్రతిక్షణంలోనూ విశ్వములోని ప్రతి స్తరంలోనూ భౌతిక విశ్వం యొక్క విధికృతమైన అభివ్యక్తివైపు నడిపించు శక్తి పనిచేస్తున్నది.

1 వ పుస్తకము (5 వ కాండము)

రాజయోగం

ఆత్మవిమోచన, ఔన్నత్యములయోగం

అశ్వపతి, గుప్త విద్యాశక్తిని పొంది భౌతికస్థావరములోని తన బంధములను త్రెంచుకొని, ఉన్నత, ఆధ్యాత్మిక కాంతిసీమలలోనికి, చురుకుగ ప్రవేశించెను. అక్కడ మానసిక శ్రమతో పని లేకయే జ్ఞానము సహజముగ, తనంతట తానే కలుగును. అక్కడ భౌతిక జీవన శాసనములకు ప్రభుతలేదు. భౌతికలోకములోని సర్వవిషయములకు, సూచనలు, సమాధానములు దొరకును. ఈ సృష్టిక్రమము యొక్క పరమార్థము, పరమాత్మ ప్రకృతుల వ్యూహము దానిప్రకారము ఈ ప్రపంచములో భగవంతుని ఉద్దేశ్యము నెరవేరు కార్యక్రమము మొదలగునవన్నియు స్పష్టముగ గోచరించును.

ఈవిధముగ అశ్వపతి, సత్తయొక్క క్లిష్టతరమైన రహస్యములోనికి ప్రవేశించి తన దృష్టిని అంతవరకు అదృశ్యములై యున్న ఊర్ధ్వలోకముల పైప ప్రసరింపజేసెను. అంతవరకు తనకు వినియోగపడిన విషయముతో సంతృప్తి నొందలేకపోయెను. భౌతిక లోకములో పొందినవన్నియు, పరమాత్మ యొక్క ఉన్నత లోకములలో నుండువాని వికృతరూపములుగ తెలిసికొనెను; ఆ యథార్థ క్షేత్రమును, తన నివాసముగ పొందుటకు అతడన్వేషించెను.

ప్రపంచసంబంధమైన (ప్రాత) వ్యవహారముల గడబిడలనుండి తన చైతన్యమును కూర్మము వలె, లోనికి లాగుకొని ప్రశాంతతలో ప్రతిష్ఠితుడాయెను. అది భూలోకసంబంధమైన దేశకాలముల కావల నుండు విశాలతల కున్ముఖమై యుండెను. అక్కడ అయన వసించెను. అప్పుడు విముక్తమైన శక్తి, జ్ఞానానంద ములు ఆయన సత్త నావరించి, ఆక్రమించి ఊర్ధ్వమున నున్న అనంతములలోనికి ఆయన నుద్ధరించెను. అక్కడ అశ్వపతి, తన మానవత్వమునుండి (మానవ స్వభా వము నుండి) పూర్తిగ విముక్తుడై దివ్యతత్త్వము యొక్క సర్వజ్ఞత, సర్వశక్తి మత్త్వ పరమానందములలో నోలలాడెను. ఆయన శక్తులకుండిన పరిమితులు

తుడిచివేయబడినవి. అవి ఒకానొక రూపాంతరమును, మార్పును చెందినవి. ఆయన ఆత్మ, వైశ్వాత్మక వైశాల్యము నొందెను.

ఆయన దృష్టి నావరించిన ముసుగు తొలగిపోయెను. ప్రకృతి, ఒక ఎరుక గల శక్తిగ (జ్ఞానమయశక్తిగ) ఆయనకు గోచరించెను. ఆ జ్ఞానశక్తి, పరమాత్మ వ్యవస్థీకరించిన ఒక అద్భుత కల్పనకు సర్వశక్తి మంతమైన బలముతో కార్య రూపము నిచ్చుచుండెను. అది పరమేశ్వరుని ప్రకాశమగు సంకల్పమునకు తన కార్యక్షేత్రమునంతయు పరచి అనగా, పదార్థముల మూలములో నున్న కాఠిన్యముల నుండి తన మానసిక వృత్తులలోని మృదుత్వమును, తన సంకల్ప శక్తిలోని సాధ్య స్థితులను పూర్తిగ విప్పి వాటిని అంతము, అనంతముల మధ్య ఒక కలయికగ, ఒక వారధిగ నుండునట్లు చేసెను.

ఈ గుప్తలోకముల ముఖద్వారమున, భూలోకముల కావల అశ్వపతి ఒకానొక రక్షణ శక్తిని, దాని వెనుక ఒక అనిర్వచనీయ దివ్యసన్నిధిని గమనించెను. ఇక్కడనే అనంతము, శాశ్వతముల సీమలు, వెలుగు నుండి ఎక్కువ వెలుగులోనికి తీసకొని పోవు దేశములు ప్రారంభమగును. ఈ సృష్టిలోని ప్రపంచ ముల వెనుక నున్న వ్యూహము ఒక బ్రహ్మాండమైన వరుసక్రమముగ అశ్వపతికి గోచరించెను. అనులోమ విలోమ యానములను పరాత్పర దివ్యతత్త్వము యొక్క అనగా అవరోహణ ఆరోహణల వలన ఏర్పడినవియు, క్రిందికి వచ్చునవియును పైకి పోవునవియును అగు మెట్లను, చైతన్య భూమికలను అశ్వపతి దర్శించెను. విశ్వాత్మవృద్ధిపొందుచు పరిపూర్ణమైన దివ్యమహిమగ రూపుదిద్దుకొనుటను కూడా గమనించెను.

అతడు, ద్యోతమానమగు మహర్లోకమును అవలోకించెను. అది సత్యము, ఋతము, బృహత్తులతో నిండి సర్వశక్తి మంతమైన సత్యచేతనలోకమై యుండెను. దాని క్రింది శ్రేణులలో క్రింది లోకములుండ, ఊర్ధ్వములో సచ్చిదానందమయ, అనంతములలోనికి తెరచుకొనును. ఈ మహర్లోకముననే అజ్ఞానమయ లోకముల లోని విరోధిభావములతో పోరాడుకొను సత్యములన్నింటికిని సామరస్యము నిచ్చు విజ్ఞానము కలదు. ఇదియే సర్వవికాసములకును, ప్రేరణలకును, దర్శనములకును

మూలాధారము. ఇచటనే శాశ్వతత్వము కాలరూపమును ధరించును. ఇచటనే ఏకత్వము, అనేకత్వముగ వ్యవస్థీకరింపజేసికొనును. దీనికావలనున్నది ఏకత్వము యొక్క అనంతత్వము.

ఈ తెలియని సీమలోనికి అశ్వపతి ప్రవేశించును.

2 వ పుస్తకము (1 వ కాండము)

వివిధలోక సోపానములు

అశ్వపతి తెలియని సీమలలో సంచరించుచుండ మానవునకు గ్రాహ్యము కాని దంతయు ఆయన దృక్పథములో పడి గోచరమగుచుండెను. ఆ ప్రదేశమునకు హద్దు కానరాకుండెను. అంతులేని సంచలనము, అంతులేని ప్రశాంతతను నింపెను. ఈ భౌతిక సత్తకు ఆవల మరియొక సత్తలో ప్రవేశించి అక్కడ సర్వము యొక్క ఏకత్వములో అనేకత్వము యొక్క స్వేచ్ఛామయ సంభావ్యతలు అనంతము నుండి విముక్తము చేయబడుటను ఆతని అంతరాత్మ పరిశీలించుచుండెను. ఇక్కడ అనిర్వచనీయమైనది. అనేకముగ ప్రకటితమగుటకు ఉపక్రమించెను. అంతరాత్మ ఈ అనుభూతులనన్నిటిని అనుభవించి అందలి ఏకాత్మస్వరూపముగల వ్యవస్థను తెలిసికొని సాక్షాత్కరింపజేసికొని ఆనందించుచుండెను.

అశ్వపతి, తన చుట్టునున్న మహత్త్వములో ఐక్యము నంది దానిని చూచి అనుభవించుచుండెను. ప్రతి రూపమును, ప్రతి కదలికయును, వాగ్వైభవాతిరిక్తస్థితి యొక్క ఒకానొక పక్షముగను, అంశముగను ఆవిష్కరించుకొనుచుండెను. మానవుడూహించిన లోకములు, స్వర్గము నుండి యమలోకము వరకు గలవాటి నన్నిటిని, వాటి వాటి సహజస్థితిలో సుఖదుఃఖముల యొక్క ప్రభావమునకు పరిపూర్ణమైన రంగస్థలముగ అశ్వపతి అచట కనుగొనెను. అతని ముందు విస్తారమైన రహస్య విద్యామయదేశము ఆవిష్కృతమయ్యెను. అక్కడ జ్ఞానము విసూత్న రూపములలో, శక్తి ప్రజ్జ్వలించు జ్వాలలో, ఆనందము అంతులేని తరంగములలో అతని అనుభూతికి అందుబాటులో నుండెను. కాని, ఈ అనంత వైభవోపేతమైన

వివిధ ప్రదర్శనలో దీని నంతను కలిపి పట్టుకొను రహస్యము, అనేకత్వమును బంధించు ఏకాత్మస్వరూపమైన సత్యమును, అశ్వపతి పొంద లేక పోయెను.

అశ్వపతి ఇంకను తనలోని అగాధముల లోనికి పోయి, అక్కడ గల ఒకగొప్ప లోకశ్రేణిని చేరెను. అవి దిగువ నున్న పార్థివలోకముల పునాదిగ క్రమముగ పైకి పోపుచు, ఊర్ధ్వములోనున్న పరాత్పర తత్త్వము వరకు వ్యాపించి, ఒక ఎత్తైన స్థాణువువలె ఉండెను. అందు పరమాత్మ అధిరోహించునట్టియు అంతరాత్మ ఆరోహించవలసినట్టియు మెట్ల వరుసను, అశ్వపతి అవలోకించెను.

చైతన్యము నందలి, ఈ సత్త సోపాన పథమార్గము, ప్రతి వ్యక్తియందును పునః ప్రత్యుత్పత్తి చేయబడెను. ఈ సోపాన పరంపర, అట్టడుగుననున్న నిశ్చేతనకును, ఊర్ధ్వముననున్న పరమోత్కృష్ట చైతన్యమునకును మధ్య మానవుడు ఒక కొన నుండి మరియొక కొనకు సాగించు ప్రయాణములో వంతెన వలె కలుపు కలయికగ ఉండెను. ఈ చైతన్యస్తరము దేనికది, తరువాత దానిపై ఒత్తిడికలుగ జేయుచు మొత్తము శ్రేణిని ముందుకు నడిపించుచుండెను. ఈ చైతన్యసోపాన పరంపరలోని ప్రతి మెట్టును అంతరాత్మ తిరిగి పరమాత్మను చేరుటలో వేయునట్టి ఒక అడుగు.

పరాత్పర తత్త్వము, సృష్టికార్యములో నిమగ్నమై మొత్తము నిశ్చేతనలో విచ్ఛిన్నమైపోగా దానిని రక్షించి ఉద్ధరించుటకు దివ్య చైతన్యము ఆదిలో క్రిందికి మునుగుటలో ఏర్పడిన శ్రేణులే చైతన్యస్తరములైనవి.

ఈ చైతన్య సోపాన పరంపరయు దాని నాధారము చేసికొని నిర్మింపబడిన లోకములును, పృథ్వి యొక్క పరిణామక్రియలో శక్తిమంతములైన అంశములై యున్నవి. భూలోకము క్రిందినుండి ప్రేరేపింపబడుచు, అంతరములో మార్గము నిరూపింపబడుచు పైనుండి ఉద్ధరింపబడుచున్నది. ఈ రహస్యవ్యాపారమును నడిపించు ఒకానొక ఈశ్వరీయ బుద్ధి కలదు. దానిని పూర్తిగ అర్థము చేసికొనవలెనన, ఈ వ్యవహారమంతయు పరిపూర్ణత చెందిన మీదట తెలియగలదు.

సృష్టి వ్యూహము నంతయు సంపూర్ణముగ అవగాహన చేసికొనిన, ఒక అంతర్దృష్టిచే, ప్రేరేపింపబడుచు, భూలోకము యొక్క ఆకాంక్షను వహించినవాడై

అశ్వపతి, బ్రహ్మాండమైన లోకముల పరంపర నధిరోహించుటకు ప్రయాణ మారంభించెను. శాశ్వత ప్రశాంత నిశ్శబ్దముల కడ్డముగను ఊర్ధ్వమున నిరంతర ప్రకాశమానమగు వెలుగు తోను సాగుచు, మిరుమిట్లు గొలుపుచున్న లోకములోను, స్వర్గములోను ఆగక, అగోచరమగు తన లక్ష్యము వైపు అనివార్యముగ లాగబడుచు అశ్వపతి పోవుచుండెను.

2 వ పుస్తకము (2 వ కాండము)

సూక్ష్మ పదార్థసీమ

భౌతిక ప్రపంచపు పొలిమేరలు దాటి అశ్వపతి ఆశ్చర్యకరము, ఆనందమయ మగు, సూక్ష్మపదార్థలోకములో ప్రవేశించెను. అది మన భౌతికలోకము నావరించి యుండెను. ఈ సీమలోని స్వరూపములు చక్కని సౌష్ఠవము కలిగి అతి సుందరమై యుండెను. వాటి భావములు, సూక్ష్మములును భౌతికవిషయముల కంటె విస్తారమైన ప్రభావమును కలిగి యుండెను. ఈ సూక్ష్మ ప్రపంచము నిమ్న భౌతిక ప్రపంచము నకు ప్రకాశమానమగు మూలస్థానమై యుండెను. భౌతికలోకములోని పృథ్వీ తత్త్వము యొక్క పోకడలన్నియు (తీరుతెన్నులన్నియు) ఉపరితలము నందలి సూక్ష్మప్రపంచమున నిర్మాణము చేయబడినవే.

పదార్థమయ ప్రపంచమునకు ఈ సూక్ష్మప్రపంచ మొక రక్షణ కవచము వలె పనిచేయును. ఉన్నత శక్తి, రోచిస్సుల ప్రతిష్ఠను భంగపరచుచు, వాటి ఒత్తిడుల వలన పదార్థరూపములు శక్తిహీనములై భంగపాటు చెందకుండ, అవి భరించగలిగినంత శక్తి వెలుగులను మాత్రమే చొరనిచ్చుచు భౌతిక ప్రపంచములో పనిచేయును. ఉన్నత స్తరములలోని శక్తులు క్రింది భౌతికలోకము లోనికి క్రమపద్ధతిలో దిగి ప్రసరించు ప్రవాహములుగ చేయుట దీని ధర్మము.

ఈ సృష్టియందలి సౌందర్యమును, ఆనందమును, అనుగ్రహమును అందించు కదలికల మూలస్థానము ఈ సూక్ష్మభౌతిక ప్రపంచములో కలదు. కాని, అచట స్వీకరింపబడిన ప్రేరణలోని స్వల్పభాగము మాత్రమే యీ కఠినమైన పదార్థ

ప్రపంచములో ప్రవేశింపగలుగును. మనస్సు యోచనలకును, అంతరాత్మ పదార్థములకును మధ్య ఎట్టి అగాధమును లేదు. ప్రతి సత్యమును, తన సహజ స్వరూపప్రకటనను, ఎట్టి వికారము లేకుండ ప్రకటించుకొనగలదు. రూపము ఆవిష్కరించునే గాని మరుగుపరచదు.

మానవుని అంతరాత్మ భౌతిక ప్రపంచమును వదలి ఊర్ధ్వలోకముల లోనికి ప్రయాణము సాగించునపుడు, ప్రథమముగ, ఈ సూక్ష్మభౌతికలోకమును చేరును. స్థూల శరీరమును వదలిన మీదట, అంతరాత్మ సూక్ష్మశరీరమును ప్రకాశమానమగు వాహకముగ చేసికొనును.

ఇది (సూక్ష్మపదార్థలోకము) ఎంత తళతళలాడుచు మిరుమిట్లు గొల్పునదైనను, సురక్షితమైనది మాత్రము కాదు. ఉన్నత శ్రేణులయందు ఇది ఉత్సాహపూర్ణము, ఆకర్షణీయముగ నున్నను, క్రింది స్తరములలో అపాయకరమైన అగాధములు కలిగియున్నది. ప్రమాదము అందమను పుట్టమును (వస్త్రమును) ధరించియుండును. అపాయము మనోరంజకముగ గోచరించును. భూలోకమున, మృత్యుసమావేశసమయములో దృశ్యమానమగు ప్రారంభ (ప్రాథమిక) సూచనలు ఇక్కడి అధోభూమికలలో దర్శనమిచ్చును.

భూలోకములోని సర్వవస్తువులును, సూక్ష్మపదార్థ ప్రపంచములో లభ్యములగు రూపముల సంకుచిత స్వరూపములే-శక్తి, సౌందర్యము, జ్ఞానము, తమ సంపూర్ణ స్థితి నుండి క్షీణించి, తుదకు పదార్థమయ భూలోకములో అతలాకుతలములై, అల్లకల్లోలస్థితికి చేరును.

ఇట్లు పతనభూయిష్ఠమైనను, భూలోకము మానవుని అంతరాత్మకు సేవ చేయు మంత్రసాని వంటిది. దాని గర్భాంతరములో దివ్యతత్త్వము, నిక్షిప్తమై దాగియుండి అభివ్యక్తమగుటకు ఒత్తిడి చేయబడుచున్నది.

అది చైతన్యము యొక్క శక్తిగ, పరిస్ఫుటత కలిగి, క్రియాశీల పరాత్పర తత్త్వము (సృష్టికర్త) చే ఊహించబడిన దానినంతను, ఈ భూలోకములో నిర్మాణము చేయుటకు పట్టుదలతో పనిచేయును. ఈ శ్రమపడు శక్తి మానవునిలో స్వతః

ఎరుక గలదై (ఆత్మవంతమై) అతనిలో, అతని ద్వారా మృత్యుమయ సీమలో అమరత్వమును స్థాపించుటకు ప్రయత్నించును.

ఈ పని సాధ్యమగుటకు హేతువు, భూలోకము తానొక్కటిగ లేదు. తరతమభేదము గల వివిధశ్రేణులలోని సత్త ద్వారా ఉన్నతచైతన్య భూమికలలోని కాంతి, శక్తులు సంతతాము ఈ లోకములోనికి ప్రవహించుచున్నవి. ఆదిలోని భావన రూపుదిద్దుకొని సాక్షాత్కరించుటకు నిర్విరామముగ అది తన శక్తిప్రభావముచే పీడింపబడును. అది కొన్ని నిష్ఫల, అర్ధఫలప్రద ప్రయత్నములను అపరిపక్వ యంత్రాంగములతో చేయుచున్నది. ఈవిధముగ ప్రకృతి, నెమ్మదిగ అడుగు మీద అడుగు వేయుచు (ఒక్కొక్క అడుగు వేయుచు) సిద్ధివైపు పయనించును.

ఊర్ధ్వమున గల, దివ్య పరాత్పర తత్త్వము, మనలోని ఉన్నతాశయ ప్రయత్నములకు నిమిత్తకారణ మగును. అది, తన ఏకాత్మ క్రియాశీలతలో అభివ్యక్తమైన దాని నంతను పట్టి ధరించి ఉంచును. ఈ పరాత్పర తత్త్వములో సృష్టి అంతయు ఏకాత్మస్వరూపము. ఆ ఏకైక సత్యమును, సృష్టి అంతటిలోని ప్రతి స్తరమును, తన ప్రత్యేక లక్షణ స్వరూపములలో అభివ్యక్తము చేయును. ఈ భౌతిక ప్రపంచమునకు పై నున్న ఉన్నత భూమికలలో ఒకానొక ఉన్నత ప్రకృతి పని చేయుచున్నది. అది భగవత్తత్త్వమును, జ్ఞాన సౌందర్య ప్రేమ ఆనందములను అకుంఠిత తీవ్ర పరిపూర్ణస్వరూపములలో ఆవిష్కరించును. ఈ సృష్టిమయ క్రియాశీలనము, మానవునిలో కూడ కలదు. కాని అది లోతులలో అణగిపోయి ఉండి అప్పుడప్పుడు తన శక్తిధారలను స్వల్పముగ పైకి విసరుచుండును.

మన భౌతిక పదార్థమయ ప్రపంచమునకు సన్నిహిత ఉన్నత శ్రేణిలో గల ఈ సూక్ష్మప్రపంచము తన స్వరూప లావణ్యములో అంగసంయోగములో పరిపూర్ణమైన సంకల్ప నిర్దేశము గల ఒకానొక అపూర్వత కలిగియున్నది. దాని సరిహద్దులలో (పరిధులలో) అది యొక సంపూర్ణమైన ప్రపంచము: అందలి సర్వమును ఆ పరిపూర్ణతలో నిలుచుటకు సుఖానుభూతిని పొందియుండును. అక్కడ అభివృద్ధి కొరకు గాని, తన్ను తానతిక్రమించుటకు గాని ప్రయత్నము లేదు. అందువలన

అక్కడ అపజయములుగాని బాధలుగాని లేవు. అంతయు అందాల చక్రములో బిగింపబడినది. ఈ అనంత సౌందర్య స్వరూపములు, రంగుల మధ్య అంతరాత్మ అదృశ్య మగును. ఉత్సాహముతో నిండిన లయలు, ప్రకాశమానమగు పరమానంద ములు గల మనోరంజకమైన క్రీడలలో ప్రకృతి సంతుష్టిగ విరాజమానమగును.

అశ్వపతి ఈ అద్భుత సీమను దర్శించి ఆశ్చర్యచకితుడై అక్కడ కొంత సేపాగెను. కాని, అతని ఆత్మ ఉన్నతములోని కెగురదలచి అక్కడెక్కువ కాలముండుటకు సహించకుండెను. ఈ దేదీప్యమానమగు ద్వారమునుండి గొప్ప, విశాల దేశములతో నిండిన లోకములలోనికి అశ్వపతి సాగిపోవును.

2 వ పుస్తకము (4 వ కాండము)

ప్రాణప్రతిభ - పతనము

అశ్వపతి సూక్ష్మభౌతిక లోకములను వాటి పైకి పోవుచు ప్రాణమయ సీమ లను ప్రవేశించెను. అతడు, తనముందు విస్తరించుకొనిన విశాలతల గుండా పయనించుచుండ, వాటి పొలిమేర రేఖలు దూరముగ జరిగిపోవుచుండెను. స్థిరత్వ మెక్కడను లేక, సర్వమును ప్రవాహరూపములో నుండెను. రక్షణకై ప్రాకులాడక ముందు వెనుక లాలోచించక బాధకుగాని, పతనమునకుగాని లెక్కచేయక సాహసో పేతమైన కార్యక్రమములే చేపట్టుచుండెను. ప్రాణము తన అంతరములోని ఒకా నొక బుద్ధికుశలతను గమనించి అది వేసిన బాటలో ప్రసరించుచున్నట్లు గోచ రించెను. ఒకప్పుడు నెమ్మదిగను, మరొకప్పుడు బాణమువలె వేగముగను సర్వదా సంచలనము గలదై యుండెను. అది అన్ని భావముల గుండా విషాదము, సంతోషము, ఆవేశము మొదలుగా గల వాటి గుండా ప్రసరించుచు సంతత అసంతృప్తిలో సాగుచుండెను. ఆ ప్రాణము తానిదివరలో అనుభవించిన, సుఖము లను, అందములను జ్ఞప్తికి తెచ్చుకొని, వాటిని తిరిగి అనుభవించుటకు వ్యర్థ ప్రయత్నము చేయుచు కలలు కనుచుండెను దాని లక్ష్యము ఒక దిక్కునకు-ఆనందమయ స్వర్గలోకము వైపునకు కాగా, దాని నడక, అడుగులు మరియొక పంథాలో-దుఃఖములతో, బాధలలో నిండిన యమలోకము వైపు సాగుచుండెను.

అశ్వపతి ముందుకు పోయిన కొద్దీ, దుఃఖరహిత ప్రాణసీమలను దర్శించ సాగెను. అవి దుఃఖము బాధలలో (కష్టములతో) నిండిన క్రిందిలోకములకు పైన ఉన్మత్తమై యుండెను. మానవుడు ఊహింపజాలని దేవతల వైభవముతో అవి ప్రకాశించుచుండెను. అయినప్పటికి అవి మానవుని కందుబాటులోనే యుండెను. మానవుని అంతరంగ గతులలో ఈ వైభవోపేతమైన స్థితులు అమృతత్వముతో నిండినవిగ నుండెను. అరుదైన అంతరంగానుభూతిలో వాటి మెరుపులను దర్శించును.

అశ్వపతి, ఉన్నత శిఖరములలో నున్న ప్రాణభూమికలలోనికి ఆకర్షింప బడెను. అవి ఆత్మవిశాలతలలో కరగిపోవు చుండెను. అచట అంతము అనంతము లోను కాలము శాశ్వతత్వములోను సమ్మిళితమై సాగుచుండెను.

ఏకము, శాశ్వతము అయిన వానినుండి విశ్వశక్తి దేశకాలములలోనికి అనేకత్వము నావిర్భవింపజేసెను. శాశ్వత నిశ్చలత నుండి విశ్వసృష్టి బయలుదేరి, దానిచే ధరింపబడినది. ఏకత్వము, అనేకత్వమున కాధారమై, పరాత్పరునిచే, విశ్వాత్మకసృష్టి, ఒకానొక ఆంతరంగిక బుద్ధి వలె ప్రోత్సహింపబడి నడిపింపబడు చుండెను. ఈ సృష్టి అంతయు, సత్త, దాని అంశములగు పురుష ప్రకృతుల ఖేలనము మాత్రమే. ఈ సృష్టివ్యాపారములో ఉచ్చనీచములు కలవు. అశ్వపతి ప్రాణభూమికలోని ఉన్నత నీచ శ్రేణులను రెంటిని దర్శించెను. ఉన్నత శ్రేణులలో ప్రాణశక్తి వైభవోపేతమైన ప్రభుత్వము కలిగియుండును. నీచ శ్రేణులలో ప్రాణశక్తి, పతనము, పరిమితత్వము, వికృతత్వములకు లోనగును.

ప్రాణము యొక్క ఊర్ధ్వ స్తరములలో నున్నదంతయు ఆనందము, సంతోషము, విజ్ఞానము, స్వేచ్ఛామయము, అధోభూమికలలో నున్నదంతయు, పోరాటము, వివాదము, భయము, దుఃఖమయము. ప్రాణశక్తి తన విరోధి అయిన మరణము యెడల అనురాగము కలదానివలె కనిపించును-దానితో ఆటలాడును. ఈ ఆకర్షణ, ఈ విరోధి ఆసక్తిని ప్రదర్శించు ప్రాణశక్తి అనుభూతులు, ఈ సృష్టిని అనురాగ విరాగముల క్రీడాకేంద్రముగ మార్చివేసినది.

వీటి నడుమ, మానవుని కంటబాటులో నున్న కొన్ని లోకము లుండును. అక్కడ ఉన్నత భూమికలలోని పరిశుద్ధత ఆనందములకు సంబంధించిన శక్తి యుండును. వాటి శిఖరములలో భగవంతుని శ్వాసను స్పృశింపవచ్చును. అక్కడ దివ్యప్రేమ, దివ్యానందములు అవతరించి, పరిపాలించగల శక్తివంతమైన ఆకాంక్ష కలదు. అక్కడి భావములు, భూలోకములోనివాటికంటె మిక్కిలి నిర్మలములు, తీక్ష్ణములు. భూలోకములో, విరోధ భావముతో కలహించున వన్నియు, అక్కడ ఒకదానితో నొకటి పూరించునవిగ గోచరించును అక్కడ అసత్యము లేదు. కనుక, అశక్తులకు తావులేదు. జ్ఞానము, శక్తి నేకమై యుండును. ప్రకాశమానమగు పరమాత్మకు, ప్రాణము హర్షోన్మత్త భాగస్వామిగ నుండును. అలసట, జీర్ణత్వము జాగ్రత లచట లేవు. అక్కడి కర్మ అంతయు క్రీడాస్వభావము కలదియే. క్రీడయే అక్కడి కర్మ. ఆ లోకములలోని వ్యక్తులు సర్వదా యౌవనముతో నిండి అద్భుత విజయోత్సాహములలో తులతూగుచుందురు. మనస్సు ఆలోచించుటయను శ్రమ లేకయే సహజముగ పనిచేయును. అచటి సృష్టిలో సంతోషము, ఆనందములు పులకరించుచు ప్రవహించును. అచటి జీవితములు, కదలికలు, స్వేచ్ఛ కలిగి, వానియంతటనవియే ఒక క్రమములో నుండును. సత్యమును సంకుచితపరచు కృత్రిమత నచట చూడము. ప్రకృతి తనంతట తానే మార్గదర్శియై నడుచును. భగవంతుని లయ విన్యాసములతోకూడిన సృష్ట్యాత్మక నాట్యపద్ధతులలో దృష్టిని కప్పివుచ్చు నీలి నీడలు అచట నుండవు.

అశ్వపతి ఈ ఆనందమయ లోకముల వైపు ఆకర్షింపబడెను గాని, తనకు వాటికి మధ్య ఒక పెద్ద అగాధమున్నట్లు గ్రహించెను. అతడు స్వాభావికముగ భూలోకములో అనుభవించిన దుఃఖము, బాధ, అంధకారముల వారసత్వములకు సంబంధించిన వాసనలు పీడించుట ఇంకను మానలేదు. ఈ దుర్బలత్వమే అతడు ఉన్నతానంద డోలికల సహజ ప్రతిస్పందనల నందుకొనకుండ అడ్డు తగులుచుండెను. సుఖదుఃఖములు, వెలుగునీడలు మొదలుగాగల వ్యతిరేక ద్వంద్వములు అతని ప్రకృతిలో భాగముగ నిలిచియుండెను. ఇదియే, ఈ ద్వంద్వ స్వభావమే భూలోకములోని ప్రాణ ప్రకృతి యందు స్థాపితమై యున్న అలవాటు.

భూలోకసృష్టి ప్రారంభములలో ప్రాణము, మనస్సు భావనలు లేవు.అంతయు జీవరహిత జడ పదార్థమే. క్రమముగ అంతరముల నుండి కదలిక ప్రేరణ ప్రారంభమాయెను. అంతట ఆదిలోని సమరస స్థితిలో ఒక సంచలనము సంభవించెను. అప్పుడొక ఉద్బోధము (మేల్కొలుపు) కలిగి ప్రాణమునకు సహజ భూమిక నుండి అవతరించి, వివిధ రూపములు గల కదలికను స్పందింప జేయుటకు ఆహ్వానము వచ్చెను. ప్రాణము ఆ పిలుపు నాలకించి, భూ ప్రపంచమును తన శక్తి సంతోషములతో నింపుచు, దానిపై దాడిచేసెను. తత్ఫలితముగ ప్రాణవైభవము, సుఖము, ఆనందములు పశులోక సౌందర్యమునందలి వేగమును జలదరింప జేసెను. ఈ విధముగ మానవుడు తన అంతరాత్మ, ఆలోచనలతో ప్రపంచరంగము పైన విహరించుట కవకాశ మేర్పడెను. కాని, ప్రాణశక్తి పూర్తిగ ప్రతిష్ఠితమగుటకు పూర్వము, అంధకారమయ అజ్ఞానశక్తి తన నీడను మానవుని అంతరాత్మపై ప్రసరింపజేసి ప్రాణశక్తి ద్వారా అభివ్యక్తమగుచున్న పరాత్పర తత్త్వముపై బుద్ధిపూర్వకముగ ఒక కఠిన పరీక్షను పెట్టినది. తద్ద్వారా ప్రాణశక్తికి సహజమైన ఆనంద సౌందర్యములు వికృతములై క్షీణించి దాని క్రియాశీలత కుంటుపడెను. దాని అమృతత్వము మరుగుపడి దాని సంకుచిత కదలికలలో కోరిక, పోరాటములు (కలహములు) ప్రాణమును పీడించ మొదలిడెను. ప్రాణము, మరణమునకు, ఉపకరణములనందించు తత్త్వముగ మారిపోయినది.

---

2 వ పుస్తకము (4 వ కాండము)

అల్ప ప్రాణసీమలు

అది అనుమానము, అనిశ్చయములతో నిండిన ప్రపంచము. పదార్థము ప్రాణముతో సమ్మిశ్రమ మగు సీమ, నెమ్మదిగ ఆవిర్భవింపసాగెను. అజ్ఞానములో విలీనమైన చైతన్యములో మరుగుపడియున్న శక్తి స్పందించెను. అది పదార్థమయ

వస్తువులను వశపరచుకొనుటకు పెనగులాడుచుండెను. ఊర్ధ్వలోకానందముల నుండి క్రింది భూలోక బాధలలోనికి దిగజారిన ప్రాణము, సుఖ దుఃఖముల మధ్య శ్రమ పడుచు ఊపిరి పీల్చుకొనుచుండెను.

ప్రాణశక్తిలోని ఆకలి, భూలోకము యొక్క ఆకలితో కలిసి తోడయ్యెను. తత్ఫలితముగ గొప్ప అశాంతి చెలరేగి, మానవునిలో అంతులేని కోరిక తయారయ్యెను. ప్రాణముయొక్క రాకతో ప్రపంచములోని విశ్రాంతి నశించినది. మానవుడు తనకు లేనివాటికొఱకై తీవ్రమైన ఉద్రేకముతో వాంఛించ మొదలిడెను. ఆ కోరిక లేనియెడల నరుడు పశువులు, వృక్షముల వలె సంతృప్తి కలిగి యుండెడి వాడు. ఈవిధముగ మానవుడు సుఖము లేనివాడై అన్వేషించుట, ఆకాంక్షించుట ప్రారంభించి పెరుగుట మొదలిడెను. ఆతడు బాహ్య జీవితము పరిశీలించి, అంతర జీవితమును కూడ పరిశోధించ దొడగెను. ఆతడు తనలో ఆత్మను, మనస్సును సిద్ధింప జేసుకొని ప్రకృతికి ప్రభువుగ తయారగుచుండెను. అంతకు పూర్వము అతడు ప్రకృతికి బానిసగ నుండెను.

పదార్థములో ప్రాణశక్తి ప్రవేశించి దానిలోని అజ్ఞాతశక్తి లేచుటకు, కుదిపి బలవంత పెట్టును. ఒకానొక సార్వజనీన ప్రబోధము కలిగిన భావము (Sensation) ఉద్భవించెను. ఆలోచనలేని కారణము చేత సహజబుద్ధి (Instinct) మార్గదర్శియై నడిపించును. ప్రాణము, తన బలవంతముతో కదలుట, పెరుగుట, వ్యాపించుట మొదలగు పనుల ద్వారా, తానక్కడ పోగొట్టుకొనిన తన అంతస్థిత ఆనందమును నెమ్మదిగ వెదుక మొదలిడును.

అశ్వపతి ప్రాణపంథాననుసరించి పోవుచు, క్రమముగ భూలోకములో దాని అజ్ఞాతారంభమును, వెదకుచు అంధకారమయ నిశను, మృత్యువులతో దాని సన్నిహితత్వమును గమనించెను. మరణమును తన ప్రతిష్ఠ కొరకై ఒక ఉపకరణముగ వినియోగించదలచెను. ఇక్కడనే ప్రాణపతనమునకు సంబంధించిన అధోబిందువు కలదు.

ప్రాణము పదార్థములో ప్రవేశించి తన పనిని సాగించుటకు ప్రారంభించిన చోట, అశ్వపతికి తాను నిలుపుకొనుటకు స్థిరమైన స్థానము దొరకలేదు. అర్థవంతమైన సంచలనము కూడ గోచరించలేదు. అంతా క్షణికము (తాత్కాలికము). ఆకారములు రూపుదిద్దుకొని, ఒకదానితో నొకటి స్పందించుచు భావనగ (Senseగ) సహజబుద్ధిగ (instinctగ) తయారగుచుండెను. శక్తులు ఒకదానితో మరొకటి పోరాడుకొనుచు ఒక స్థిరమైన ఉనికికై పెనుగులాడు చుండెను. భావనలు, ఇంద్రియ స్పర్శలు దృశ్యములై వెంటనే అదృశ్యములగుచుండెను. సర్వము ఒక వ్యర్థమైన గందరగోళము వలె కనిపించెను.

కాని ఈ నిరర్థక వ్యాసంగముల వెనుక ఒక ప్రయోజన మున్నదని అశ్వపతి దర్శించెను. బాహ్యముగ నిర్హేతుకముగ కనిపించు వ్యవహారముల వెనుక ఒక సహేతుక కార్యక్రమ మున్నదని గమనించెను. ఘనీభూతమై నిద్రావస్థలో నున్న పదార్థము నుండి ఒక శక్తి బహిర్గతమై ప్రాణసీమలో ప్రవేశించెను. అజ్ఞానము నుండి నెమ్మదిగ చైతన్యము ఆవిర్భవించుచుండెను. ఈ కదలిక లన్నియు లోపల దాగి యున్నది అభివ్యక్తమగుటకు, మార్పుకొరకు, ఒక అనివార్యమైన ప్రేరణ నాధారము చేసికొని పొసగుచున్నవి.

అశ్వపతి, ఈ సంచలనముల సంతత స్రవంతి ననుసరించి వాటి మూలముల వద్దకు పోగా అక్కడ పదార్థములో పరాత్పర తత్త్వము నభివ్యక్తము చేయు, సృష్ట్యాత్మక శక్తిగల శరీరధారి యగు ఒక అంతరాత్మను ప్రాణము యొక్క మధ్యవర్తిత్వము ద్వారా గమనించెను. ఈ శక్తి వెనుక, సృష్టిలో అభివ్యక్తమగుచున్న పరమానందలీలను దర్శించెను. ఈ ప్రధానమగు ఆనందమే, మనఃప్రాణశరీరములు సంతోషానందముల వైపు సాగించుచున్న సంచలనములకు మూలాధారములు. ప్రాణశక్తి తన ఆనందమును, సమీకరణ ద్వారాగాని, వినాశము ద్వారాగాని, వృద్ధి పరచుకొనవచ్చును.

ఆనంద సంకల్పము, తన ప్రతిభను పదార్థములో ప్రకటించుటకు చేసిన ప్రథమ ప్రయత్నమును, పదార్థముయొక్క తామసిక స్వభావము చూపిన ప్రతిఘట

నను కూడా అశ్వపతి అచట దర్శించెను. అయినప్పటికీ, పట్టు విడువకుండ చేసిన ప్రయత్నముల ద్వారా నిప్పు శక్తులు వేసిన సంబంధముల మధ్య బంధింపబడిన చైతన్యము నెమ్మది నెమ్మదిగ తన్నుతాను కూడగట్టుకొని పైనున్న వెలుగు పైపు చూడనారంభించెను.

సృష్టితత్త్వము తన అవతరణలో చివరి మెట్టగు నిశ్చేతనలో ప్రవేశించి నపుడు సచ్చిదానందముయొక్క పరమ సత్త కూడ ఆ అభావరూప శూన్యములోనికి దిగియుండనిచో, అంతయు సర్వనాశనమై యుండెడిది. ఆ అవతరణ, పర్యావసానములో సత్తను శూన్యముగ, చేతనశక్తి నిశ్చేతనగ, ఆనందమును దుఃఖముగ గొప్ప మార్పును సంభవింప చేసెను. ఈ వ్యతిరేకభావము సృష్టిలోని ప్రాణమునకు మూలమాయెను.

మరుగున పడియున్న ఆత్మకును, అజ్ఞానమయ ప్రకృతికిని మధ్య యుగ యుగాలుగా నడచుచున్న దాగుడుమూతల ఆట నెమ్మదిగ ప్రారంభమాయెను. ఇది క్రమముగ ఘటిల్లుచున్న పరిణామదశలు గుండా ప్రకృతియొక్క పెనుగులాడే శక్తి, మనస్సులో విశాలమైన చైతన్యసీమలలోనికి ఆవిర్భవించి పరమసత్తతో ముఖాముఖిగా నిలచువరకు సాగుచుండెను.

మహత్తరమైన పరాత్తత్త్వము ప్రకృతిలో కప్పి దాచబడినట్లు అశ్వపతి గ్రహించెను. ఆత్మశ్వాసను, పదార్థప్రతిస్పందనను గమనించెను. ఒక మహోజ్జ్వలమైన శక్తి అంశు నెమ్మదిగ జన్మించుట చూచి, దాని అభివృద్ధి మార్గము ననుసరించెను.

పదార్థసీమలో ప్రాణము యొక్క తాత్కాలిక అల్పారంభములను దర్శించిన పిమ్మట, అశ్వపతి మేల్కాంచిన ప్రాణము యొక్క సుస్థిరచర్యలను చూడ నారంభించెను. ప్రాణము వివిధ ఆశ్చర్యకర రూపములను దాల్చుచుండ, అందు యోచనా భావము పనిచేయుటకు ఉపక్రమించెను. ఇంద్రియ జ్ఞానశ్రేణిలో ప్రాణము గల జీవములు రూపములతో సృష్టిలో బయటపడ జొచ్చెను. అవి, కీటములుగ, చిన్న పెద్ద జంతువులుగ కొండచిలువలుగ, భయంకర చక్రములుగ (మొసళ్ళుగ) పెద్ద

ఏనుగులుగ, చిన్న మనుష్యులుగ, రూపువాల్చి గోచరించినవి. మానవునిలో ప్రకృతి పరిణామ ప్రక్రియ ఒక ఉన్నత స్థితిని చేరెను. ప్రకృతి చైతన్యము మానవునిలో, ఆత్మజ్ఞానము కలిగియుండు నూతన దశకు చేరెను.

మానవుని చుట్టు నున్న పశుజాతి, సృష్టిలో చైతన్యచర్యలు, బాహ్య విషయములకు ఆ జీవుల ప్రతీకారములై యుండెను. ఒకానొక అవసరము వాటి జీవితములను నడిపించుచుండెను. వాటిలోని అల్పమనస్సునకు చుట్టుచున్న వాతావరణము ప్రతికూలముగ గోచరించెను. అది ఇంద్రియ పరమైన మనస్సు. దానికి తనంతట తానుగ యోచించగల శక్తిలేదు.

ఆ దశలో మానవులను కూడ పాలించి నడిపించునది ఆ ఇంద్రియ మనస్సే. వారు (మానవులు) ప్రకృతినుండి పొందగలిగినంత సంతోషముతో ఒక క్షణము నుండి మరొక క్షణము వరకే జీవించుచుండిరి. శారీరక సుఖములే వారికి ప్రధానములాయెను. ఆలోచించుట, విచారించుట వారికింకను తెలియకుండెను. మృత్యువు యొక్క ఆధిపత్యములోనుండి ప్రతికూల ప్రపంచములో పూర్తిగ నిమగ్నులై యుండిరి. ఆత్మరక్షణ కొరకు, స్వల్ప సహకారముతో వారి భౌతిక జీవితము చిన్న పరిమితిలో నిర్మింపబడెను. మిగిలిన దంతయు, హింసామయమై దోచుకొనుటలలో నిండి యుండెను. వారి సంఘములు పోట్లాడుకొనుచు సంగరప్రియములై యుండెను.

ప్రాణశక్తి, ఈవిధముగ సర్వప్రాణము (All-life)తో పోరాడుచు దాగి యున్న చైతన్యము యొక్క సామర్థ్యమును వృద్ధిపొందించుచుండెను. సహజబుద్ధి స్మృతి, ప్రయోగాత్మక నైపుణ్యము, ఆత్మాన్వేషణమార్గములో రూపుదిద్దుకొనుచుండెను. ఈ దశలో పరిణమించుచున్న ప్రాణశక్తి, వాస్తవమైన మనస్సును వికసింపజేయలేదు. అప్పుడు పని చేయుచున్నది, ప్రాణములోని మనస్సు, ప్రాణమయ మనస్తత్త్వము. అక్కడ జీవితానందమున కన్వేషణ, ఇంద్రియ లోలత్వములే పైచేయి గలవై యుండెను.

తరువాత అశ్వపతి మూడవరకమైన ప్రాణసృష్టిని దర్శించెను. మనోభూమిక యొక్క ఒత్తిడి కారణముగ, యథార్థమైన మనస్సు రూపు దిద్దుకొను చుండెను. కర్మలు (చేష్టలు) యోచనలచే ఉద్దీపింపబడుచుండెను.

ఆదిలో మనశ్శక్తి, రూపుదాల్చిన ప్రాణప్రసారములో చిక్కుకొని పని చేయుచుండెను. బాహ్య ఆలోచనలు దానికి లేకుండెను. ఇంద్రియ స్పర్శలు, భావనలు, నిమ్నచేతన సంకల్పములు, వాంఛలు, ఎక్కువగ సాగుచుండెను. క్రమముగ ఒకానొక అవలోకనశక్తి ఈ అస్తవ్యస్తపు కదలికల నన్నిటిని కూడగట్టి, ఎరుకగల ప్రకాశమానమగు బిందువు చుట్టును నిలబెట్టి, ప్రాణశక్తి ప్రవాహమును, ఒక పద్ధతిలో ఒక రూపములో తీర్చి, జీవుల ప్రాణిక మనస్సునకు స్థిరమైన రూపము నిచ్చుచుండెను.

ప్రాణము, మృత్యువుయొక్క వాడి నుండి ఆత్మరక్షణకై బలమైన రక్షక కుడ్యములను నిర్మించుకొను చుండెను. జ్ఞానము నిశ్చేతన సీమలలో సంచరింప నారంభించెను. ఆత్మ స్థిరమైన ఉనికికై రూపు దిద్దుకొనుచుండెను. పరిమిత బుద్ధి పని చేయుటకు మొదలిడెను. అజ్ఞానము చేత నడిపింపబడుచున్న ప్రకృతి అలవాట్లలో హేతువు కలుగ జేసుకొనుచుండెను. ఖండిత ప్రాణశక్తి యేర్పరచిన పల్లపు దారులలో ఆలోచన కదల నారంభించెను. దాని వ్యాపకత దృష్టి, ప్రాణఖండముల పక్షములచే పరిమితము చేయబడియు, అవియే సంపూర్ణమైనవిగ భావించును. మనస్సు ఇంకను శరీరమునకు బానిసగనే యుండెను.

ఈ చిన్న, అల్పమైన ప్రారంభములతో మనస్సు అజ్ఞానరాశిలో (అంబుధిలో) నిమగ్నమైయున్నప్పటికి, ఒక నిర్మల కాంతికిరణముగ వృద్ధిపొందెను. ప్రాణశక్తి తన సీమకు కట్టువడి, ఈ సూక్ష్మ ఆలోచనాశక్తిచే నడిపింపబడి సామాన్య సంచారములు చేయుచు, విసుగు పుట్టించెడు ఒకే విధమైన రీతిలో తన ఖేలనను, సాగించుచుండెను. భూలోకములోవలె దాని చర్యల స్వభావము గాని, ప్రవర్తన విధానము గాని తనదే యగు లోకములో మారదు. ప్రాణభూమిక ఒక నమూనాలో ఉంచబడి, పరిణామ సూత్రము చే నడిపింపబడుటగాని, మార్పుచెందుటగాని లేక, స్థిరమైన రూపములో ఉండెను.

2 వ పుస్తకము. (5 వ కాండము)

అల్ప జీవుల దేవతలు

అల్పప్రాణిసామ్రాజ్యము, మృదుత్వము లేని కఠినమైన రూపములతో సంకుచిత శక్తితో, దుఃఖభూయిష్ఠమై, అజ్ఞానముతో నెలకొల్పబడినదిగ అశ్వపతి చూచెను. ఈ ప్రపంచ రహస్యమును తెలిసికొనుటకు అశ్వపతి తనదృష్టిని పైనున్న తమస్సు గుండా ప్రసరింపజేసి ఆ సత్తయొక్క ధర్మమును గ్రహించుటకు అన్వేషించెను.

ఈ అల్పవ్యక్తులు ఆయన కనులకు చూచుటకు అసహ్యముగ సర్వదా సంచలనము కలపై ఒక పెద్ద గుంపుగ కనిపించినవి. దయ్యములుగ, చిన్న పిశాచములుగ దుష్ట భూతములుగ, పిశాచములుగ మిగిలినవి. సగము పశువుఆకారము, సగము దేవతాకారము కలవిగా నుండెను. వాటిపని, వెనుక దాగియుండి ప్రోత్సహించుట, ఉసిగొల్పుట, ముందుకు త్రోయుట, అపమార్గము పట్టించుట కాగా, వానినంతటిని అశ్వపతి పరిశీలించెను. వాని ఏకైక కృత్యము పాడుచేయుట, చెడగొట్టుట ఆ చర్యలతో ఆనందించుట. వారి చేష్టలు తమ ప్రపంచమునకు మాత్రమే పరిమితము కాలేదు. ఇతర లోకముల లోనికి గూడ ప్రసరించినవి. ఎక్కడ సంకుచితత్వము, గందరగోళము మూర్ఖత్వములు తాండవించుచుండునో, అక్కడ అల్పజీవులు తమ ప్రభావము చూపుచుండిరి. మానవుని అర్ధచైతన్యము, అచైతన్య భాగములలో అవి నక్కి ఉండి మానవుని పెడమార్గము పట్టించుచుండెను.

భూలోకము ఒక మూసిపెట్టబడిన వ్యవస్థ కాదు. ఇతర లోకములలోని శక్తుల ప్రమేయమున కది తెరచుకొనియే యున్నది. ఇది పరిణామమునకు, అభివృద్ధికి క్షేత్రము. మిగిలిన లోకముల వలె ఇది ఒక స్థిరమైన నమూనాలో సృష్టింపబడినది కాదు. ఇక్కడ ప్రతి విషయము వ్యతిరేకత, పోరాటముల మధ్య సాగుచు చివరకు సామరస్య సంపూర్ణతలకు చేరును. కాని ఈ మార్గము సుదీర్ఘమై, నిశ్చేతన అంధకారము, అజ్ఞానముల దట్టమైన పొరలగుండా సాగుచుండును. అయినప్పటికి,

నైపశక్తి, సంకల్పములు దానిని నడిపించుట కారణముగ పర్యవసానములో వెలుగు, స్వాతంత్ర్యములను చేరుటకై విజయవంత మగుచున్నది.

ప్రారంభములో ఈ గంభీర రహస్య ప్రపంచములో సర్వమును, ఒకానొక బుద్ధిలేని యంత్రము యొక్క సంచలనముగ గోచరించును. కాని నిజమునకు అందులో కూడ భగవంతుడు కలడు. గుప్తముగ లోపల ఉండి తన సంకల్ప శక్తితో నడిపించును.

తీవ్రమైన వేగసంచలనములో పరాత్పర తత్త్వము పదార్థమైనది. సర్వత్ర వ్యాప్తమై యున్న నిశ్శబ్దములో ఆకారములు రూపు దిద్దుకొనినవి. అక్కడ సంవేదనము లేదు. చైతన్యము కానరాకుండెను. అంతయు నిశ్చేతనమయమై యుండెను. ఈ నిశ్చేతనత వెనుకను, దాని ద్వారాను దివ్యజ్ఞానము (భగవద్బుద్ధి) పనిచేయు చుండెను. చైతన్యము కప్పబడి యుండెను. అట్లే సర్వమునకు మూలకారణమైన పరమానందము కూడ మరుగుపడి యుండెను. సర్వమును ఒకానొక యాంత్రిక శక్తిచే నడిపింపబడు చుండెను.

అతి సూక్ష్మమై గ్రహణ యోగ్యము కాని ఆకాశములో శబ్దము, స్పర్శ, ఒరిపిడులు సంభవించెను. ఇది, అగ్ని చిందునట్టి కెరటము (Wave-Particles) లతో నిండిన విద్యుచ్ఛక్తులు కలుగుటకు దారితీసెను. అణువు మహోన్నతమైన సంభావ్యశక్తి కలిగి పదార్థ వ్యవస్థగ పరిణమించెను.

ఈ అద్భుత ప్రపంచము, అంధకారమయ అజ్ఞానము నాధారముగ చేసికొని నడచు మానవ బుద్ధికి ఒక జటిల ప్రశ్నగ (సమస్యగ) నిలిచిపోయినది. ఇది మాయ నిర్మించిన కథయా ? అని మానవ బుద్ధి ప్రశ్నించుకొనును. ప్రథమ దృష్టికి అది (ప్రపంచము) స్థిరమైన అచంచల మూలభిత్తికపై నుండ, అంతులేని కదలికలు ఊర్జితములు ఒక నియమిత వలయములో దానిపై తిరుగు చున్నట్లు గోచరించెను. కొంతకాలమునకు ప్రకృతిలో ప్రాణము అవిర్భవించగా, ఒక చైతన్యమయ నూతన సంచలనము ప్రారంభమాయెను.

ప్రాణము, పదార్థరూపములను జీవచైతన్యముతో నింపెను. కాని, పదార్థ ధర్మములకే కట్టుపడి యుండెను. బాహ్యముగ దాని చర్యలో ఎట్టి ఉద్దేశమును ద్యోతకము కాకపోయెను. దాని సంచలనములు ఒకానొక, సంకల్పశక్తిని సూచించునవి. సంవేదన, భావన, పులకరింతలు, వాటియంతట నవియే ప్రకటితము లగుచుండెను. ప్రాణము, కోరికద్వారా వ్యాపింప మొదలిడెను.

క్రమముగ ఆలోచనలు తొంగి చూచుట ద్వారా మానసిక వ్యాపారము (చేష్ట) ప్రారంభమాయెను.

తరువాత పశుజాతి సృష్టి ప్రారంభమాయెను. ఈ పదార్థము నుండి మానస మూర్తి సృష్టించబడెను. ఆతనిలో యోచనాత్మక మనస్సు ఉద్భవించెను. అది ప్రాణము నుద్ధరించి కాంతిలేని తన శక్తులలో ఒక క్రమమును స్థాపించెను. ప్రకృతి మానవునిలో బాహ్యమైన ఎరుక కలదై, తన శిరస్సును వెలుగు స్వర్గముల వైపు త్రిప్పెను. మానవుని ద్వారా, ఎరుకగల వృద్ధి పొందెడు ప్రకృతి శాసనము రూపు దిద్దుకొన నారంభించెను. అహంకారము వాస్తవమైన అంతర్వ్యక్తి యొక్క నీడ అది ప్రప్రథమముగ ప్రకృతిచే నిర్మింపబడెను. ఒక స్వల్పకాలిక ప్రాణము, సంతోషములు, ఆశలు, ఆవేశములు, అనురాగములతో దానిచుట్టు ఆవరించెను. దాని మధ్యలో అంతరాత్మ యుండెను. అది, క్షణభంగురములైన యీ కర్మల చేతను, ప్రాణాంతకములయిన చేష్టలతోను సంబంధము లేనిదై యుండెను. ప్రకృతి యొక్క కృషి, దాగియున్న బుద్ధిబలముతో ముందుకు త్రోయబడి, స్థిరమైన నడకతో గొప్ప భవిష్యత్తు వైపు కదలిపోవు చున్నట్లు ఆతని అంతరాత్మ అవలోకించెను.

ఈ అపారమైన విశ్వము యొక్క రహస్యమును, మనస్సు ఆవిష్కరించ జాలకుండెను. అది పైపైన మాత్రమే పరిశీలించ గలిగెను. దాని ఊహాప్రసారములు ఉన్నత రహస్య సీమలలోనికి, ఎగసిపోవు చుండెను. మానవ మనస్సు ప్రాణము సంకల్పశక్తులు స్వతః సంపదలములై తమ యందు, విశ్వాత్మక విషయములు లేని కారణము చేత తెరమరుగైన ఉన్న విశ్వశక్తి యొక్క ఘనమైన కర్మలను తెలిసి కొనుటగాని, భావించుటగాని, చేయలేకుండెను. మానవులు తమ నిమ్నచేతనస్తరము

నుండిగాని, అవ్యక్త భూమికల నుండి గాని, విద్యుదాత్మక నాదముల ద్వారా నడిపింప బడుచుండిరి.

ఈ దశలో మనస్సు ప్రాణశక్తియొక్క యాచింపు కీలుబొమ్మగ నుండెను. అది చాటునున్న చిన్న చిన్న అంధకార వ్యవహర్తలచే అటునిటు ఊపబడి కదలు చుండెను. ఆ ప్రతినిధులు (భౌతిక అల్పజీవులు) తమకంటె గొప్పదగు మరియొక శక్తిచే ప్రయోగింపబడు చుండిరి. మానవులు తమంతట తామే ప్రవర్తించుచున్నా మని భావింతురు. కాని నిజమునకు వారు, వెనుక నుండి ఈ జీవుల శక్తులచే నడిపింపబడు చున్నారు. మానవులు, తమ స్వల్పజీవితముల యొక్క విషాద-ప్రహసన (Tragi-Comedy) నాటకములో, పాత్రధారులై మానవ లోకమున కావలి ఒడ్డునమున్న ప్రేరకులుగా, యీ అల్పజీవులచే నటింపజేయబడు చున్నారు.

మానవుడు, తన నిమ్న ప్రకృతికి వశుడై జీవించుచు సంతృప్తిపడునంత కాలము, అతని జీవితము పైన చెప్పిన పరిపాటిలో నడుచును. అతని జీవితము, అల్పసంతోషములు చిన్న చిన్న ఆశాభంగములకు లోనై ఒక సంకుచితమైన గాడిలో పోవుచుండును. కొన్ని సమయములలో ఉన్నత ప్రకృతినుండి సహాకారము అనుగ్రహింపబడినను మానవదేహము (ఉపాధి) దానిని ఎక్కువ కాలము ధారణ చేయ లేకపోవుటచే అది తిరిగి వెళ్ళిపోవు చుండును.

కాని, యథార్థ వస్తుసత్య మిది కాదు.

బాహ్యదృష్టికి అవల ఒక ప్రగాఢ దృశ్యము, లోతుగ వీక్షింపగల మనస్సునకు గోచరమగును. ఈ ప్రపంచమంతయు భగవంతుని దేదీప్యమానమగు కాంతితో కంపించుచున్నది. అది అంతవంతము నుండి అనంతమునకును అంధకారమయ నిశ నుండి సత్యము యొక్క ప్రకాశమగు పగటికిని, దేవతయ నడుపుచున్న అభివృద్ధి దాయకమగు క్రీడాక్రమమై యున్నది. బాహ్యముగ ప్రకృతి కొట్టుమిట్టాడు చున్నట్లు గోచరమగుచున్నను దాని వెనుక దివ్యశక్తి తనలక్ష్యమును జేరవలెననే ధీమాతో పనిచేయు చున్నది. ఒకానొక సన్నిధి పై నుండి వీక్షించి నడిపించుచున్నది.

ఏకత్వము, అనేకత్వముతో క్రీడించుచుండెను. (ఈ ప్రపంచములో దృశ్యమానము లగు దుఃఖములు బాధలవెనుక అనంత ఆనందము నిలిచి యున్నది) మూర్తి స్వరూపములో అంతరాత్మ తిష్ఠ వేసికొని కూర్చొని, ఆవిర్భ వించుటకు సమయమునకై నిరీక్షించుచుండెను. అది (అంతరాత్మ) తన భౌతిక భాగములను, పరార్థము నందలి జీవకణముల వరకు తన అభివ్యక్తత నుద్దేశించి తయారు చేయుచున్నది. అంతరాత్మ తన ఆనందమును అందమును, శక్తిని, అప్పుడప్పుడు బయటకు విరజిమ్ముచుండెను. అవియే బాహ్యసత్తలోని అతి మధురమైన క్షణములు. అంతరంగము నుండి బయల్పడు (ప్రవహించు) ఈ సెలయేరులను వెల్గులై ప్రకాశించుచు దాని సీమలగు ఆనందము, ప్రకాశము, శక్తులలోనికి మానవుని ఉద్ధరించుచుండెను.

అశ్వపతి ఈ అల్పప్రాణసామ్రాజ్యములోని పొగమంచు వాతావరణము గుండా ముందుకు సాగి పోయెను. అది అక్కడి విశాలమైన బయళ్ళు, గుస గుస లాడు పిశాచములు, చిన్న చిన్న భూతములతో నిండి యుండెను. ఆ అంధకారమయ ప్రదేశములలో అతడొక దీపకళిక వలె వెలుగు చిమ్ముచు కదలు చుండెను. ఆ సామ్రాజ్యములో నున్నదంతయు అంధకార మయము. అతని దివ్యజ్వాల ఒక్కటే ప్రకాశించు వెలుగై యుండెను.

2 వ పుస్తకము (6 వ కాండము)

పరా ప్రాణదేవతలు - రాజ్యములు

అశ్వపతి అల్పప్రాణుల లోకము నుండి బయటపడిన తరువాత విశాల ప్రాణ (పరాప్రాణ) రాజ్యములో ప్రవేశించెను. మొదట చేరినది ప్రభావము లేని లోకము. అక్కడ దారి తెన్ను లేక కేవలము బ్రతుకవలెనను ఆశతో కూడి విడిచి వచ్చెడి

సంకల్పశక్తి మాత్రమే ఉండెను. నిలుచుటకు ధైర్యము చేయుచున్న ఉత్సాహము (ఆశ) ఒక అనిర్దిష్టమార్గము చేరెను. కాని ఎంతకాలము నిలువగలదో తెలియకుండెను. అక్కడ ప్రాణమొక ఆశ్చర్యకరమైనస్థితిలో నుండెను. ఊరక ఊహలు, కలలు మాత్రమే కనునుగాని, వాటిని వాస్తవికముగ సృష్టించలేకపోవు చుండెను. జీవులు ప్రాణసీమలో జన్మనెత్తుటకు ఆకర్షింపబడు చుండిరి గాని, పొలిమేరలలో ఆగిపోవు చుండిరి. అదియొక మనోహరమైన ప్రపంచము. అచట నిలుచుటకు నేలగాని, లక్ష్యముగాని లేకుండెను.

పిమ్మట అంతకు మించిన సృష్టి ఏర్పడెను. జీవసంకల్పము ఎక్కువ నిర్దుష్టమైన పద్ధతిలో అభివ్యక్త మాయెను. అంతరంగ పరతత్త్వము, ప్రాణము యొక్క వివిధ రూపములపై తన ముద్ర వేయుచుండెను. ఒక లయలో సౌందర్య, ప్రకాశ, ఉత్సాహములు ఎంత అసంపూర్ణము లయినను ముందున్న మహోన్నత వైభవమును చాటుచుండెను.

ఈ (ప్రాణ) సీమ భూలోకముపై గొప్ప ప్రభావమును కలిగించుచుండెను. ప్రాణము యొక్క ఉన్నత స్పందనలు ఇక్కడనే ప్రేరణను పొందుచుండెను. ఇక్కడనే మానవసంబంధమైన నమూనాలు రూపుదిద్దుకొను చుండెను. అంతులేని సంభావ్యతలు, కలల నిచ్చెనపై, మెట్టు నుండి పైమెట్టునకు ఆరోహించుచుండెను. ఒకానొక ఊర్జిత మిక్కడ సంతతము పనిచేయుచుండెను. కాని, ఆ పని స్థిరత్వము లేక క్షణ భంగురమై యుండెను. ప్రాణము పరమోత్కృష్టమైన తన పరాత్పరత్వస్థాయినుండి అవతరించుటలో కోల్పోయిన ఆనందమును తిరిగి సంపాదించుటకు అనేక ప్రయత్నములు చేయుచుండెను. కాని పొందలేకపోవు చుండెను. సాధించలేక పోయినను తన ప్రయత్నమును విరమించకుండెను. ఏలన, తనలోని సృష్టికర్త యొక్క సంకల్పశక్తిచే అట్లు బలవంతపెట్టబడు చుండెను. అది సాధించవలసిన పరమాదేశము (పరమ ప్రయోజనము) అవ్యక్తమును వ్యక్తపరచుట, శాశ్వతమును కాలరూపములతో ప్రకటించుట. ఈవిధముగ ప్రయోజనకరమైన పని యావత్తు తెర మరుగున జరుగుచుండెను. పరిమితమైన తన సాధనలతో ప్రాణము కృషి సలుపుచు

విఫలమగుచు, తిరిగి తిరిగి ప్రయత్నించు చుండెను. జీవించపలెనను సంకల్పము స్థిరపడి, సృష్టి బహుముఖములుగ ప్రకటిత మగుచుండెను.

ఉన్నత ప్రాణము యొక్క అన్వేషణ, దృశ్యమానముగాని, అపలనున్న రోచిస్సుల కొరకే. ఉన్నత శ్రేణుల నుండి వచ్చు అనుగ్రహ స్పర్శను పొంది పరమ నీరవత ననుభవించును. అది దేవతల స్వర్గలోకములకు దగ్గరగా నుండెను. రాక్షస రాజ్యమునకు కూడ అది సమీపములో నుండెను. సర్వదా వ్యాపించుటకు, ఔన్నత్యము నందుటకు, పూర్ణత్వము నొందుటకు అది ఆశించుచుండెను. అందుకై నిరంతర సృష్టికార్యమును సాగించు చుండెను. లక్ష్యమును చేరినట్లే కనిపించెను. కాని, అది చివరకు అసంపూర్ణముగనే ఉండిపోయెను.

ఈవిధముగ ప్రాణశక్తి. తన ప్రయత్నములో అపజయము నెదుర్కొను చున్నను, శ్రమపడి, ప్రతి భూమికలోను (సత్త సీమలలోను) సృష్టికార్యమును సాగించు చుండెను. ఏ పరిస్థితులలో నైనను దాని శ్రమ ఫలవంతమే యగుచుండెను. బాహ్యముగ చలనముగ లేనట్లు కనిపించినను, ఉపరితలమునకు అధోభాగమున పని చేయుచుండును. దానిలో బుద్ధివికాసము, మార్గదర్శిగ పని చేయుచుండెను. ఒక సంకల్పశక్తి ప్రోత్సహించి అంధకారము, జడత్వము, నిశ్చైతన్యముల గుండా అనివార్యమగు సృష్ట్యాత్మక సంచలనములను నడిపించుచున్నది. క్రమముగ ఇంద్రియ ములు, మనస్సు, హృదయము, అంతరాత్మలు రూపుదిద్దుకొనుచుండెను. అది నిర్వ హించి నడిపించుచున్న ప్రాపంచిక వ్యవహారములు అర్థవంతములై ఒక దిశగ నడుచుచుండెను. ప్రాణము యొక్క పరమార్థము పోయిన శాశ్వతత్వమును తిరిగి సంపాదించుటయే.

ప్రాణము పురుషుని (తన పురుషతత్త్వము) ఆహ్లాదము కొరకు ప్రవర్తిం చును: అతనికి ఆనందము కలిగించుటకు, అనేక ప్రయత్నములు చేయును. కాని అతడు తన సహజ స్థితియైన అచంచలత, రూపరహితమైన ప్రశాంతి లోనికి పోవు చుండును. మొదట అతడు అగాధమైన ఆదరాభిమానములలో నిద్రించుచుండెను. నెమ్మదిగ అది అతనిని చైతన్యములోనికి మేల్కొల్పుచుండును. ప్రాణము నిర్మించు ప్రపంచము, అతనిని పట్టి బంధించు వల యగును.

ప్రాణము అజ్ఞానము యొక్క ముసుగులో జ్ఞానము యొక్క సాహాయ్యముతో పనిచేయును. నమ్మరాని అసాధ్యపు పనులను సాధించుటకు కూడ దానికి సామర్థ్యము కలదు. నిమ్న స్తరములలో వాని చర్యల ఉద్దేశ్యము కానరాదు. కాని ఉన్నత శ్రేణులలో వాని క్రియలు మరుగులేనివై కొనసాగును. అయితే దాని రూపములు సంజ్ఞలు మాత్రమే; సత్యమింకను నిర్దిష్టముగ చెప్పబడలేదు. నిర్మింపబడినది దాని నకలు, ఆకారము మాత్రమే.

అశ్వపతి ముందు విచ్చుకున్న ప్రపంచ స్వభావము ఈరీతిగ నుండును. అదొక సత్యముచే వెలిగించబడినను, అభివ్యక్తమైన సత్యము కాదు. అంతకంటె విశాలమైన ప్రదేశము, విస్తృతమైన వాయువు కల స్థానములుండెను. ప్రాణము లోతులలో జీవించును గాని, పైపైన కాదు. మనశ్శరీరములకు ప్రాణము నేత. అవి దాని జాడలో ఈడ్వబడు చున్నవి. వాటి పరిమాణములు విశ్వవ్యాప్తములు. వాటి సత్త విశ్వమునంతయు ఆక్రమించుకొని యుండును. అవి దేనికవి చైతన్యములో ఉన్నతముగ విశాలముగ పెరుగుచుండెను. కాని సాధించిన ఔన్నత్యములో బంధించుకొనునవి చాల కలవు.

ఈ ప్రపంచము మానవ లోకపు పొలిమేరలలో నున్నది. ఇక్కడ క్రింది లోకములలో ప్రారంభమగు గొప్ప ఉద్యమములకు ప్రేరణ కలుగును. వాటి రూపురేఖల నమూనాలు ఇక్కడ నిర్మాణము చేయబడును. ఈ మహాప్రాణ ప్రపంచములో, మంచి చెడ్డ, సత్యము, అసత్యముల మధ్య బాహ్యముగ పోరాటము జరుగుచుండును. మానవుడు వాటిలో ఒక పక్షము నెన్నుకొనుటకు బలవంతపెట్టబడును. ఇక్కడి విలువల సమతౌల్యము (balance of values) భూలోకములోని దానికంటె విభిన్నమై యుండును. అంతరంగ విషయములే బాహ్యవిషయములను నిర్ణయించును. సర్వమును అంతరంగ సత్యము నుండియే బలమును సమీకరించుకొనును. అందుకు ఇంద్రియ వ్యవహారములు (జ్ఞానము) అవరోధములు కావు. మానసిక భావములు ఆవేశములు, మిగిలిన వారి భావావేశములతో పరస్పర సంబంధము కలిగి సమ్మేళనము నొందుచుండును. సజీవమైన ఆదానప్రదానములు జరుగుచుండును. అయినను చివరి ఏకత్వము అక్కడ లేదు. ఏ అంతరాత్మమైనను మిగిలినవారితో సంబంధము

లేకయే తన్ను తాను బంధించుకొనవచ్చును. అక్కడ వాస్తవమైన సామ్యము (identity) లేదు. నిశ్చేతన రహస్యము నతిక్రమించినను, ఉన్నత చేతన రహస్యముపై నల్లాడుచునే యుండెను. ఇది రెండు రహస్యములకును మధ్యస్థమై అనిర్దిష్ట ప్రపంచములో సందిగ్ధ ప్రాణముగ నుండెను.

అశ్వపతి మహాప్రాణము జాడల ననుసరించెను. మొదట ఆయనకు విశాలమైన వస్తుమూలస్థానములు కనిపించెను. అవి అంతకు మించిన మూలాధారములను చూపుచుండెను. కాని, దృశ్యమానమగు లక్ష్యమేదియును గోచరించలేదు. తెలియరాని ఉన్నత సీమల నుండి ఒక బలమైన ఆకర్షణ, వాని వీర్యవంతము విస్తృతమైన పరాప్రాణరూపము లేర్పడుటను, అతడు గమనించెను. కాని, చాల భాగము కప్పబడియే యుండెను. అశ్వపతి తన ముందు విచ్చుకొనిన, చిక్కుపడియున్న నమూనాలను సరిచేయుటకు ప్రయత్నించెను, కాని తానే ఆ సంకేతముల నమూనాల వ్యూహములో అనేక పర్యాయములు చిక్కుకొనెను. సత్యము పేలాది ముఖములతో ఆయన లోనికి తేరిపార చూచెను. వాణులు వినవచ్చెను. భావములు మెరసెను. మహాప్రాణము యొక్క ఆశలను. ఆదేశములను, ఆనందములను ఆయన ఆశ్చర్యముతో వీక్షించెను. అతడు ఉన్నత సీమలలోని నీరవతలో నిలబడి ప్రాణము అనంతములో లయమగుట నవలోకించెను. మహాప్రాణము యొక్క స్వరూప రహస్యమును తెలిసికొనుటకు, దానితో సంపూర్ణ ఐక్యము నొందుటకును యత్నించెను. దాని వైభవము క్రియాకౌశలములచే ఓడింపబడెను. దానిని తన అంతరంగములో కూడ చూచెను. అది సత్యమును గ్రహించుటలో విఫలమగుట అతనికి విస్మయమును, నిరాశను కల్గించెను. దివ్యప్రేమస్వరూపు డయిన భగవంతుడు (పరాత్పరుడు) ఇంకను, చాల దూరములో నుండెను.

ప్రాణశక్తి, నిర్మాణము చేసిన రూపములలో అశ్వపతి పరాత్పరుని సన్నిధిని గమనించెను. ఆ పరాత్పర తత్త్వము నుండియే ప్రాణము తన వీర్యమును పొందుచుండెను. కాని అది సమూనాల స్వరూపములో నిర్దేశింపబడిన పరమార్థమును గ్రహింపజాలకుండెను. ఉన్నతప్రాణ సీమలలో కొన్ని సూచనలను మాత్రమే

తెలిసికొన గలుగుచుండెను. అనంతమువైపు సాగుచున్న దాని ప్రవాహములను స్ఫూర్తి విద్యుత్తు యొక్క తళతళల సాహాయ్యముతో అశ్వపతి కొన్ని సక్రమమైన సూచనలను మాత్రమే గ్రహించగలిగెను.

అంతయు ప్రాణ పరమాత్మ క్రీడగ నుండెను. దాగుడుమూతల ఆట లాభ నష్టముల లీలవలె నుండెను పరమాత్మ ప్రాణమును వశపరచుకొనుటకు ఆశించి దాని అద్భుత విలాసముల సామ్రాజ్యములో చిక్కుకొని నష్టపోవు చుండెను. దాని మార్గమంతయు ఆశ నిరాశలు, సుఖ దుఃఖములతో నిండియుండెను. బాధలు కష్టము లతో నిండియున్నను, జీవితము నందొక ఆనందముండెను. ప్రతి జీవితము వెనుక దివ్యసంకల్పము ఆదుకొని యుండెను. భగవంతుని సృష్టిలో ప్రతి విషయమునకు ఒక ఆశయము కలదు. ప్రాణము, తన ఆధ్యాత్మిక నివాసము నుండి జారి, తనను పరిపాలించు సత్యము నుండి ఎంత త్రోవ తప్పి సంచరించినను, దాని మూలములో నిక్షిప్తమైన ఉద్దేశ్యము దానికి సార్థకత నాపాదించును.

ప్రాణమున కీయబడిన సందేశము బాధ్యత, పరాత్పరతత్త్వము నభివ్యక్తము చేయుట. కాని, దాని కార్యాచరణ లక్ష్యము నందుకొనలేక వెనుకబడు చుండెను. తన ప్రయత్నమును విరమించుటకు దాని కధికారము లేదు. అది ఓర్పుతో శ్రమపడి ముందుకు పోవలసియుండెను. దాని అంతరములో నున్న ప్రాణము అంతరాత్మలు విరామము లేకుండ సాగుచుండెను. ఒక గమ్యస్థానము చేరినంతనే చేరవలసిన మరియొక గమ్యస్థానము గోచరమగు చుండెను. దాని ప్రయత్నమునకు వెనుక, గత వైభవము యొక్క స్మృతియును, భంగపాట్ల వెనుక ఒక శోభాయమానమగు పిలుపును ఉండెను. ప్రాణము తన కలలు వాస్తవములగుటకు కృషి చేయుచుండెను. దాని పిలుపును, భగవంతుడాలకించి తన సత్యసమ్మతములైన అందము, ఆనందము, ప్రేమలను తన సృష్టి కార్యములలో అభివ్యక్తము చేసి తనను తిరిగి తన యథా స్థానమైన అమృతస్థితికి ఎప్పటికైనను తీసికొని పోవునని దానికొక స్థిరమైన నమ్మకము కలదు.

అంతవరకు అది శ్రమపడుచుండవలసినదే. ఆ శ్రమలు ఎంత వ్యర్థములుగ, నిరర్థకములుగ కనిపించినను, ప్రపంచ దేవతలు చేసిన అర్థములేని పొరపాటుగ కనిపించినను, శ్రమ పడుట దానికి తప్పదు.

---

2 వ పుస్తకము (7 వ కాండము)

నిశీధములో ప్రవేశము

ప్రశాంతమైన మనస్సుతో సంగరహితమైన హృదయముతో అశ్వపతి తాననుభవించిన ప్రాపంచిక వైఫల్యమునకు గల కారణమును అన్వేషించుటకై ప్రకృతి బాహ్యవ్యాపారముల లోతులను పరిశీలించుటకు పూనుకొనెను. దాని అథో భాగములోని లోతులలో బాధలకు మూలస్రోతస్సు (ఊట), అజ్ఞానము, పాపముల నల్లని అగాధములను గమనించెను. ఒక అంధకారమయ నిశ్చేతన, ఈ సృష్టిని తేరిపారచూచుట గమనించెను. అది ప్రాణము క్రింది భాగములో దాగియున్న మరణశాసనముల శక్తి. అందుండి ఒక ప్రమాదకరమైన ప్రభావము ప్రాకుకొనుచు సృష్టి మొత్తముపై తనముద్ర వేయుచు, సర్వమును వికృతపరచి, చెడుమార్గమును పట్టించుచుండెను. సత్త మొత్తమునకు ఒక వికారరూపము ఏర్పడెను. ప్రపంచము మొత్తముపై విషాదవాయువులు వీచనారంభించెను. దుష్టజీవులు దిగి వచ్చి వివిధ్యాలి రేకతను, పాపభూయిష్ఠములయిన చట్రములను నిర్మించిరి. ప్రాణము యొక్క స్వరూప స్వభావములు పూర్తిగ మారిపోయెను. సౌందర్య, ప్రేమ, ప్రకాశముల స్థానమున వికృతాకారము, కామవాంఛ, అంధకారములు చోటు చేసికొనెను. అహంకారము పైచేయి కలదై ప్రజ్వరిల్లెను; అసత్యము, సత్యము స్థానము నాక్రమించెను. జ్ఞానమును త్రోసిపుచ్చి అజ్ఞానము పీఠము నలంకరించెను.

విషవాయువులను గ్రక్కుచున్న నల్లనిశక్తి దృశ్యమానమగు రూపములో ఆవిర్భవించుటను అశ్వపతి గమనించెను. అక్కడి వాయువు నొక అపాయ

మావరించెను. కీడును సూచించు ఇంగితములు గుమిగూడు చుండెను. అతనిని వ్యామోహ పెట్టు పాశములు చుట్టి ముట్టడించు చుండెను. ఇవన్నియు అసత్యరూపములచే పెడత్రోవ పట్టింపబడినవే. కాని అశ్వపతి వాటిని తన ఆంతర విచక్షణ దృష్టితో గమనించు చుండెను. ఈ దుర్మార్గమునకు మూలకారణ మరయుటకు అశ్వపతి తీవ్రముగ పరిశీలించు చుండెను. అంధకారబంధురమైన మార్గములోనికి చొచ్చుకొని పోవుచుండెను.

అశ్వపతి ఎవరికిని చెందని (హక్కులేని - No man's land) సీమలో ప్రవేశించెను. అక్కడ వర్తక వ్యాపారము ఎక్కువగ జరుగుచుండెను. నివాసము లేవియును లేకుండెను. అదంతయు వట్టి మోసముగ గోచరించెను. అక్కడ బాధను సంతోషము దాచిపుచ్చెను. ప్రేమ ద్వేషమునకు త్రోవ తీయుచుండెను. సత్యము అసత్యములో మాయ మగుచుండెను. జీవనము మరణమును సూచించుచుండెను. అక్కడ పరిపాలన చేయుచున్న వ్యతిరేక శక్తి, ప్రకాశమానమగు దుస్తులను ధరించి వేదాంత వాక్యములు పలుకుచు అది యొక సత్ప్రవర్తన యను ధైర్యముతో అంతరాత్మను హతమార్చు చుండెను. స్వర్గమార్గము నరకమునకు కొనిపోవు చుండెను. జిత్తులమారితనము, మోసము, అక్కడ సామాన్యవిషయములు. స్వార్థపరతలకు బహుమాన్యత లభించుచుండెను. ఒకదానితో నొకటి అవి పోరాడుకొను చుండెను. ఉన్నతమైన విలువలకై ప్రయత్నించు వారిని అందరు ఏకమై త్రొక్కి పారవేయుదురు. పైన వివరించిన వ్యవస్థ సడలకుండుటకై సత్యము బహిష్కరింపబడెను.

ఆ రంగము మారినది. సనాతన అజ్ఞాన నగరము వచ్చినది. ఆ కేంద్రమునకు పరిధి లేదు. ఆ సీమలో కలహించు వర్గములను పరిపాలించు వారెవరును లేరు. ఆ పురములో వెలుగు లేకుండెను. అహంకారము, అసత్యములే తగవులు తీర్చు చుండెను. వంచనాత్మకమైన నీతి సూత్రములు, క్రూరులైన భటులకు ఔదార్యము కలవిగ గోచరించెను. సామర్థ్యము ప్రయోజనములే, సత్యము ధర్మములుగ చెల్లుబాటగుచుండెను. మతము పీడించెను. ఆధ్యాత్మికత ఆవలకు నెట్టివేయబడెను.

నిజము అబద్ధమువలె నిషేధింపబడెను. అబద్ధము సత్యము యొక్క సింహాసన మధిరోహించెను.

అశ్వపతి ఈ అపాయకరమైన మార్గము గుండా అతిజాగరూకతతో నోట భగవన్నామము నుచ్చరించుచు వెనుకనుండి త్రవ్వబడుచున్న గోతులను (చేయబడు చున్న మోసములను) నిరంతరము తెలిసికొనుచునే సాగుచుండెను. అతనిని ఎవరును ప్రశ్నించుటలేదు. పైనుండి పరాత్పర ధామములు ఆయనను ఆహ్వానించు చుండెను. క్రింది అగాధములు అతనిని కోరుకొనుచుండెను. అతడు నిశీధములోని అగాధముల లోతులను తెలిసికొనుటకు, క్రిందికి పోవుటకే నిశ్చయించుకొనెను.

అంతకు మించిన అంధకార మెదురయ్యెను. అక్కడ వెలుగుగాని, భగవంతుడుగాని, ఎన్నడును అడుగు పెట్టినట్లు లేదు. ఏమైనను అవి అక్కడ శక్తి లేనివై యుండెను.అతని చూపు పోయెను.అయితే అంతరాత్మ శక్తితో త్రోవను తడుముకొనుచుండెను. ఆ రంగములో వికృతాకారము, వైపరీత్యము, కామవాంఛ క్రూరత్వములు ఆధిపత్యము కొరకు ఒకదానితో నొకటి పోరాడుకొనుచుండెను.అసుర శక్తులకు ఆరాధనలు చేయబడుచుండెను. అంతరాత్మ సహింపలేని(జుగుప్సావహము లైన)విషయములతో ఒక నూతన రసజ్ఞత సాధింపబడు చుండెను.సౌందర్యము నిషేధింపబడెను. వాస్తవమైన భావములు, ఆవేశములు చంపివేయబడుచుండెను. దుర్మార్గము అభిమానింపబడుచుండెను. పాశవిక ఉద్రేకములు తాండవించుచుండెను. యమలోకము తన నగ్నవైభవముతో, వికటాట్టహాసము చేయుచుండెను.

ఆ సీమలో మానవుల అంతరాంతరాలలో నక్కియున్న పైశాచిక శక్తిచే వశపరచుకొనబడిన జాతివారు నివసించుచుండిరి. వారు మానవహృదయ శాసనమును అణచిపెట్టి, సంస్కారము గల మనస్సు యొక్క ఆలోచనలను అదిమి పట్టుకొని, జీవించుచుండిరి. వారిని వశపరచుకొనిన శక్తి ఆశ, అతిక్రమించవలెనను అడియాస, పరులను పీడించి సంపాదించవలెనను కోరిక గల ఒక రాక్షసి. ఆ లోకములోని జీవులు మానవాకారము కలిగినను స్వభావములో నికృష్టమైనవారి కంటె అతి నికృష్ట

మైన జీవులు. వారిలో దయాదాక్షిణ్యములు, ప్రేమ ఏ కోశమునను లేవు. వారిలో నున్నదంతయు క్రూరత్వము, భయోత్పాదకమైన హింస, ద్వేషములతో నిండిన స్వభావమే. ఈ చీకటి జీవులు వెలుగును నిరాకరించుచుండిరి. అసత్య ప్రభువులకు తమ విశ్వాసమును కేకలు బొబ్బలు పెట్టి ప్రకటించుచుండిరి.

అశ్వపతి ఈ భయంకరమైన సీమల గుండా, తన మనోవికాసమును భంగపరచుచున్న శక్తులతో పోరాడుచు, పట్టుకొని వ్రేలాడు వాటి ప్రభావములను త్రోసిపుచ్చుచు, ఒంటరిగ ముందుకు సాగుచునే యుండెను. పిమ్మట పై ప్రాణులు నివసించు ప్రదేశములను తొందరగ విడిచి విశాలమైన శూన్య ప్రదేశములు జేరెను. ఆ శూన్యము ప్రాణమును హరించుచుండెను. అక్కడ వెలుగులు సత్యములను వ్యతిరేకించి, నిరాశ, నాశనములను వ్యాపింపచేయు ప్రాణమునకు తీవ్రమైన వ్యతిరేకతను దర్శించి, వాటి దాడిని ప్రతిఘటించుటకు అశ్వపతి ప్రయత్నించెను. ఒంటరిగ నిశీథము నెదిరించుచున్న అతని అంతరాత్మను దిగువ నున్న అచటి అగాధములు బలి కోరుచు పైకి లేచినవి. అతడు అన్నివైపుల నుండి పీల్చి పిప్పిచేయబడుచుండెను. అతని మనస్సు మూగవోయెను. అయినను అతడు వానిని సహించి, భీతావహతను ఉపశమింపజేసి, ఆ క్షోభ ననుభవించెను.

వెంటనే ప్రశాంతత, తిరిగి నెలకొని అంతరాత్మ వీక్షణలు తిరిగి వచ్చెను. అతనిలోని దివ్యత్వము మేల్కొని, ప్రమాదమును ప్రశాంతముగ నెదుర్కొనెను. ప్రకృతి యొక్క బలమైన అలలను తన చూపులతో అదిమి పట్టి వశపరచుకొనెను. పరమ భయంకర, నగ్న యమలోకమును, తన కేవల పరాత్పర తత్త్వముతో నెదుర్కొనెను.

---

2 వ పుస్తకము - (8 వ కాండము)

అసత్య ప్రపంచము - పాపములు తల్లి, చీకటి బిడ్డలు

దాగియున్న నిశీధగర్భమును అశ్వపతి దర్శించెను. అది, పరమాత్మ తత్త్వము లేని ఒక శూన్య అనంతము. అది భగవంతుని త్రోసిపుచ్చి సత్యమును నిరాకరించు ప్రకృతి. అక్కడ వెలుగు లేదు, దివ్యాంశ సంభూతమైన ఆత్మలేదు. కష్టములు పాపములు తను ప్రపంచమును నిర్మించుటలో నిమగ్నమైనవి. దానవులు, దైత్యులు మొదలగువారి కూటమి ఆవిర్భవింప, వాస్తవమైన నరకము నెలకొనెను.

అశ్వపతి దృక్కులు ఈ దట్టమైన చీకటిగుండా ప్రసరింపజేసి అంధకార ప్రేరిత వ్యతిరేకతలతో నిండిన సీమను పరిశీలించెను-అసత్తు అచేతనము. ఇక్కడ బాధల ననుభవించుటయే ప్రకృతి యొక్క నిత్యభోజనము. హింస ఆనందము నిచ్చును. మంచి చెడును సృష్టించును. సర్వభక్షక మృత్యువు నాధారము చేసికొని ఒకానొక అపరిమిత అస్పష్టవిషయము సర్వాధిపత్యము కలిగి యుండెను.

ఒకానొక సమయములో ఆత్మలేని పదార్థము తప్ప మరేమియు, అక్కడ లేకుండెను. తరువాత ప్రాణము ఆ శూన్యముతోనికి ప్రవేశించి పరాత్పరతత్త్వము నకు మార్గ మేర్పరచుటకు ప్రయత్నించెను. కాని చీకటిరాత్రి ప్రతిస్పందన మరియొక విధముగ నుండెను. అసత్తు (నిశ్చేతన), అజ్ఞానము ప్రాణములో ప్రవేశించి విశాలమైన వినాశనకర దేహముతో భూలోకము నావరించినది. అంతట, ఆదిలోని సృష్టివిధానమును ధిక్కరించుచు, భ్రష్ట మొనరించు మృత్యువు, దుఃఖము అసత్యములు ఆవిర్భవించినవి. సత్యప్రకాశము వెనుకకు నెట్టివేయబడి, విరోధ భావముగల ఊర్జితము పరాశక్తి (దివ్యమాత) స్థాన మాక్రమించినది.

ఈ వ్యతిరేక భావము గల శత్రువు మానవాకాంక్షను, సంకల్పశక్తిని వెనుకకు త్రోసిపుచ్చుచు, వాటి పురోగతిని అవరోధించుచు, మానవుని పశుస్వభావము లోనే ఉంచుటకు ప్రయత్నించు చుండెను.

మానవుడు క్రొత్త జన్మ నెత్తకుండ శత్రు శక్తులు ఎంత పర్యవేక్షించి అడ్డు తగులుచున్నను దివ్యాత్మ (దివ్యతత్త్వము) మానవునిలో వృద్ధిపొందుచునే యుండెను. అసురశక్తి మానవుని దృష్టి వెలుగు భగవంతునివైపు ప్రసరించకుండుటకై శక్తికొలది అన్నివిధములయిన వ్యామోహములను, వినోదములను తన నికృష్ట భావన నుద్దేశించి వినియోగించుచుండెను. అది ప్రాణశక్తికి అంటురోగమును సంక్రమింపజేసినది, మనస్సును పెడత్రోవ పట్టించినది. విశ్వాసమును నాశనము చేయు అనుమానమును కల్పించినది. భగవద్విషయములను పూర్తిగ బయటకు గెంటివేసినది. ఈ విధముగ అంతరంగ జీవితమును హతమార్చి భగవదంశను బహిష్కరించినది.

ఈ దుష్టశక్తుల ప్రభావము, సంభావ్యతలు పూర్తిగ వ్యయమై పోవుటకు సృజనాత్మక పరాత్పర తత్త్వము వేచి చూచుచుండెను. అజ్ఞానపు ముసుగులో అసురశక్తులు, శాంతి, సత్యము, వెలుగులకు వ్యతిరేకముగ పని చేయుచుండెను. తమ రూప నిర్మాణములతో భగవదనుగ్రహమును అడ్డుకొని రాకుండ చేయు చుండెను. భగవంతుని క్రియాకలాపములకు ఎక్కడికక్కడ అవరోధములు కలుగజేయుచుండెను. ఈ చీకటి శక్తులే ప్రతిచోట విజయము సాధించుచున్నట్లు గోచరించుచుండెను. అవి ప్రపంచములోని ప్రధాన లాభదాయక స్థావరముల నన్నింటిని ఆక్రమించి మానవుని మనోహృదయములపై పూర్తి ప్రభుత్వము వహించినవి. తమ అభ్యంతర చర్యల ద్వారా విశ్వసృష్టియొక్క పరమార్థమునకు (పరమలక్ష్యమునకు) సహకరించుచుండినవి గనుక వాటి చర్యలు కొనసాగుటకు అనుమతించబడుచుండెను. వాటి నివాసస్థానము నిశీధము (చీకటిరాత్రి) అక్కడ నుండి అవి తమ వ్యూహములను పన్ని ఆచరణలో పెట్టుచు భూలోకముపై తప్పించుకొనుటకు వీలుకాని అధికారము (నిరంకుశాధికారము)ను సాగించుచుండెను.

అశ్వపతి ఈ నరకము యొక్క లోతుపాతులను తెలిసికొనుటకు నిశ్చయించుకొని ఈ ఘోరమైన నిశీధములో ప్రవేశించెను. అక్కడ దుఃఖభూయిష్ఠమైన దైన్యము, పాపభూయిష్ఠమైన బాధలే సహజవాతావరణముగ నెలకొని యుండెను.

ఆనందమనునది తెలియకుండెను. సుఖము నిషేధింపబడెను. హింసాకాండయే పండుగగా నుండెను. ప్రశాంతత చికాకునకు హేతువు ఆయెను. బాధలే జీవిత సహచరులాయెను. నిర్దాక్షిణ్యశక్తులే పూజింపబడుచుండెను. ఆ రాజ్యములో ద్వేషమే ప్రధాన దేవదూత. నిర్జీవములైన వస్తువులు కూడ ఈ పాపపంకములను స్రవింపజేయుచు తమను ఉపయోగించు వారిని బాధించుచుండెను.

ఈ వాతావరణ పరిస్థితులు అశ్వపతి హృదయములో ఒక ఆవేదనను, సంక్షోభమును సృష్టించెను. అక్కడి బాధల మొఱ అతని చెవులలో పడెను.అక్కడి వినాశన విధిమార్గంలో నున్న అపాయకరమైన మోసము, మరణము, దుష్ట సూచనలను, అశ్వపతి పదేపదే పరికించెను. నరకము యొక్క ఘోరమైన దాడుల నెదుర్కొని, వాటి విషసారమును, సమూలముగ త్రాగెను. కాని, పరాత్పర జ్యోతిని సర్వదా తనలో ప్రదీప్తముచేసి నిలబెట్టుకొనెను. అతని ఆలోచనలు, భావములు వ్యర్థమైపోయినను, అతని అంతరాత్మ సర్వమును పరికించి తెలిసి కొనుచునేయుండెను. ఈ విధముగ అణువు, అజ్ఞానముల రహస్యమును తెలిసి కొనుచు ఈ సృష్టి ఆవిర్భావమునకు మూలమైన చీకటి, అగాధముల హృదయాంత రమును చేరెను. ఇక్కడ ప్రకృతి తెరల వెనుక నుండి పని చేయుచున్న విజ్ఞానము, సంకల్పముల సన్నిధిని కనుగొని దానితో తాదాత్మ్యమునందెను. మార్పునకు అవసరమైన కీలకమును ఆతడు గమనించెను. అతని తేజోమయదృష్టిలో పరాత్పరుని ఒక అదృశ్యహస్తము తన స్పర్శతో బాధలను, పొరపాటులను ఆనందమయ మొనర్చుటను పరికించెను. నిశరాత్రి అనంతమునకు ఒక ముసుగు మాత్రమే ననియు, మరణము జీవన ప్రక్రియ యనియు, వినాశము చురుకైన సృష్టికి మార్గమనియు, నరకము స్వర్గలోక ద్వారమున కొక దగ్గర మార్గమనియు అతడు గ్రహించెను.

అధోభాగము నందలి పరాత్పర తత్త్వము యొక్క భ్రమ విప్పారెను. భూలోకములోని సర్వమును దివ్యత్వము యొక్క విశిష్టత నావిష్కరించు చుండెను. భౌతికమూర్తి స్వరూపములో ప్రాణము, తన శుద్ధ సహజచర్యకు కడంగెను.

నరకము నమసిపోయెను. విభజన అంతరించెను. భగవంతుడు ప్రస్ఫుట ప్రతిష్ఠ నందెను. అంతరాత్మ ఎరుక గల శరీరమును ప్రకాశముతో వెలిగించెను. పదార్థము పరమాత్మ-ఇరువురు ఏకమయిరి.

2 వ పుస్తకము - (9 వ కాండము)

ప్రాణదేవతల స్వర్గము

అశ్వపతి చుట్టును పరమానందము పరివేష్టించి యుండెను. దుఃఖభయముల జాడ లేని, స్వేచ్ఛ, విశాలతలు గల ఒక శాశ్వతమైన సంతోషము నెలకొని యుండెను. సౌందర్య సంతోషములు ప్రశాంత ప్రకాశములు గల సీమలను అతడు సమగ్రముగ పరిశీలించెను. ప్రేమ వైభవములను తెలియజేయు దివ్యసంగీతమును అతడాలకించెను. కాంతుల విరజిమ్ము ఈ సీమలోని ఉన్నత శిఖరములు ప్రాణము యొక్క ఔన్నత్యము కావలనున్న ప్రదేశముల వైపు పోవుచుండెను. ప్రాణసీమ దేవతల మనోహరమైన నందనవనములలో సామరస్యము, సౌందర్యము సంపూర్ణ తలు పరిపాలించు చుండెను. అక్కడ ప్రశాంతత, ప్రేమ, వీర్యములు తమ పరాకాష్ఠ నందుచుండెను. బాధ దివ్య స్పర్శరసాయనము ద్వారా ఆనందభరిత మగుచుండెను. స్వర్గ నరకముల మధ్య అగాధము తొలగింపబడెను.

ప్రాణముయొక్క ఉన్నత భావములు అక్కడ రూపు దాల్చినవి— ఆమె ఆశలు, యోచనలు, సంకల్పములు. ఇక్కడ ప్రాణప్రసారము నిర్మలము, నిశ్చయ ముగ నుండెను. దివ్యత్వము నందించు సంగీతము గంభీరమైన క్రియాశీల యోచనలు, అశ్వపతివైపు ఎగురుచు వచ్చెను. ఇంద్రియముల కొక నూతన వైశాల్యము సంక్ర మించెను. ఆతని దేహము కాంతి, శక్తులతో ప్రకాశించుచుండెను. పరాత్పరుని ఆదేశానుసారము ఐక్యము నొందుటకు అతని శరీరము వెనుకాడ కుండెను. భూలోకము పునఃజనించి స్వర్గలోకమునకు సహవాసిగ నిలచెను.

అశ్వపతి దేవతల స్థితికి పెరిగెను. దివ్యానందము అతనిలోనికి ప్రవహించి తెలియరాని ఒకానొక పారవశ్యతలోనికి అతనిని ఉద్ధరించెను. ఆవేదన పడుచున్న అతని హృదయమును పరాత్పరుడు స్పృశించెను. ప్రేమస్వరూపములో శాశ్వతము సన్నిహితమై కాలస్వరూపమును వశపరచుకొనెను.

బ్రహ్మాండమైన ఆనందబిందువు ఆయనను ఆవరించెను. ఒక తీవ్రమైన ఆనందాబ్ధి చుట్టుముట్టెను. దాని అతిమధురమైన తరంగములలో అతడు మునిగిపోయెను. ఈ కేవల ఆనంద పరవశతను అతడు తన శరీరములో దాని కెట్టి భంగము లేకుండ ధరించ గలిగెను. ఈ ఆనంద పరవశత అతనిని పరిశుద్ధుని గావించి అతని మర్త్యబలమును అమృత శక్తిగ మార్చెను.

అమృతత్వము కాలమును బంధించి ప్రాణమును వశపరచుకొనెను.

2 వ పుస్తకము (10వ కాండము)

అల్ప మనఃసీమలు - దేవతామూర్తులు

స్వర్గమువంటి ప్రాణసీమలకు పైన నిశ్చలము, అచంచలమైన మనోలోకము లున్నవి.

మొదట అశ్వపతి ప్రాణ ప్రవాహములను, ఆలోచనలు సమతౌల్యములో నిలుచు స్థితిని వేరుచేయునట్టి ఒక విశాలమైన మైదానమును చూచెను. అది జ్ఞాన, అజ్ఞానములు కలియు ప్రదేశము. దాని చివరి అడుగుభాగము మసకగ నుండెను. అక్కడ అల్ప మనస్సు (చిన్న పరిమితి గలది) సర్వదా బయటికి ఉన్ముక్తమై యుండెను. అది పదార్థమయ మనస్సు భౌతిక మనస్సు. ఈ మనస్సు సర్వమును పదార్థ విషయములుగ గ్రహించి జ్ఞానము నన్వేషించుచు ఒక క్షణమునుండి మరియొక క్షణమునకు సాగుచుండెను.

ఈ నీచము పైన మొదటి సూర్యుని మండలములో అశ్వపతి ప్రవేశించెను. సవితృకిరణముల నుండియే మనస్సు నిర్మాణము చేయబడెను. ఇక్కడ ఉపరితలము సంవలి అతిమానసము, అధోభాగములోని జడపదార్థమునకును మధ్య ఒక బుద్ధి పనిచేయుచుండెను. అది స్థూలపదార్థమును పైనుండి ప్రసరించు చైతన్యమును కలుపు శృంఖలగా పనిచేయుచుండెను.

అది పదార్థమును ఆలోచనాపరము చేయుచుండెను. దాని లోకమంతయు అజ్ఞానమయమే. జ్ఞానము ఇంకను దాని చేతిలోనికి చిక్కలేదు. ఈ హేతుబద్ధమైన బుద్ధి, తర్కమును తన ఉపకరణముగ ధరించి, సత్యమును ముక్కలు ముక్కలుగ ఛేదించి, వాటిని నమర్చి ఒక కృత్రిమ ప్రపంచమును నిర్మాణము చేయుచుండెను. అయినను, ఊర్ధ్వలోకములనుండి అంతఃస్ఫూర్తి ప్రేరణలు రహస్య సంచలనముల రూపముతో ఒక ప్రకాశము భూలోకముపై వాడిచేసి, ఛేదించుచు ఒక సజీవమైన జ్ఞానము రూపుదిద్దికొనుచు భూలోకమును ముందుకు నడిపించుచుండెను. ఇచటనే మనస్సు జ్ఞానము నన్వేషించుచు క్రొత్త విషయముల కెదురు చూచుచు ముందడుగు వేయుటకు ప్రథమముగ మొదలిడెను. అంతరంగములోని జ్ఞానమును పెల్లుబ్బు విధానమును అజ్ఞానమునకు నేర్పుటయే దాని ప్రథమ కర్తవ్యము. కాని, అంతకు ముందు దానికి గోచరమగు అనేక తాత్కాలిక సత్యముల కావలనున్న సత్యమును గుర్తించుట నేర్చుకొనవలెను. జ్ఞానమయకాంతులు పెరుగుటకు వాస్తవమునకు మనస్సే అతి జాగరూకతతో పనిచేసినది. నిశ్చేతనామయ నిశలో తేజోమయ సర్వజ్ఞత వైపునకు మార్గములను నిర్మాణము చేసినది మనస్సే.

మానసిక శక్తిలో మూడు శ్రేణులు కలవు. భౌతిక మనస్సు, వాంఛామయ (ప్రాణిక) మనస్సు, హేతుమయ మనస్సు. భౌతికమనస్సు యాంత్రికము, అలవాట్లచే నేర్పడిన పల్లపు మార్గములగుండా పోవుచు, మార్పులేనిదై, స్తబ్ధముగ చేసినపనే తిరిగి తిరిగి చేయుచు, భౌతికరూపములకు ఇంద్రియములకు కట్టుబడి ప్రవర్తించు చుండును. సృష్టిలో దీనికిగూడ ఒక పాత్ర కలదు. ఒకేరకముగ నమూనాలో వస్తువులను సిద్ధపరచుట. అన్ని సంచలనములును, నవ్యప్రవంతులును దీనికి తగిలి దీని శక్తిప్రభావముచే అది యేర్పాటు చేసికొనిన నమూనాలో ప్రతిష్ఠించును.

పిమ్మట వచ్చునది ప్రాణిక మనస్సు (కోరిక మనస్సు-Vital mind) ఇది సర్వదా సంచరించుచు తన ఆకలికి ఆహారముగ ప్రతివానిని గ్రహించు చుండును. సాహసము. ఉద్రేకము, ఊహాశక్తులు కలిగి ఎంత తినినను, ఆకలి తీరక. సంతృప్తి లేక యుండును. ఇది శక్తివంతముగ, వేగముగ పోయి ప్రశాంతమైన బుద్ధి దొరకని వాటిని తరచుగా గ్రహించు చుండును. దీని చర్యలలో సహజబుద్ధి స్ఫూర్తులు గట్టి పని చేయును

ఈ మానసిక శక్తులలో చిట్టచివరిది గొప్పగ పనిచేయునది, హేతుమనస్సు, ఇది విశ్వమును పరిశీలించి తెలిసికొనవలసిన ఒక విషయముగ గ్రహించి, ముక్కలు ముక్కలు చేసి విశ్లేషించి తర్కసాహాయ్యముతో ఒక క్రమమును, వ్యవస్థను ప్రతి విషయముపై స్థాపించుటకు ప్రయత్నించును. ఇది ప్రకృతి ప్రక్రియలను కనుగొని అజ్ఞానమును తొలగించి సర్వమును ఆలోచనాశక్తితో సామరస్య పరచుటకు ప్రయత్నించును.

బాహ్యముగ కానరాని దానిలో చాలా భాగము హేతుదృష్టికి దొరకక తప్పించు కొని పోవును. అది చూచినదాని నంతయు భావరూపములో నుంచి, విషయ వివరణ చేయు ప్రయత్నములో ఆలోచనాపరమగు గూడులను చూచినదాని చుట్టును అల్లును. ఇంద్రియములు విసరునట్టి వలలనుండి బయట పడినను, పరిమిత మనస్సు నిర్మించు గోడలను అది బద్దలు కొట్టజాలదు. అది నిర్మాణముచేసిన జ్ఞానము అనుమాన మను నీడచే బాధితమై యుండును. ఒకానొక సమయమున సందేహముచే ప్రశ్నింపబడి కూలిపోవును. దాని జ్ఞానాన్వేషణకు అంత మనునది లేదు. కాని ఏకకాలములో సత్యస్వరూపము నంతను పట్టుకొని గ్రహింపజాలదు. దాని శ్రమలు ఒక పర్యవ సానమునకు చేరుకొనవు. ఏ విషయమునైనను జాగ్రత్తగ సమర్థించ గలదు. తత్తుల్యమైన శ్రద్ధతో దానిని నిర్మూలమును చేయగలదు. దాని ప్రథమ దృష్టిలో ఈ భౌతిక ప్రపంచ మంతయు ఒక అజ్ఞానమయ, యాంత్రిక స్వయంకృషితో పని చేయుచున్న యంత్రము. ప్రాణము, చైతన్యము వాటి స్వరూపములో ఆ యాంత్రిక కర్మనుండి ఉద్భవించినవిగను పరమాత్మ తత్త్వము అంతర రహస్య స్వభావములు

మొదలైన వన్నియు ఊహాజన్యములుగను పదార్థమొక్కచే పరిపూర్ణమైన యథార్థము గను భావించును.

కాని, ఈ భావన, అదృశ్య స్పర్శ ఫలితముగ విచ్ఛిన్నమై పోవును. దానికి తెలియని అందరాని సీమలనుండి వచ్చు మెరుపులచే చకితమై ఈ మనస్సు ఇతర వాస్తవికతల తళుకులను గమనించుటకై తన కండ్లను తెరచుకొనును. దాని కాలిక్రింద నేల కరగిపోవును. (దాని స్థిరభావములు కరగిపోవును) సర్వమును ఒక శక్తిసంచల నముగ, పోరాటముగ, పెనుగులాటగ, కాళికాదేవి నృత్యముగ గోచరించును. శక్తియే తుది నిర్ణయమా యని హేతువు, ఆశ్చర్యపోవుచు భక్తుని పట్టుకొనుటకు ప్రయత్నించి జీవితము నంతను క్రమబద్ధము చేయుటకు ప్రతి వస్తువునకు ఒక స్థిరమైన పరి పూర్ణత్వము నాపాదించును. కాని, హేతువుయొక్క విస్తృతమైన యీ నిర్మాణ మంతయు, అంతరంగమునుండి ఉబుకు క్రొత్త జ్ఞానతరంగములచే తారుమారు చేయబడి, భూలోక స్వర్గలోకములను కలుపునట్టియు, ప్రాణ పరమాత్మలను జోడించునట్టియు, అంతము అనంతములను సంయోజితము చేయునట్టియు నూతన పరిస్థితులు ఆవిష్కృతములై యేర్పడును.

ఈవిధముగ మేల్కాంచిన హేతువు బాహ్యవస్తు స్వరూపముల వెనుక తన తర్క భావనతో దర్శించగలదాని కావల, ఒక ఉన్నతమైన వాస్తవికతను గమ నించును. తానూహించగలిగిన దంతయు అర్ధజ్ఞానమేనని గ్రహించును.

హేతువు సృష్టికర్త కాదు. సత్యమునంతను ఏకకాలములో దర్శించను లేదు. హేతువు చేయగలిగినది సత్యముయొక్క బాహ్యస్వరూప నిర్ణయము. అది ధరించు దుస్తులను మాత్రమే గాని, దాని యథార్థ స్వరూపమును తెలుపజాలదు. అది అవిభాజ్యమును విభజించును. దాని జ్ఞానము, గింజలపైనుండు టెంకను, పొట్టును సంబంధించినది మాత్రమే. అసలు గింజలు అంతరంగములో నిరీక్షించుచు నిలిచి యుండును. విశాలమైన విజ్ఞానముయొక్క అగ్రగాములు, దూతలగు అంతః స్ఫురణలు, ప్రేరణలు పరిపూర్ణ జ్ఞానముయొక్క ప్రతినిధులుగ మహోన్నత సత్యముయొక్క ప్రకటనములుగ తరచు వచ్చుచుండును.

మనస్సుయొక్క ఈ మూడు శ్రేణులకు పైన మరి రెండు మానసిక శక్తులు కలవు. ఒకటి ప్రాణముయొక్క యోచనా మనస్సు. ఇది వెనుకటి మూడు శక్తులు నిర్మించిన గోడలను బ్రద్దలుకొట్టి శ్రమపడు మనస్సుయొక్క సామాన్య సీమల కావలనున్న విశాలదేశములోని కెగురును. రెండవది పరిశుద్ధమైన యోచనామనస్సు: ఇది అతీంద్రియ స్థితిలో ప్రకాశమాన మగును. అభేద్యమైన విశ్వసృష్టికార్యమును పరిశీలించు చుండును.

2 వ పుస్తకము (11 వ కాండము)

ఉన్నత మనస్సీమలు - అచటి దేవతామూర్తులు

అశ్వపతి మానవ మనఃపరిధులను దాటి, విశాలమైన పరాత్పర యోచనా సీమలలో ప్రవేశించెను. శాశ్వతమైన పరాత్పర తత్త్వమున కెదురుగ గోచరమగు దృశ్యములకు సంబంధించినవే యీ ఉన్నతాలోచనలు. వీటి శిఖరాగ్రములపై ఆదర్శ మనస్సుయొక్క వైభవము ప్రకాశించు చుండును.

భూలోకములోని సర్వ ఉద్యమములకును, గొప్ప అపేక్షలకును, ప్రేరణ నిచ్చు మూలస్థానము ఆదర్శమనస్సు. ఇదియే మానవులకు దేవతలకు మధ్యగల వారధి (వంతెన). పరాత్పర సత్యములు దేవతామూర్తులుగ రూపుదిద్దుకొని నివసించు లోక మిదియే. నిమ్నలోకములోని సృష్టికి కారణభూతులైన సత్యభావనలు ఇచటనే కలవు. వాటి ప్రభావ ప్రకాశములు మానవలోకమును స్పృశించి వాని శ్రమను ఇతోధికముగ ప్రోత్సహించును. వృద్ధి పొందుట పరిపూర్ణతను సిద్ధింపజేసికొనుటల యందు మానవునకు విశ్వాసబలము నందించు మూలస్థాన మిదియే.

ఈ సీమలకు మానవుడు అపరిచితుడు కాడు. తన ఉన్నతస్థితిలో వీటికి చెందినవాడే మానవుడు. అతడు అజ్ఞానస్థితిలో అక్కడనుండి తరిమివేయ బడెను (బహిష్కరింప బడెను). కాని ఆతని ఆలోచనలు ఆ దేశస్మృతిని కలిగియే యుండును. కొన్ని అసాధారణ సంసర్గలలో ఆ దేశపు కాంతి శక్తులు, ఆతనిని

ఉత్తేజపరచు చుండెను. మానవ స్వభావ సంకల్పములేని ఉన్నత సీమలలోని ఘనత ప్రసరించుటలో అడ్డు తగులుచుండును. ఈ ప్రకాశమానమగు లోకములలోనికి, మానవుని అంతరాత్మ ఆరోహించగలదు.

అశ్వపతి, ఈ దేశములలో ప్రవేశించి పరిశుద్ధ ఆలోచనాప్రపంచములను దర్శించును. అక్కడి తత్వము ఆలోచన, నాయకుడు జ్ఞానము, సత్యము పిలుపునకు భావము, వెంటనే ప్రతిస్పందించును. క్రియాత్మక కిరణములో రూపము దానంతట నదే తన స్వరూపమును నిర్మాణము చేసికొనును. సంకల్పము దేవతల ఎరుకగల వాహకముగ పనిచేయును. ఇక్కడ జీవితము చైతన్యముతో నిండి తొణికిసలాడు చుండును. ఆనందోత్సాహములు అక్కడ సహజములై విరాజిల్లు చుండెను.

ఇంకను ఉన్నతమైన భూమికలలోనికి పోయి, కాలము అనంతమును స్పృశించు నట్టియు. ప్రకృతి పరాత్పర సంపర్కము కలిగియుండు నట్టియు నూతన ఉన్నత భూమికలను అశ్వపతి దర్శించెను.

ఈ ఆరోహణ యోచనాసీమయొక్క మూడు స్తరములగుండా సాగును. మొదటి శ్రేణులు మానవ మనస్సును పోలి, దానికి సన్నిహితములై యున్నవి. అవి మానవ శ్రమకు అత్యున్నతములు గాని, అతి విశాలములు గాని కాక సమ తౌల్యములో నుండెను. ఈ లోకముయొక్క రక్షకులు సృష్టిపరమైన ఉన్నత శక్తులతో సంబంధము కలిపి బృహదాలోచనాసంఘములకు జీవము పోయును. ఇవియే మానవ మనస్సునకు, దేవతల మనస్సునకు మధ్య సంధాతలుగ పనిచేయును. అవి విశ్వకాలములకు ప్రభువులై విశ్వానందము ననుభవించును. అంతర్లీనమై యున్న మానసికములగు ఒత్తిడులతో పదార్థమును రూపొందించును. అవి విశ్వాకాశమునకు కొలమానములు. అవి నిరాకారమును సాకారముగను, అనంతమును అంతవంతముగను తీర్చి దిద్దును. కాని, అవి ప్రతి కదలికపైనను ఒక శాసనమును మోపి అవసరము అను గొలుసులో ప్రతి అడుగును ఒక శృంఖలగ మార్చును. భావముయొక్క అనంత మృదుత్వమును నిర్మింపబడిన నమూనాలో స్థిరపడునట్లు చేయును. అవి నెలకొల్పు జ్ఞానము పరిమితమై నశించునదిగ నుండును. అవి అగ్నిని అరికట్టును. తనంతట తాను సంచరించగల ఏకత్వమును, నిర్మింపబడిన దేశకాల శాసనములలో బంధించును.

ఈ సీమకు పైన మరియొక భూమిక కలదు. ఇక్కడి జీవులు విశాలమైన దృష్టికలిగి అంతరంగమునందలి విమోచనపరమైన జ్ఞానప్రభలో ప్రకాశించుచుందురు. వీరి ప్రధానబలము దృష్టి- దర్శించుట, భావించుట కాదు. వీరు సృష్ట్యాత్మక రహస్య విద్యాపరమైన మనస్సును పరిశోధించి తమ పరిశోధనా ఫలితములను సాంకేతిక రూపములలో సంఖ్యలు, గీతలతో తయారు చేయబడిన నమూనాలలో విశ్వాసన ములలో వ్యవస్థీకరించు చుందురు. వారు అనంత చైతన్యముయొక్క స్వేచ్ఛామయ లయలను పరిమిత యోచనల తర్కబంధములో నిర్మాణము చేయుటకు ప్రయత్నించు చుందురు. ఈ కార్యక్రమ సందర్భముగ అపరిమితమైన దానిని పరిమిత రూపములో ప్రమాణీకరించుటకు విధి యను గణితమును సృష్టింతురు. ఈవిధముగ చిన్న ప్రత్యేక విషయములలో నిమగ్నులై, మొత్తమును కోల్పోవుదురు (విస్మరింతురు, దూరమై పోవుదురు). తెలియరాని తత్త్వము తన రహస్యమును వారి కందకుండ నిలబెట్టుకొనును.

దీనికి పైన (ఈ భూమికకు పైన) ఆలోచనాప్రభువు లుండిరి. వారి సర్వతో ముఖ దృష్టి దేశకాలములను ఆకళించుకొనును. వారు సృష్టికర్త యగు విశ్వాత్మ యొక్క ఆజ్ఞలను తమలో ధరించి పట్టుకొని వాటిని భూస్వర్గలోకములకు ప్రసరింప జేయుదురు. వారి చైతన్యము సర్వతోముఖ ప్రభుత కలది.

వాస్తవముగ, విశ్వము కాలములో సంభవించిన ప్రమాదము కాదు. ఇది సత్య జ్ఞానముయొక్క మార్గదర్శకత్వములో నడిపింపబడుచున్నది. శాశ్వత సత్తలోని బీజమునుండి ఈ సృష్టియంతయు ఉద్భవించి అభివృద్ధులను రూపములలో అప్రమేయ మైన పరాత్పరుని సృష్ట్యాత్మక దృష్టిలో తయారగుచున్నది. వస్తు సముదాయములో దాగియున్న దివ్యాంశను ఆవిర్భవింపుటకు ఒత్తిడి చేయుచున్న ఒకానొక రహస్య శక్తి వాటిలో కలదు, ప్రకృతియొక్క అజ్ఞానముకూడ సత్యముయొక్క ఉపకర ణమే (పనిముట్టే). పరాత్పరుని సంకల్పము విధిరూపములో పనిచేయుచున్నది. మృత్యుబాధిత జీవుడు అమృతుడుగ వృద్ధిపొందుచున్నాడు. పరమాత్మ సత్యము, దాగి యుండి అహంకారము లేని అంతర్దృష్టికి తనను తానావిష్కరించుకొనును.

ఈ వాస్తవికత మానవసమాలోచన కందదు. స్వేచ్ఛామయ విజ్ఞానము పని చేయు చోట జీవన సత్యము యాదృచ్ఛిక శాసనముల మధ్య తారాడుచుండ, మానవ బుద్ధి అందొక ధర్మమును, సూత్రమును కనుగొనుట కన్వేషించును.

సమాలోచనా చక్రవర్తులు (Kings of thoughts) పరమనిరపేక్ష సత్యమును ఆలోచనలతో గ్రహించుటకు ప్రయత్నించిరి. భావాత్మక మనస్సుతో యదార్థ తత్త్వమును ప్రత్యేకమైన భావవాచకములలో పట్టి బంధించుటకు యత్నించిరి. ఏకత్వమును గ్రహించుటకు, భావములను రూపములను శబ్దములను బహిష్కరించి ఒక శూన్యమును సృష్టించిరి. వారు ఒకానొక గంభీరమైన అసత్తు సర్వమునకు మూలతత్త్వముగ ఏమియులేని పూజ్యమే (zero) తుది రూపముగ భావించి అక్కడకు జేరిరి.

యోచనాపరుల ఆనందము కొరకు (ఆలోచనాపరమైన) మేధకు సంబంధించిన దేవతల, సత్యమును, భావము, భాష (శబ్దము) అను వలయ పరిధిలోనికి లాగుటకు శ్రమపడు చుండిరి. మానవ మనస్సు అను బందిఖానా లోనికి సత్యమును లాగుకొని వచ్చి ఈ విశ్వమును వశపరచుకొను యత్నములో మానవుడు దానినొక పనిముట్టుగ వినియోగించుటకు ప్రయత్నించు చున్నాడు.

క్రిందిలోకములోని అన్వేషణలకు ఆకాంక్షలకు ప్రతిస్పందించుచు సత్య-దేవి భూలోకములో నివసించుటకు అంగీకరించి తన సన్నిధిని మానవ హృదయములో ప్రతిష్ఠించుట కనుమతించినది. మానవులు తమ తమ మనఃప్రవృత్తులను బట్టి ఆత్మ స్వభావమును బట్టి ఆమె కొక స్వరూపము నాపాదించి ఆ భావములో ఆమె నలంకరించిరి.

శాశ్వతమైన సత్యము, మానవ బుద్ధిచే గ్రహింపబడునది. వాక్కున కందునది కాదను విషయము నిర్వివాదము. విశ్వమంతయు ఈ సత్య సవితృ కిరణములో జీవించు చున్నది. అది (ఆ సత్యము) మానవుని మేధా నిర్మిత కుడ్యముల మధ్య బంధింప బడదు. ఎంతటి మహోన్నతమైన సమాలోచన యైనను సత్యమును వశ

పరచుకొనుటకు గాని ప్రకటించుటకు గాని యోగ్యము కాదు. ఆలోచన ఆత్మాప లోకమునకు (అంతరంగ దృష్టికి) లొంగి పరమ సత్యమునకు సమర్పితము కావలెను. అప్పుడే, సజీవ నిశ్చల నీరవతతో నిండిన ప్రశాంత మనస్సులో అవ్యక్త తత్త్వము తనను తాను ప్రకటించు కొనును.

---

2 వ పుస్తకము (12వ కాండము)

ఆదర్శ స్వర్గములు

మేల్కాంచిన మేధ, తెలిసిన దేశపు పొలిమేరలను దాటి తెలియని శిఖరముల నారోహించుట కారంభించెను. సాక్షాత్కృతము కానీ సత్యము, జననమరణముల కావల, ఉన్నత శ్రేణులలో నున్న తేజస్సునకై ఆకాంక్షించుచుండెను. ఆరోహణలోని ప్రతి దశ ఆనందాశ్చర్యములతో నిండిన ఒక నూతన ప్రపంచము నావిష్కరించు చుండెను.

ప్రకాశమాన మయిన ఈ మెట్ల వరుస రెండు చివరలలోను అశ్వపతి, ఆదర్శ మనస్సుయొక్క స్వర్గలోకములను దర్శించెను. ఒకవైపున అమృతానంద ముతో నిండిన ప్రపంచములును, వాపులేని అందములను విరజిమ్ము గులాబివంటి రాజ్యము లుండెను. ఈ ఆనందము ఊర్ధ్వమున గల అతిమానస లోకములు, అడుగున ఉన్న నిశ్చేతన సీమల మధ్య నిండియుండెను. దుఃఖమయ ప్రపంచముచే తెలియ బడకుండ తన ఉనికి జాడ బయట పడకుండ ఈ ఆనందము సర్వ ప్రాణ సీమకు వెనుక కూడ నిలిచి యుండెను. ఇదియే ఆనంద పాటలము (Rose of Bliss), భూలోకములోని ప్రాణమయ వనములలో భగవదారాధనకై నెమ్మదిగ వికసించు చున్న గులాబి పుష్పము ఈ ఆరాధనకు ప్రత్యుత్తరముగ భగవదనుగ్రహము, విశ్వ లక్ష్యమును సిద్ధింపజేయుటకై ప్రాణము పరాత్పరుని ఆవిష్కరించుటకు సహకరించు చున్నది.

మధురానందములతో తొణికిసలాడుతున్న ఉన్నత లోకములలోని దంతయు, మృత్యుమయమైన మానవ జీవితములో ప్రారంభదశలోనే యున్నది. భూలోకము లోనికి అప్పుడప్పుడు వచ్చు దివ్య స్పర్శప్రభావముచే అది (మర్త్యజీవితము) మేల్కాంచి వృద్ధి పొందును.

ఈ ఆరోహణ మను మెట్లకు అవలి ప్రక్కన, మరణ మెరుగని తేజో రాజ్యములును, జ్ఞానముతో ప్రకాశమానమగు గొప్ప లోకము లుండును. సత్త యొక్క నిరపేక్ష సీమలను చేరుటకు మనస్సు అను బలిపీఠముపై ఆర్ప శక్యముగాని, జ్ఞాన జ్వాలలు, ప్రజ్వరిల్లును. ఆ జ్వాలలు ఆరోహించు లోకములు శక్తిలో, ప్రకాశ ములో పరిమాణములలో చాల గొప్పవి. అవి మానవుని అంతరాత్మను నిర్విరామ ముగ, తమ ఔన్నత్యమువైపు ఆకర్షించును. అందలి శిఖరములు అనంత సత్యము యొక్క దూరస్థ వైభవమును చూపును.

మానవుడు, శాశ్వతుడగు పరాత్పరుని సాహాయ్యములేనిదే ఈ ఉన్నత శిఖరము లను ఆరోహించలేడు. మహోన్నతమైన ఈ సాహసకార్యమునకు మానవజ్ఞానము, బలము, సామర్థ్యములు అతి స్వల్పములు.

అశ్వపతి ఈ ఆదర్శలోకముల గుండా పోవుచు, వాటి వైభవమును అనుభ వించుచు, అక్కడ నిలచిపోయి, వాటి ప్రభుత్వములో నుండిపోవుట కంగీకరించలేదు.

అశ్వపతి అక్కడి ప్రతి భావమును (శక్తియును) ఎంత ఘనము, ప్రకాశ మానమునైనను అదొక ఖండ సత్యమేయని గ్రహించెను. కాని వానిలో ఏశక్తి కాశక్తి (ఏ భావము కాభావము) తానే సంపూర్ణ సత్యముగ పరిపాలించుటకు ప్రయ త్నించును. అట్టి నిరపేక్ష అసంఖ్యాక భావములు తామే పరాత్పర తత్త్వముగ ప్రకటించు కొనును. అవన్నియు కలసి సమ్మిళితమగు సీమ ఒకటి యుండవలెను. అక్కడ అవి తమ ప్రత్యేక వ్యక్తిత్వమును నిలుపుకొనుచు కలిసి సమ్మిళితమగును.

అశ్వపతి అంతకు మించిన దివ్యలోకములలోనికి సాగిపోయెను. అక్కడ ఈ ఘనమైన శక్తులన్నియును తమ తమ వ్యత్యాసములను విస్మరించి, ఒకానొక బహుముఖ ఏకత్వములో సమ్మిళితమగును. ఆ మహోన్నత పరాత్పర తత్త్వములో, నిర్వికారమైన సత్యస్వరూపములో అవన్నియు ఒకటై పోవును.

2వ పుస్తకము - (12వ కాండము)

మానసికాత్మ (మనోమయ పురుషుడు)

అశ్వపతి హఠాత్తుగ ఒక నిశ్చల నీరవ స్థితికి చేరెను. అక్కడ ఉన్నత లోకములలోనికి ఆరోహింపజేయు మెట్ల వరుస ఆగిపోయెను. ఆతడు ప్రచండమైన మానసికాత్మ చైతన్యములో ఒంటరిగ నిలబడెను. అది సర్వశక్తిమంతమై తననుండి ఆవిర్భవించిన ప్రపంచముతో సంబంధము లేకుండ విడిగ నుండెను. అది ప్రపంచములోని కదలికలతో ప్రాగ్ఞానక, అన్నిటిని సమతూకములో వహించు చుండెను. అశ్వపతి యీ విశాలమైన ప్రశాంతతను భావించుచు, యోచనలో నిమగ్నమై పోయెను.

ఈ సాక్షిభూతమైన నిశ్శబ్దము యోచనాపరులకు ఆధారమై శబ్దమునకు మూల స్థానమై యుండెను. ఇదే శక్తివంతమైన ఊర్జితమును పశ్యంతీపురుషుడును (seeing self) కలియు స్థానము, సృష్టికి ప్రారంభము. అశ్వపతి ప్రపంచమును ఆ ఉన్నత భూమికనుండి దర్శించి అందలి యోచనలు, శక్తుల అర్థములను గ్రహించుటకు ప్రారంభించెను. ఈ నిశ్శబ్దము ఈ ప్రశాంతతనే చివరి స్థితిగ భావించును.

హఠాత్తుగ ఒక కాంతి కిరణము ఆ ప్రదేశముపై పడి యథార్థముగ తన కేమియు తెలియలేదను భావమును అశ్వపతిలో కలిగించెను. ఏ సత్యము తెలిసిన సర్వము తెలియునో ఆ సత్యమును తాను చేరలేదనియు, చేరవలసి యున్నదనియు ఆయనకు గోచరించెను. అది ఆలోచనకును, భావమునకును పైన నుండెను. మానసిక జ్ఞానమంతయు యథార్థమైనది పటిష్ఠమైనది కాదని ఆయనకు గోచరించెను. జీవితానుభూతులన్నియు నిర్జీవములైన మానసిక రూపములుగ స్థిరపడెను. మానసిక నిర్మాణమంతయు కూలిపోనారంభించెను.

మానవ మనస్సు నిర్జీవమైన భూతకాలపు భూతముచేతను, శిలలుగ మారిన భావముల చేతను ఆవేశింపబడిన గృహముగ నుండెను. అది, అంతరాత్మను, ప్రాణమును దుర్వినియోగము కావించు శక్తిగను, ఉన్నత ప్రదానములను వ్యర్థము చేయునదిగను తయారయ్యెను. అది అజ్ఞానము ప్రదర్శించు హాస్య నాటకమునకు రంగస్థల మాయెను.

హేతువుయొక్క కాంతికిరణము దెబ్బతిని ఆత్మశక్తి యందలి సమ్మోహము కోల్పోయెను. దాని జ్ఞానము ఒక దేదీప్యమానమగు ఊహాగను, దాని శాస్త్రము వస్తు సముదాయముయొక్క బాహ్య విషయములను గురించి వెదకులాడునదిగను తయారాయెను. ఇంతవరకు జరిగిన దంతయు ఒక ఉపాయము, వాస్తవికతయొక్క పటము మాత్రమే. ఈ సృష్టియొక్క అస్తిత్వము, శూన్య ఆకాశములో తేలియాడెడు అల్ప పత్రమువలె గోచరించెను. మనస్సు, అంతరాత్మ తేజస్సుల మధ్య వ్రేలాడు తెరవలె గోచరించెను. సాక్షిభూతమైన ఆత్మకూడ తెలియరాని పరాత్పర తత్త్వము యొక్క పేలవమైన నీడవలె నుండెను. అక్కడ ప్రశాంతి ఉండెను. కాని, సామర్థ్యముగల సృష్ట్యాత్మక శక్తి, అనగా భగవంతుని పరమానందములో తాను సృష్టించిన లోకములను తన హృదయ పరిష్వంగము లోనికి తీసికొనగల బ్రహ్మాండమైన బలముగల దివ్యమాత అక్కడ లేకుండెను.

అశ్వపతి, అన్వేషణపరమైన అంతరాత్మ సంతృప్తి చెందవలెనన్న మానసిక పురుషుని కంటె ఘనమైన తత్త్వము గల మరియొక ఉన్నత పరాత్పర తత్త్వమును అతడు కనుగొనవలెను. అశ్వపతి దృష్టి పైకి పరికించెను. కాని అదంతయు స్తబ్దముగ, శూన్యముగ నుండెను. అతడు క్రిందికి చూచెను. అదంతయు నిశ్శబ్దముగ చీకటిగ నుండెను. ఈ రెంటికిని మధ్య గొప్ప ప్రాణసంచలనము అజ్ఞానసీమలలో గోచరించెను. అతని అంతరాత్మ, చీకటి వెలుగులు, నిశ్చేతనము ఉన్నత చైతన్యము (జ్ఞానము) అను ఈ రెండు ఆకాశముల మధ్య తారాడెను (నడయాడెను).

2 వ పుస్తకము - (14 వ కాండము)

విశ్వాత్మ

భగవంతుని అంతరాంతరములలోనికి తీసికొనిపోవు, మానసిక అంతరాళములో మెరయుచు తెరచుకొని యున్న ఒక ద్వారము సుదూరముగ అశ్వపతికి

కనిపించెను. కదలాడెడు కాంతిపుంజముల ఆనందావేశము అతనిని ఆహ్వానించుచు పిలిచెను. అశ్వపతి ఒక సొరంగ మార్గములో ప్రవేశించెను. అతడొక రహస్య రవముచే నడిపింపబడెను. ఆ ధ్వని అనేకధ్వనుల సమ్మిళిత స్వరూపముగను, వేణు గానపు పిలుపుగను, కీచురాయి స్వరముగను, కాళ్ళ గజ్జెల సవ్వడిగను గుంపులుగ వ్యాపారములకై పోవుబాటసారుల గణగణ ధ్వనులుగను గుడిగంటలుగను, తేనెటీగల ఝుంకారముగను, సముద్ర కెరటముల రవముగను అశ్వపతికి వినిపించెను.

అశరీర సీమలగు దేశకాలముల హృదయములో విశ్వాత్మ నివాసగృహములో అశ్వపతి ప్రవేశించెను. ఇచటనే సర్వసత్త ప్రకృతి స్పందనలను దివ్యస్పందనలుగ రూపాంతరీకరించు పురుష చైతన్యమును, విశ్వమును, దాని సుఖదుఃఖాది అవస్థాంతరముల ద్వారా దివ్య సంసిద్ధికి నడిపించుచున్న పురుషుడును ఉండెను. ఇచటనే అంతవంతమగు ప్రాణముయొక్క పుట్టుక, మూలస్థానము కలదు.

ఇక్కడున్నదంతయు ఆత్మతత్త్వ నిర్మాణమే జ్ఞానము, ఆలోచనల ద్వారా గాక, ఐక్యానుసంధానము ద్వారా పొందబడును. వాక్కు నిర్మించు అడ్డుగోడ లిక్కడ లేవు. ఇక్కడ ప్రత్యేకింపబడిన ప్రాణముగాని రూఢమైన రూపముగల శరీరము గాని ఇక్కడ లేదు. అంతరాత్మ తనదేయగు స్వరూపములో నిగిలిన అంతరాత్మలతో నేరుగ, ప్రత్యక్షముగ కలియును. అశ్వపతి వస్తుసముదాయమును వాటి అంతరాత్మ స్వరూపముల ద్వారానే తెలిసికొనును గాని, వాటి బాహ్యరూపములనుబట్టి కాదు. మాటలతో నిమిత్తము లేకుండ వాటితో పరస్పర సంసర్గమును కలిగియుండెను.

అతిలోక పరిమళములు రంగులతోను, అంతరాత్మ సౌందర్య సంతోషముల తోను ప్రకాశించు నమూనాలతో అక్కడి ఆధ్యాత్మిక వాతావరణ రంగము విచిత్రముగ నుండెను. అది అందాల మందిరము. అక్కడ విశ్వము, ఆత్మ ఒక్కటిగ నుండెను.

ఇక్కడ కూడ మరణానంతరము జీవులు పునర్జన్మ యెత్తుటకు ముందు విశ్రాంతి తీసికొనుచుందురు. వారు తమ జీవితానుభూతులను జీర్ణము చేసికొని ముందు జన్మకు తయారగుచుందురు.

ఇక్కడ నుండియే సృష్టి బీజరూపములో ప్రారంభ మగును.

దీనిపైనున్న లోకములు, శాంత్యానందములతో నిండిన లోకములు. అశ్వపతి అనంత్యము యొక్క ఎరుకను కలిగి ఆది, అంతములు ఏకమైన చోటును చేరెను.

అతడు సర్వసృష్టికి మూలస్థానమును చేరెను. అక్కడ అమృతమయ శివ-శక్తుల ఏకరూపమును దర్శించెను. అద్దాని తాండవ నృత్యములో జంగమ జగత్తంతయు ధరింపబడెను. ఈ ద్విముఖ సన్నిధి వెనుక అశ్వపతి దివ్యమాతను తెర చాటున నున్నట్లు దర్శించెను. ఆమెయే సర్వమునకు రాజ్ఞి (రాజరాజేశ్వరి) సర్వమును తన శక్తితో ఆవరించినది. సర్వమును తన సంకల్ప శక్తితో ప్రభావితము చేయుచున్నది.

అశ్వపతి ఆమె శక్తిచే నింపబడెను. అతడు ప్రార్థనాపరమైన అంజలి ఘటించుచు ఆమెవైపు సాగెను. ఆమె తన ముసుగును సగము తొలగించుకొని ఒక మహోన్నతమైన సూచనతో అతని ప్రార్థనకు సమాధానముగ ప్రతిస్పందించెను. ఆమె నేత్రములలోని దేదీప్యమానమగు కాంతులకు ఆయన ముగ్ధుడై పరవశించి ఆమె ముఖమర్మమును దర్శించెను. ఆమె తేజస్సు ఆనందములచే పరవశుడాయెను. అతడు ప్రేమమయ ఆరాధనాపరమైన ప్రార్థనతో స్పృహతప్పి ఆమె పాదములపై వ్రాలెను.

2 వ పుస్తకము (15 వ కాండము)

మహా విజ్ఞాన సామ్రాజ్యములు

అశ్వపతి అంతరాత్మ సాక్షాత్కారస్థితి నుండి తిరిగి పైకి వచ్చెను. నిశ్చల నీరవ సీమలో ఒంటరిగ స్థాణువువలె నిలచెను. ప్రకృతి ప్రభావమును, మానసిక వలయమును అతిక్రమించి పైకి పోయెను. అది ఆలోచనల కావల అనిర్దిష్ట దివ్యతత్త్వము యొక్క భూమిక. ఇక్కడొక శబ్దము కలదు. దానిని మానవశ్రవణేంద్రియము వినలేదు. ఇక్కడ ఐక్యానుసంధానము సాధించు జ్ఞానము, సమీకరించి కలుపు (ఐక్యముచేయు) ప్రేమ కలవు. సృష్టికి పూర్వము రాశీభూతమై యున్న మూలశక్తి ఇక్కడ కలదు. ఇదియే, విషయములకు ఆధ్యాత్మిక జన్మస్థానము.

అశ్వపతి, పరమాత్మ సామ్రాజ్యముల వైభవమును చూచెను. ఏకత్వము యొక్క అనేకత్వ మహిమను గమనించెను. ఇక్కడి రూపములన్నియు ఆత్మ స్వరూపములే. పరమాత్మ సత్యముయొక్క ప్రచండ ప్రకటనలే. అతడు ముందుకు పోవుచు ప్రపంచ వ్యవహారములపై అధ్యక్షత వహించు శక్తులను చూచెను. జ్ఞానము, అతనిని తన ఉన్నత శిఖరములపైపు ఆహ్వానించు చుండెను. పరాత్పర సత్య సీమల వైపు, సర్వప్రకాశమానమగు తేజస్సు అతనిని నడిపించు చుండెను. అక్కడ దేశ కాలములను వాటి సహజ స్వభావములను, అనగా పరాత్పరుని స్వకీయవ్యాపకత్వము, స్వకీయ వ్యవధులను (self-extention and self-durations) గమనించెను. అతని దృష్టికి, సృష్టిలోని సౌందర్య సామరస్యములు వానియంతట నవియే తెరచు కొనెను. అక్కడ అశ్వపతి, ప్రేరణలు, దృశ్యములు, స్ఫురణల క్రీడలను (వ్యాపారములను, క్రియాకలాపములను) దర్శించెను.

అశ్వపతి నిద్ర, మృత్యువుల పాశమునుండి విడువబడి, విశ్వమనస్సముద్రములను దాటి, శాశ్వతత్వపు టంచులు, అనిర్వచనీయమైన లోకముల పొలిమేరలను చేరెను. అతనికి పైన దివ్యశక్తులు, దేవతలకు సంబంధించిన భూమికల శ్రేణులు ఈ విశ్వము మొత్తము పై అధ్యక్షత వహించుచున్నట్లు గోచరించెను. తెలియవగిన విషయముల శిఖరములను జేరెను. చివరి రహస్య మొక్కటియే మిగిలియుండెను. అనేకత్వము, ఏకత్వములోనికి స్రవించుచు దాని వైభవములోని భాగముగ గోచరించెను.

అసత్య మచట అడుగు పెట్టలేదు. దేనికదే విశిష్టముయ్యు, అన్నియు కలిపి ఒకటిగనే యుండెను. వైయక్తిక, నిర్వ్యక్తిక చలనములు వాటి నిశ్చలతలు, ప్రక్క ప్రక్కనే నిలిచియున్నవి.

ఆత్మ సాంకేతికమగు శరీరము విశ్వప్రాణతరంగములలో శక్తిమయ అమృత బిందువుగ నుండెను. చైతన్య మొక సాంకేతికనేత. అక్కడ ఆకాశము సీమితము గాదు. కాలము భిన్నము కాలేదు; ఒకటిగనే నుండెను. భావము దృశ్యమును ఇముడ్చు కొని యుండెను. దృశ్యము ఐక్యానుభూతినుండి ఆవిర్భవించెను.

పరాత్పరుని కాంతిశక్తుల సామ్రాజ్యములో అశ్వపతి ఒక నూతన (నవ్య) జన్మను పొందెను. అతని విజ్ఞానము అగాధములను గ్రహించ గలిగెను. ముక్కలు ముక్కలుగ ఛేదింప నవసరము లేకుండగనే అతడు సర్వమును, పరిష్వంగము చేసికొనెను. అతడు అందరిద్వారా యోచించుట భావించుట చేయగలిగెను. అతడు అసంబద్ధ తత్త్వముతో (incommunicable) సంబంధము కలిగియుండ గల్గెను. దేవతలు మొదలగు గొప్ప వ్యక్తులతో సంభాషించుచు సంచరించు చుండెను. ప్రధాన ఊర్జితము అతనిలో ప్రవేశించెను. ప్రచండమైన ప్రకాశము అతని మస్తిష్కము నావరించెను. అభిమానస సీమల రహస్యమును అధ్యయనము చేసెను. ఆతడు స్వర్గీయమైన సామరస్యములతో లయ కలిపెను, తన చైతన్యమును అటు శాశ్వత సీమలతోను ఇటు సృష్టితోను సంధానము చేయుచుండెను. విశ్వశక్తిని పట్టి త్రిప్పు చుండెను.